Barcode - 2020120035190
Title - Peddapurasamstanacheritram
Subject - HISTORY
Author - Vatsavaya Raayajagapathivarma
Language - telugu
Pages - 96
Publication Year - 1915
Creator - Fast DLI Downloader
https://github.com/cancerian0684/dli-downloader
Barcode EAN.UCC-13

# పెద్దాపురసంస్థానచరిత్రము.

( ద్వితీయముద్రణము )

వత్సవాయ రాయజగపతివర్మ

విరచితము.

శ్రీ కృష్ణ దేవరాయ ఆంధ్ర భాషానిలయము,
విభాగము ................................
విభాగ సంఖ్య ................................

రాజమహేంద్రవరము.

శ్రీ మనోరమా ముద్రాక్షరశాలయందు ముద్రింపబడి

గ్రంథకర్తచే ప్రకటింపబడెను.

1915.

ఆంధ్రగీర్వాణభాషాకోవిదులును

బహుశాస్త్రవిశారదులును

ఉభయభాషాకవులును

వైఖానసధర్మచంద్రికాది గ్రంథకర్తలును

శ్రీరామభక్తులును,

అస్మదాధ్యాత్మిక గురువరేణ్యులును

నగుశ్రీరాజావత్సవాయరాయజగపతిరాజుతాతయ్యగారికిని —

స్త్రీధర్మపరిపాలకురాలును

సాధ్వీమణియు

నగుశ్రీమతి బుచ్చివెంకయ్యంబాదేవీ బాబయ్యమ్మగారికిని

మాతృహీనుఁడ నగునన్ను తల్లిలేనిలోప మిసుమంతయు లేకుండఁ బ్రేమమీఱఁజూపి విద్యాబుద్ధులు గఱపి యిప్పటిస్థితికిఁ దీసికొని వచ్చినందు లకుఁ గృతజ్ఞతతో నీగ్రంథమును సమర్పించుకొనుచు న్నాఁడను.

రాయజగపతి.

# పీఠిక.

—:o:—

ఏదియయిన నొక కార్యము చేయుట యాక్షేపణములు చేయునంత సులభముకాదు. భాషలో నక్షరములున్నంతవఱకు, నోరున్నంతవఱకు హేళనకు కొరత యుండదు. కార్యములు చేయఁగలవారు తక్కువగాని యధిక్షేపణములు చేయువారధికముగ నుండుట ప్రపంచస్వభావము. లోకవిరుద్ధము మాత్రము కాదు.

ఆకారణముచేతనే పెద్దాపురసంస్థానచరిత్రముయొక్క ప్రథమముద్రణప్రతి కొన్ని యధిక్షేపణములకు లోనైనది. అంతమాత్రముచేత నేను నిరుత్సాహ పడువాఁడనుగాను. చాలమంది విద్యాధికులు నాకుఁ బ్రోత్సాహమునే కలిగించియున్నారు. అట్టివారిలో ముఖ్యులగు, గుంటూరునందు డిప్యూటీకలెక్టరుగనున్న యాంధ్రసాహిత్యపరిషత్కార్య నిర్వాహకాధ్యక్షులగు బ్రహ్మశ్రీ జయంతిరామయ్య పంతులు, బి. యె. బి. యల్ గారును, బందరు న్యాయవాదులగు శ్రీయుత ఎల్లూరి సూర్యనారాయణరావు పంతులు బి యె. బియ.ల్. యల్.టి. గారును, గోదావరి జిల్లా సంఘకార్యదర్శియగు మహారాజశ్రీ నుగ్గిరాల సూర్యప్రకాశరావు పంతులు బి. యె. గారును, విజయనగరం మహారాజావారి కళాశాలాధ్యక్షులగు శ్రీమాన్ రావుబహదరు కిళాంబిరామానుజాచార్యులు. యం. యె. బి. యల్. యఫ్. యం యు. గారును గవర్నరుజనరలుగారి శాసననిర్మాణసభాసభ్యులగు శ్రీరాజా పానుగంటి రామారాయనింగారు (యం.యె)ను వేరు కొందఱును నిచ్చిన యమూల్యములైన యభిప్రాయములకే నెంతయుఁ గృతజ్ఞుఁడనై యుండువాఁడను.

మనదేశమందు చారిత్రవిషయికజ్ఞానమింకను శైశవదశయందుండుటచే నిట్టి ప్రోత్సాహనిరుత్సాహములు ప్రతిచరిత్రకారునకును నుండితీరును. అంతమాత్రముచేత గ్రంథకర్తయయినవాఁడు నిరుత్సాహ పడవలసిన యవసరముండదు. ఇఁక గ్రంథకర్తృత్వముయొక్క ప్రథమావస్థనుగురించి కొంచెము చెప్పవలసియున్నది.

సంస్థానచరిత్రము నామరూపములు లేక జీర్ణించిపోవుచున్నదని, నెలల కాలఁది మద్రాసువంటి పట్టణమున నెంతో వ్యయప్రయాసల కోర్చియుండి పట్టుదలతో విశేషపరిశ్రమ మీఁద మూడు సంవత్సరములకు గ్రంథమును పూర్తిచేసిన నాంధ్రాంగ్లేయభాషలయందు విశేషపాండిత్యములేని నన్ను కొంతమంది నిరుత్సాహపరచిరనిన నాంధ్రలోకము హర్షింపదు. నన్నారీతిని నిరుత్సాహపరుప యత్నించుట ధర్మమును కాదు.

నాగ్రంథమునందు లోపములు లేవని నేను చెప్పుటలేను. అనేకలోపము లుండవచ్చును. నాయభివృద్ధిని కోరు మహాత్ములిచ్చిన సకారణము లగుసలహాలకు బద్ధుఁడనయియే యీద్వితీయముద్రణమునందు కొన్ని సవరణలను జేసియుంటిని. నాకు నవీనముగ దొరకిన యాధారముల ననుసరించి కొన్ని భాగములు పెంచి వ్రాసితిని. ఇంకను కాలవిలంబ మయినకొలఁదియు నవీనాధారములు దొరకినయెడల, భ్రమ ప్రమాదజనితములైన దోషము లేవియయిన నీద్వితీయ ముద్రణమునందున్నయెడల, దేశాభిమాను లగునాంధ్రసోదరులు నాకు తోడ్పడి తృతీయముద్రణము త్వరలో జరుగులాగున చేయఁగోరుచు, సకారణముగఁ దెలుపని సవరణలు చేయబడవనియు, నసందర్భపు విమర్శనములకు జవాబీయబడ దనుటయే జవాబనియు విన్నవించు చున్నాను.

ఈగ్రంథరచనలో నాకు సహాయకారులైన యాంగ్లేయాంధ్రగ్రంథముల నాయాపుటలలో వెల్లడించియుంటిని కాని పుటసంఖ్య వేయుటకు నావద్ద నాయా గ్రంథముల వ్రాతప్రతులేగాని ముద్రితప్రతులు లేవు. పాఠశాలలలో బాలురకుప యోగించు ననేక పుస్తకములు చదివి వ్రాసినభాగములు చరిత్రజ్ఞానాభిలాషు లెఱిం గిన సుప్రసిద్ధవిషయములే! ప్రాచ్యలిఖితపుస్తకభాండారములోని స్థానికచరిత్రముల యొక్క సంపుటములు, వ్రాతప్రతులయియే యుండుటచేత నాయాప్రతుల ననుసరించి వ్రాయబడిన గ్రంథములపుటలు వేయుటకు వీలు కాదయ్యెను. అంతియగాక నా యాగ్రంథముల నాయాస్థానములఁ బేర్కొనుటయయిన నసందర్భమనునది నాయా గ్రంథపాఠకులకే తెలియవలెను. అందు ముఖ్యముగ నాకుఁ దోడ్పడినవి చామర్ల కోట, కిమ్మూరు, మొగలతూరు, కైఫీయతులును, పూసపాటివారి వృత్తాంతమును నై యున్నవి.

చిత్రపటములు ముద్రించుటకు తగినమంచికాగితము సులభ్యముగాని కతమున ముద్రింపఁబడలేదు. వీలైనచో నీగ్రంథమున కనుబంధముగ ముద్రింతును. తృతీయ ముద్రణ మయిదారు పటములతోనైన నుండితీరునని విన్నవించుచు విరమించు చున్నాఁడను.

బుధజనవిధేయుఁడు
గ్రంథకర్త

శ్రీరామాయనమః

శ్రీ

# పెద్దాపురసంస్థాన చరిత్రము.

పూర్వము పెద్దాపుర సంస్థాన మాంధ్రదేశమున నొక భాగముగ నుండెను. దానిని రమారమి మూఁడువందల సంవత్సరములవఱకు శ్రీ వత్సవాయ వంశీయులగు క్షత్రియులు పరిపాలించి యున్నారు. ఇపు డా సంస్థానములోని కొన్ని చిన్న జమీందారీలును, మఠాలును మాత్రమె యొకప్పుడు పెద్దాపుర సంస్థానములోని వనుటకు నిలిచి యున్నవి. ఇపుడు పెద్దాపుర మొక తాలూకా గ్రామముగనుండి ఆంగ్లేయదొరతనమువారి పెక్కు కార్యస్థానములతో విలసిల్లుచున్నది. పూర్వ మీ పెద్దాపుర పిఠాపుర ప్రాంతములు "పొర్లునాఁ" డనిపిలువఁబడుచువచ్చెను. ఈపెద్దాపురమునకు త్తరదిశగాఁ ప్రవహించుచున్న యేలేరునదివలన దీనికీపేరుకలిగె నని చెప్పుదురు. ఈయేలేటియాధారముననే పల్లపుభూమిలోఁ జాలభాగము సాగుచేయఁబడుచున్నది. ఇచ్చట మెట్టపంట విరివిగా నుండును. గోదావరిజిల్లాయంతలో నితరతాలూకాల ననుసరించి చూడఁగా నిచ్చట జనసంఖ్య తక్కువగ నున్నది. ఇచ్చట చతురపుమైలుకు 330మందిమాత్రమే గలరు. పల్లపుతాలూకాలకన్న నిది విద్యావిషయమున వెనుకఁబడియున్నది. పురుషులలో నూటికయిదవవంతుజనమే చదువను వ్రాయను నేర్చి యున్నారు.

ఉత్తరసర్కారులనంబడియెడి యాంధ్రదేశభాగములోని యీపెద్దాపురసంస్థానమును బరిపాలించిన శ్రీవత్సవాయరాజవంశజులు సూర్యాన్వయసంభవులని యును, వీరికి మూలపురుషుఁడు సాగిపోతరాజని యు, ఏనుఁగులక్ష్మణకవి తనరామవిలాసమనుగ్రంథమున—

"శ్రీవిష్ణునాభిరాజీవమధ్యంబునఁ బ్రభవించె విశ్వనిర్మాత ధాత,
యంభోజభవునకు సంభవించె మరీచి యతనికిఁ గశ్యపుఁ డవతరించెఁ,
గశ్యపబ్రహ్మకుఁ గలిగె బ్రహ్మాండదీపకుఁడు త్రయీమూర్తి భాస్కరుండు
వనజమిత్రునకు వైవస్వతుం డుదయించె ఘనుఁడు వైవస్వతమనువుఁ గాంచె

వత్తు నిక్ష్వాకునృపునిఁ దద్వంశమునను
దగఁ గకుత్స్థుండు రఘువును దశరథుండు
జనన మొందిరి యాదశస్యందనునకు
రాముఁడు జనించెఁ ద్రిభువనరక్షకుండు ”

“ వ. ఏతాదృశ మహాపురుషభూషితం బైన సూర్యాన్వయంబు సాగి వంశం బనం గ్రమంబుగఁ బ్రసిద్ధం బయ్యె ” నని వక్కాణించి యున్నాఁడు.

క్రీ. శ. ౧౧౭౬, ౧౧౮౨ సంవత్సరముల మధ్య జరిగిన పలనాటివీరయుద్ధమున, నలగామరాజునకు సహాయముగా సాగిపోతరాజు వచ్చినట్లు చెన్నపట్టణమునందలి లిఖితపుస్తకభాండాగారములోని పలనాటివీరచరిత్ర మను గ్రంథముయొక్క యొక ప్రతిలోఁ గానవచ్చుచున్నదిగాని యీతం డెంతసైన్యముతో వచ్చి యెటులతోడ్ప డెనో, యెట్టి పరాక్రమమును గన్పఱచెనో తెలియువివరము లేమియుఁ గానరా వాయెను.

ఈ సాగిపోతరాజుగారినిగూర్చియు, వీరివంశమునుగూర్చియు నాంధ్రచరిత్రోద్ధారకు లగు శ్రీ చిలుకూరి వీరభద్రరావు పంతులుగారు తమ యాంధ్రులచరిత్రములో ద్వితీయభాగమున ౨౫౩, ౨౫౪, ౨౫౫ పుటలలోఁ గొన్నిసంగతులు వ్రాసి యున్నారు. అందు నాయభిప్రాయనుకూలము లైనవాని నీక్రిందఁ బొందుపఱచుచున్నాను.

“చాగివారు కాకతీయచక్రవర్తులకాలమున గుడిమెట్ట రాజధానిగ నందిగామ సీమను పరిపాలనముచేసినసామంతమండలేశ్వరులుగ నుండిరి. చాగివారిలో వేఱొక కుటుంబమువారు పల్నాడు పరిపాలించుచుండి రని పల్నాటివీరచరిత్రమునఁ జదివి యున్నాము.

గుడిమెట్టచాగివారు దుర్జయవంశజుల మనియు, మనుకుల సంభవుల మనియుఁ జెప్పుకొని యుండిరి.

గుడిమెట్టచాగివారిలోఁ గొందఱు మనుకులసంభూతుల మని చెప్పుకొనియుండుట చేత వారిసంతతివారు వారిది సూర్యవంశ మనియు, వసిష్ఠగోత్ర మనియుఁ జెప్పుకొన నారంభించిరి. కాకతిగణపతిదేవరాయలకాలమునం దుండిన చాగిపోతరాజు గోదావరి మండలములోని పెద్దాపుర సంస్థానాధీశ్వరు లయినవత్సవాయవారికి మూలపురుషుఁ డని యేనుఁగు లక్ష్మణకవిప్రణీత మైనరామవిలాస మనుప్రబంధమున వర్ణింపఁ బడియెను.

“ గీ. సహ్యజాతీరమునకు భూషణ మనంగ
సిరుల కిర వగుగుడిమెట్టపురము దనకు

రాజధానిగ సత్కళాభోజరాజు
సాగిపోతక్షమాభర్త జగతి యేలె ''

ఈ సాగివంశపురాజులయొక్క శాసనములు, కృష్ణామండలములో నందిగామ సీమలో నున్న గుడిమెట్ట, ముక్త్యాల, అనుమంచిపల్లె, పెనుగంచిప్రోలు. నవాబుపేట బెజవాడ మొదలగు ప్రదేశములలోఁ గానంబడుచున్నవి. నందిగామతాలూకాలోని ముక్త్యాలగ్రామములోనున్న చెన్నకేశవస్వామిదేవాలయముయొక్క తూర్పుప్రాకారమునకు సామీప్యమునఁ బాతియున్న "నాగులబండ" అను స్తంభముమీఁద వ్రాయఁబడినశాసనములో విష్ణువునాభినుండి బ్రహ్మ జనించె ననియు, వానినుండి దుర్జయుఁడు పుట్టెననియు, అతనివంశమున ముప్పరాజు జనించె ననియు, అతనివంశమున గోంకదోరప రాజును, అతనికి పోతరాజును, ఆ పోతరాజునకు రాజాంబికయందు త్యాగరాజును (చాగిరాజు.) అతనికి దోరపరాజును, అతనికి చాగిపోతరాజును జనించిరని చెప్పఁబడినది. గుడిమెట్టలోని యొక శాసనములో చాగిదోరపరాజునకు చిమ్మాంబికయందు పోతరాజు జనించెననియు నతనికి రాజాంబిక యనుపతివ్రతయయిన భార్యకలదనియు వ్రాయఁబడి యున్నది. ఏనుఁగులక్ష్మణకవిప్రణీత మైనరామవిలాసములో సూర్యాన్వయమున సాగిపోతరాజు జనించె ననియు నతనికి నరసింహరాజును నతనికి మనుమపోతరాజును, మాచరాజును, వారిలో మాచనృపతికి ఎఱపోతరాజును, అతనికి తెలుఁగురాజు, రామరాజు ననువారును పుట్టి రనియుఁ జెప్పఁబడియున్నది. పైనఁ జెప్పినవారిలో నరసింహభూపతికుమారుఁడైన పోతరాజును లక్ష్మణకవి తనగ్రంథమునం దీవిధముగా నభివర్ణించి యున్నాఁడు.

" మ. స్థిరభక్తిన్ గుడిమెట్టలోపలఁ బ్రతిష్ఠించెన్ గృపాసింధుబం
ధురసౌధంబున విశ్వనాథుఁ బరమాత్మున్ రాజనారాయణున్
సురవంద్యున్ బెజవాడయందు నిలిపెన్ సుశ్లోకధర్మైకత
త్పరశీలుం డగుమన్మపోతనృపుఁ డేతన్మాత్రుఁడే యెన్నఁగన్."

గుడిమెట్ట శాసనములో దోరపరాజునకు చిమ్మాంబికయందు జనించినపోతరాజు పరిపాలనమును వర్ణించుచో —

" శ్రీకృష్ణవేణ్యా స్తటభూమిభాగే
శ్రీపోతభూపో గుడిమెట్ట నామ్ని
విశ్వేశ్వరాఖ్యం శివ మాదిదేవం
సంస్థాపయామాస పురే స్వకీయే॥ "

అని గుడిమెట్టలో విశ్వేశ్వరస్వామిని ప్రతిష్ఠాపనముఁ జేసె నని చెప్పఁబడియుం డుటచేత రామవిలాసములోని నరసింహునిపోతరాజును, ఈ దోరపరాజు పోతరాజును నొక్కఁడే యనిచెప్పఁదగును.

అట్లయినయెడల దోరపరాజనకు నరసింహరా జనునామాంతరము గల దని యూ హింపవలయును. ఇంతియగాక బెజవాడ కనకదుర్గాంబయొక్క యాలయములో శ్రీ నరసింహవర్ధనచాగిపోతరాజుపేరిట శాసన మొకటి గలదు. అయ్యది నరసింహుని కుమా రుఁడైన చాగిపోతరాజు శాసన మని తెలుపుచున్నది. కాఁబట్టి యిపుడు దోరపరాజు నకు నరసింహరా జనునామాంతరముగలదని విశ్వసింతము. ఈ పోతరాజు త్రిపురాంతక కాశ్మీర మల్లేశ్వర విశ్వనాథ చోడ నారాయణస్థానంబులఁ గనక కలశంబులను బెట్టించి, సింహగిరియందు నరసింహునకు సాగిపోతసముద్రం బను చెఱువుగట్టించి శ్రీపర్వతమున (శ్రీశై లమున) మల్లికార్జునదేవునియెదుట నందికేశ్వరునిం బ్రతిష్ఠించి, దేవభోగంబులకై కంభము పాడు, ముచ్చింతలు, బూదవాడ మొదలగు గ్రామముల నిచ్చి బ్రాహ్మణోపభోగంబులుగా ననేకాగ్రహారంబు లొసంగె నని బెజవాడ శాసనమునఁ జెప్పఁబడి యున్నది. ఈశాసనము కాకతిగణపతిదేవచక్రవర్తి సింహాసన మధిష్ఠించిన క్రీ. శ. ౧౧౯౯వ సంవత్సరమున వ్రాయఁబడినది. ఈకుటుంబములోనివాఁ డగుసాగిమనుమగణపతిదేవునిశాసనములు కూడ పెక్కులు నందిగామసీమలోఁ గానవచ్చుచున్నవి. అతఁడును, చాగిరాజును కాకతి గణపతిదేవుని సమకాలికులు. వీరు నతవాటిసీమలో నధికారమును వహించి యుండిరి.

ఈ సాగివంశపురాజులచరిత్రమును సంపూర్ణముగాఁ దెలిసికొనుటకు మఱికొంత కాలము పట్టును. ఇప్పటికి దొరకినసాధనము లసమగ్రములుగనున్నవి. ''

ముక్త్యాలశాసనమునుబట్టి పంతులవా రుదహరించినవంశానుక్రమణిక కొంచెము వ్యత్యాసముగఁ గాన్పించుచున్నది. ముప్పరాజునకు త్యాగిదోరపరా జనుపుత్రుఁడు గలఁడని వ్రాయఁబడియుండెనే గాని గోంకదోరపరా జనికాదు. అదియుఁగాక యీ త్యాగిదోరపరాజుపుత్రుఁ డయినపోతరాజునకు త్యాగరాజు లేక చాగిరా జనుపుత్రుఁడు గలఁడని పంతులవారు వ్రాయించియున్నారు. కాని ఆ శాసనమువలననే పోతరాజు నకు దోరపరాజే పుత్రుఁ డయినటులఁ గాన్పించుచున్నది. ఆశ్లోకముల నిట నుదహరించు చున్నాఁడను.

'' తస్మాత్సమ్మప్పధరాధిపా ద్విభు రభూ త్త్యాగాంకదోరాధిపః
తద్దోరక్షితివల్లభా ద్గుణనిధిః పోతక్షమాధీశ్వరః
శ్రీమత్తోప్పిశనరేశ్వరా న్మనినిభా ద్రాజాంబికాయా మభూ
త్సూను ర్దానవవీనభానుతనయ స్త్యాగీక్షమాధీశ్వరః ॥

తస్య త్యాగగుణాంకస్య దోరభూపస్య నందనః
త్యాగిపోతధరాధీశో రాజతే రాజమండలే ''

విశేషచరిత్రాంశములను బరిశీలించుటలోఁ బంతులుగారు తమ యాంధ్రులచరిత్రములో నట్లుప్రమాదవశమున వ్రాసియుండవచ్చును..

---

## సాగివారు వత్సవాయవారగుట.

కాకతిగణపతిదేవచక్రవర్తికాలమున సామంతమండలేశ్వరుఁడుగానుండి, నందిగామసీమలో గుడిమెట్ట దుర్గమున కధీశ్వరుఁడుగానుండి, యధికారము నెఱపుచు, త్రిపురాంతక కాశ్మీర మల్లేశ్వర విశ్వనాథ చోడ నారాయణ స్థానంబులఁ గనకకలశంబులను బెట్టించి సింహగిరియందు నరసింహునకు సాగిపోతసముద్రం బను చెఱువుఁ ద్రవ్వించి శ్రీశైలమున మల్లికార్జునదేవునిసమక్షమున నందికేశ్వరునిం బ్రతిష్ఠించి దేవభోగంబులకై కంభముపాడు ముచ్చింతలు, బూదవాడ మొదలగుగ్రామంబుల నిచ్చి బ్రాహ్మణోపభోగంబులుగా ననేకాగ్రహారంబు లొసంగి ప్రఖ్యాతిఁ గాంచిన పైసాగిపోతరాజునకు మాచరాజనుసోదరుఁడు గలఁడు. ఆ మాచనృపతికి నెఱపోతరాజు జనించెను. ఆయనకు తెలుఁగురాజు, రామరాజు ననునిరువురు పుత్త్రు లుద్భవించిరి. ఎఱపోతరాజు కాకతిరుద్రమదేవిమనుమఁడైనప్రతాపరుద్రచక్రవర్తిసేనాపతులలో నొకఁడుగానుండి, మహమ్మదీయులతో జరిగినయుద్ధములలో నవక్రపరాక్రమమును నెఱపి వీరస్వర్గమును జూఱఁగొన్న మహాశూరుఁడు. ప్రతాపరుద్రుఁడు మహమ్మదీయులతో జరిగినయుద్ధమునం దోడిపోయి, యేకశిలానగరమనునామాంతరముగల యంధ్రనగరము తురుష్కులవశమైనతరువాత ఎఱపోతరాజుపుత్త్రులగు తెలుఁగురాజు రేకపల్లిదుర్గమునకును, రామరాజు వత్సవాయదుర్గమునకు నధిపతులుగానుండి, మహమ్మదీయపాలనమునకు లోఁబడి కొంతకాలము రాచకొండదుర్గాధీశ్వరుండైనరేచర్లసింగమనాయనితోడను కొంతకాలము వేమారెడ్డిమొదలగు రెడ్డినాయకులతోడను బోరాడుచువచ్చిరి. వీరిలో రామరాజుగారు వత్సవాయ * దుర్గాధీశులై పరిపాలించుటచేతఁ దత్సంతతివారికి వత్సవాయవారనునామప్రసిద్ధి గలిగెనని రామవిలాసములోని —

---

* ఈవత్సవాయ యనుగ్రామము నైజామునుయిలాకా, జగ్గయ్యపేటకు సమీపమున నున్నది. ఇందు వత్సవాయమ్మయను గ్రామదేవతయు, నామెపేర నొక కోనేరును ప్పటికిని గలవు.

" సీ. ఆరామరాజేంద్రుఁ డాజిరంగంబున వైరిరాజులఁ గెల్చి వారిచేత
మదగజకంఖాణమాణిక్యగాణిక్య కనకాంబరము లుపాయనము లందె
యాచకశ్రేణుల కభిమతార్థము లిచ్చెఁ బ్రజల సంరక్షించె భరతునట్లు
తగ వత్సవాయాఖ్యనగరంబు నిజనివాసముఁ జేసె నదికారణముగ సాగి
ఆ.వె. వంశమునకు వత్సవాయనామము లోక
సుప్రసిద్ధ మగుచు సొంపు గాంచె."

అను సీసపద్యమువలన విస్పష్టముగా బోధపడుచున్నది. కాఁబట్టి వత్సవాయ రాజవంశజులకు మూలపురుషు లీరామరాజుగారని నిస్సంశయముగా నుడువవచ్చును. ఈయనకు రామరాజు, తెలుఁగురాజు, అనంతరాజు, గోపరాజు ననునల్వురు కుమారు లుదయించిరి. వారిలోఁ దెలుఁగురాజు రేకపల్లిదుర్గాధ్యక్షుఁడుగానుండి, శత్రువుల కజేయుఁడైయుండి విక్రమార్కచరిత్రం బనునొకయుత్తమకావ్యమునకు నాయకుఁ డయ్యె నని వైరామవిలాసములోని—

" మ. అచలాధీశ్వరధీరు రేకపలి దుర్గాధ్యక్షు విద్వేషిరా
ట్ప్రచయోద్వేలబలావలేపతిమిరప్రద్యోతనున్ విక్రమా
ర్కచరిత్రోత్తమకావ్యనాయకుని వేడ్కన్ బ్రస్తుతింపం దగున్
సుచరిత్రాఢ్యుని వత్సవాయతెలుఁగుక్షోణీశచూడామణిన్"

అనుపద్యమువలనఁ దెలియుచున్నది గానివిక్రమార్కచరిత్ర మను నాయుత్తమ కావ్యమునకుఁ గర్తయయినకవివతంసుఁ డెవఁడో తెలియరా దయ్యెను.

---

## * రామరాజుసంతతి—దేశస్థితి.

రామరాజుకునకుఁ బిమ్మటఁ దత్సంతతి వారియొక్క చరిత్రము వివరముగాఁ దెలియు నట్టి యాధారము లిన్నూరు సంవత్సరములవఱకుఁ గానరావు. సాగివంశపురాజు లాయాకాలములయందుఁ దాము నివసించుప్రదేశములనుబట్టియుఁ, బ్రసిద్ధులైన ప్రధాన నాయకుల నామములనుబట్టియు వేర్వేఱు వంశనామములను వహించి దేశముయొక్క

* ప్రకృతకాలమునఁ బ్రసిద్ధికెక్కిన యాంధ్రక్షత్రియకుటుంబములలో నొకటియ యిన బుద్ధిరాజువారివంశముకూడ నీరామరాజువారిసంతతిలోనిదే యని పెద్దలు చెప్పు దురు. ఇందుకు లిఖితరూపకమైన యాధారమేదియుఁ గాన్పింపదు. అట్టిది కనిపిం చువఱకు మనము పెద్దలమాటలనే విశ్వసింపవలసియుండును.

నానాభాగములకుఁ బోయి పౌరుషవిక్రమాదులను నెఱపుచు ప్రఖ్యాతిఁగాంచుచుండిరి. అట్లే సాగివంశములో నంతర్భాగ మైనవత్సవాయవంశములోనివారు * కూడ కొంతకాలము స్వతంత్రముగను, కొంతకాలము మహమ్మదీయుల పక్షమునను, మఱికొంత కాలము గజపతుల పక్షముననుండి ప్రతిపక్షనాయకులతోడఁ బోరాడుచు, నందందు గిరిదుర్గముల నాక్రమించుకొనుచుఁ బదునాఱవ శతాబ్దములో నీపెద్దాపురసంస్థానమును సంపాదించి, యించుమించుగా మూఁడుశతాబ్దములు పరిపాలనముచేసి కడుఁబ్రఖ్యాతి వహించిరి. క్రీ. శ. ౧౩౨౩-వ సంవత్సరములో నోరుగల్లనియెడు నంధ్రనగరము మహమ్మదీయుల వశమైన తరువాత, కాకతీయప్రభుత్వమున సర్వాధికారులుగానుండి ప్రఖ్యాతివహించినరాచవారనేకులు కృష్ణాగోదావరులనడుమ ననఁగా నోరుగల్లు మొదలుకొని రాజమహేంద్రవరము పర్యంతము గలభూభాగమునందుఁ గల గిరిదుర్గప్రదేశముల కధీశులై ప్రతిపక్షనాయకులతోడఁ బోరాడుచుండిరి. కృష్ణకు దిగువభాగమున నున్న దేశమంతయు రెడ్లకు వశమయ్యెను. ఓరుగంటికి దక్షిణభాగమంతయు పద్మనాయకుల వశమయ్యెను. క్రీ. శ. ౧౩౨౮-వ సంవత్సరప్రాంతమున మంచికొండ కూనారెడ్డి యను వీరుఁడు రాజమహేంద్రవరమునుండి తురుష్కులను తఱిమి కొరుకొండకోటనుగట్టి కృష్ణాగోదావరిమండలముల లోనియుత్తరభాగమును జయించి కొరుకొండ రాజధానిగఁ బరిపాలింప నారంభించెను. దీనికి రెడ్డిసీమ యనువాడుక యిప్పటికిని గలదు. వీరు క్రీ. శ. ౧౩౯౦-వ సంవత్సరము వఱకుఁ బరిపాలించిరి. తరువాత నాసీమ కొండవీటిరెడ్లబంధువుల పరిపాలనము క్రిందికి వచ్చెను. ఈకొండవీడు, కొరుకొండ, రెడ్లసంబంధ బాంధవ్యములచేత నొక్కటియయి, కృష్ణాగోదావరీమండలములలో నుండురాచవారిప్రదేశముల నాక్రమించుటచేత రాచవారనేకులు బహమనీరాజుల సహాయమునుబొంది, పద్మనాయకులకు, రెడ్లకు నొత్తిడి కలుగఁ జేయుచువచ్చిరి. మహమ్మదీయులతోడ్పాటుతో రాచవారు పద్మనాయకు

* ఓరుగల్లు తురుష్కులవశ మైనపిదపఁ బదునాఱవశతాబ్దమునకుఁ బూర్వమే, పదునాల్గవ శతాబ్దాదినే యీవత్సవాయవా రుత్తరముగ కృష్ణా, గోదావరిమండలములలోనికి వచ్చి, సంస్థానముల నేర్పఱచుకొని, తమదానములచేఁ బ్రఖ్యాతిని సంపాదించినట్లు ప్రతాపవత్సవాయ అయ్యప్ప దేవమహారాజుగారిని గుఱించి తెలిసికొనిన తేటపడఁగలదు. వీరిశాసనములు పెద్దాపురముతాలూకా, పెద్దాపురమున కైదుమైళ్ళదూరమున నున్నతిరుపతిలోఁ గలవు. క్రీ. శ. ౧౪౪౨ నాటి వీరిదానశాసన మొకటికలదు. దీని ననుసరించి చూడఁగా, పెద్దాపురపు సంస్థానాధిపతులు కాకమునుపే వత్సవాయవంశీయులీప్రాంతములకువచ్చి, వారి దానధర్మములచేఁ గీర్తిప్రఖ్యాతులనందుచున్నట్లును ప్రభుత్వము నెఱపినట్లును తెలియఁగలదు.

లను, రెడ్డినాయకులను జయించుటదుస్తరమగుట చేతనో, మతాంతరులైనతురుష్కుల సాహాయ్య మపేక్షించుట దేశద్రోహ మగు నన్నతలంపుచేతనో గాని కళింగోత్కల దేశాధీశ్వరు లగుగజపతుల సహాయమునుబొంది, కపిలేశ్వరగజపతిరాయలకాలమునఁ బశ్చిమమున నోరుగల్లువఱకును, దక్షిణమునఁ గాంచీపురమువఱకును జయించిరి. వత్సవాయవారు, సాగివారు, పూసపాటివారు, మందపాటివారు, దంతులూరువారు, దాట్లవారు, గణపతిరాజువారు మొదలుగాఁగల సుప్రసిద్ధులగు రాచవార నేకులు గజపతులక్రింద సర్వాధికారములను వహించి ప్రబలులైరి. ఆంధ్రదేశమునం దున్నక్షత్రియు లందఱు తమ యనుపమానశౌర్యసాహసములను బ్రకటించినకాల మిదియే!

క్రీ. శ. ౧౪౨౧-వ సంవత్సరములో బహమనీరాజైన అహమ్మదుషా త్రిలింగదేశపురాజులను జయించి ఓరుగల్లుపట్టణమును వశపఱచుకొనియెను. కాని ౧౪౬౦-వ సంవత్సరములోఁ గళింగదేశపురాజును, కపిలేంద్రగజపతిమహారాయలకుమారుఁడును నగు ఉర్వరదేవకుమారమహాపాత్రుఁడును, పరశురామతనయుండును నగువీరభద్రరాజును గలిసి ఏకశిలానగరముపై దండెత్తివచ్చి, మహమ్మదీయుల నచ్చటినుండి పాఱఁద్రోలి, ఓరుగల్లును మఱల స్వాధీనము చేసికొన్నట్లు, అచ్చటివారిశాసనములవలన బోధపడుచున్నది. అయినను * ౧౪౬౩-వ సంవత్సరములో రెండవ మహమ్మదు సింహాసనమునకు వచ్చి, ౧౪౭౧-వ సంవత్సరములో గజపతులకు సామంతులుగానున్న మండలేశ్వరులన్యోన్యవైషమ్యములను బెంచికొని, తమలోఁదాముపోరాడుచుంటనుజూచి, కొండపల్లి రాజమహేంద్రవరదుర్గములను, దత్ప్రాంత ప్రదేశములను దనరాజ్యములోఁ జేర్చికొనుటకై సంకల్పించి, విఫలమనోరథుఁ డయ్యెను. తరువాత కపిలేంద్రగజపతి మరణము నొందఁగా పురుషోత్తమగజపతిమహారాయలు సింహాసనమునకువచ్చెను. అందును గూర్చి యతనికిని, నతనిదాయాదికిని వివాదముపొసఁగి, యాదాయాది మహమ్మదీయుల సాహాయ్యమునుగోరెను. అప్పుడు బహమనీరాజైనరెండవమహమ్మదుషా యదివఱకే గజపతుల రాజ్యము నపహరింపవలె నను పేరాసతో నున్నవాఁడగుటచేత మిక్కిలిసంతోషించి, యాపని నిర్వహించుటకై, మల్లిక్-ఉల్-ముల్క్ అను బిరుదము నొసంగెను. ఈబిరుదమే తరువాత మహమ్మదీయుల బిరుదములలో మిక్కిలి ప్రఖ్యాతివహించినదయ్యెను. ఈనిజామ్-ఉల్-ముల్క్ మొదట హిందువుడుగానుండి, బాల్యములో మహమ్మదీయులచేఁ జెఱఁగొని పోఁబడి యంతఃపురమున రాజునకు సహవాసిగా నియమింపఁబడి, మహమ్మదీయమతావలంబకుఁడై, బహమనీరాజుయొక్క దయకుఁ బాత్రుఁడై, యభివృద్ధిఁగాంచి, ప్రఖ్యాతికెక్కినవాఁడుగానుండెను. తరువాత నితఁడు గజపతులరాజ్యముపైకి దండె

* Godavary District Manuel: Mahommedan period.

వచ్చిపోయి, కొండపల్లి రాజమహేంద్రవర దుర్గములను జయించి, యాదేశములను దన ప్రభువు రాజ్యములోఁ జేర్పించెనుగాని తరువాత నయ్యవి యొక్క సంవత్సరము కాలములోనే గజపతులకు సామంతులుగా నున్న మండలేశ్వరుల వశ మయ్యెను. అంతట రెండు సంవత్సరములు దేశములో క్షామోపద్రవము సంభవించి, వర్షములు లేక పంటలు పండక, బావు లింకిపోయి, ప్రజలు వలసపోవుట తటస్థించెను. ఈరెండుసంవత్సరములలోను త్రిలింగదేశమును, బహమనీరాజ్యమును గూడ వేడిమంగలమువలె వేఁగుచుండుటచేత విత్తనములచల్లికయే లేకపోయెను. కాని కొంతకాలమునకు భగవదనుగ్రహమువలన వర్షము కురిసి భూమి వ్యవసాయమున కనుకూలముగ నున్నను, వ్యవసాయము చేయుజనులసంఖ్య మిక్కిలి తక్కువై యుండెను. ఇట్లుండఁ గొండపల్లిదుర్గములో నున్న తెనుఁగుసైన్యము తిరుగఁబడి, దుర్గాధ్యక్షుఁ డగుమహమ్మదీయప్రభువును సంహరించి రనియు, ఏతద్దుర్గమును వశపఱచుకొన్న యొరిస్సాగజపతులసేనానులలో నొకఁ డగుభీమరాజు దేశమంతయు క్షామభూయిష్ఠమై యుండుటచేత బహమనీరాజుల ప్రాభవ మంతయు సైన్యములవ్యయముక్రింద తరిగిపోయి, సైన్యములసంఖ్యగూడ తగ్గియున్న దనియు, పూర్వార్జితమైనదేశము నంతయు స్వాధీనముఁ జేసికొనుట కిదియే తరుణముగావున దండెత్తిరావలసినదనియు, తనకుఁ జేతనైనసహాయముఁ జేయుటకు సిద్ధముగా నున్నా ననియు, గజపతిరాయలకడకు రాయబారి నొకనిఁ బంపెననియు, గజపతి పదివేలగుఱ్ఱపుదళముతోడను, ఎనిమిదివేలపదాతివర్గముతోడను దండయాత్ర బయలుదేఱి వచ్చుచుండుటను విని, రాజమహేంద్రవరము కొండపల్లిప్రాంతదేశములకు గవర్నరుగా నున్న నిజామ్-ఉల్-ముల్కు శత్రువు నెదుర్కొనఁ జాలక, రాజమహేంద్రవరదుర్గములోఁ బ్రవేశించి, దుర్గద్వారమును మూయించి, సహాయమునకై నిరీక్షించియున్నాఁ డనియు, నిజామ్-ఉల్-ముల్కువలనఁ బంపఁబడినచారులు వచ్చి కొలువుకూటమున మహమ్మదుషాకు నివేదించిరి.

అప్పుడు మహమ్మదుషా యుగ్రుఁడై, తాను స్వయముగనే శత్రువులపైకి దండయాత్ర వెడలుటకు నిశ్చయించుకొని, తనసైన్యమున కంతకును నొకసంవత్సరమున కయ్యెడుజీతబత్తెములను ముందుగనే యొసంగి, గొప్పసైన్యముతో బయలుదేఱి కొన్నిదినములకు రాజమహేంద్రవరము వచ్చి చేరెను. ఈవార్త విని, శత్రువులను వంచించి, వారిని మార్కొనకయే, భీమరాజు మరలిపోయి, కొండపల్లిదుర్గమును జేరెను. ఇంతసైన్యమును బహిరంగప్రదేశమున నెదుర్కొనుటకు సాహసింపఁజాలక, గజపతి పలాయనుఁ డయ్యెను. ఇంతలకుఁ గోపోద్రిక్తమనస్కుఁ డై, తన కుమారుఁ డైనమహమ్మదుఖానును, విశ్వాసపాత్రుఁ డైనప్రధానమంత్రి యగు

ఖ్వాజామహమ్మదుగవానును రాజమహేంద్రవరమున నిలిపి, ఉత్కలదేశముపై దండెత్తిపోయి, దేశమును బాడుచేసియు, ప్రజలను జూఱఁగొనియుఁ, దృప్తిఁగనఁ జాలక, గజపతిని సింహాసనభ్రష్టునిఁ గావించి, గజపతిరాష్ట్రమునంతయు శాశ్వతముగఁ దనరాష్ట్రములోఁ జేర్పవలయు నని నిశ్చయించి, తనకొడుకును, మంత్రిని రాజమహేంద్రవరమునుండి రప్పించెను. కాని బుద్ధిశాలి యగుగజపతి సమర్థులచే రాయభారము నడిపించి, కొంతధన మాతనికి సమర్పించి, తురుష్కులు మరలిపోవు నటులఁ జేసెను. ఆ ధనముతో మహమ్మదుషా తృప్తిఁ బొందనందున, ప్రాణసమానముగాఁ జూచుకొను చున్నయిరువదియైదు యుద్ధగజములనుగూడ సమర్పించెను. అంతట మహమ్మదుషా మరలి కొండపల్లికడకు వచ్చి, రోషావేశపరవశుఁడై కొండపల్లిదుర్గమును ముట్టడించెను. కాని యాఱుమాసములవఱకు దుర్గము స్వాధీనము కాకపోయెను. ఆహారపదార్థములు తక్కువయగుటచేత భీమరాజు దుర్గములో నిలువఁ జాలక లోఁబడి, దుర్గమును తురుష్కులవశము చేసెను. మహమ్మదుషా తనకింత కాలమువఱకు దుర్గము వశము కానందుకు మండిపడుచు, మతాభినివేశపరవశుఁడై, యచటి దేవాలయములలో నొకదానిం బ్రవేశించి, తనచేతిఖడ్గముతో బ్రాహ్మణపూజారులను గొందఱిని నఱికి, లింగమును బగులఁగొట్టి యాప్రదేశమున నొకమసీదు కట్టించి, దానధర్మములను విరివిగాఁ గావించి, యాసుఁ బ్రార్థనలను జరిపి, దివానుయొక్క ప్రోత్సాహముచేత "ఖాజీ" యను బిరుదమును వహించెను. ఇంత చేసినను దేశము వీరికి స్థిరపడక, పురుషోత్తమగజపతిమహారాయలచే మఱల జయింపఁబడి, గజపతులపరిపాలనమునందే యుండెను. అటుతరువాతఁ బదునాఱవశతాబ్దము ప్రారంభమున విద్యానగరాధీశ్వరుం డగుకృష్ణదేవరాయచక్రవర్తి యసంఖ్యాకము లగుసైన్యములతోఁ బూర్వదిగ్విజయయాత్ర వెడలివచ్చి ఉదయగిరి, కనకగిరి, వినుకొండ, కొండవీడు, బెల్లముకొండ, నాగార్జునకొండ, కొండపల్లి, రాజమహేంద్రవరము, సింహాద్రి, ఒడ్డాదిమొదలగు దుర్గముల నాక్రమించి, గజపతిసైన్యములఁ బాఱఁదోలి, తుదకు ప్రతాపరుద్రగజపతితో సంధి చేసికొన నంగీకరించి, యాతనికొమార్తెను వివాహము చేసికొని, గోదావరిపర్యంతముగలభూభాగమును మరల గజపతుల కిచ్చి వేసెను. మహమ్మదుషామరణానంతరము నా యా పరగణాలకుఁ బరిపాలకులుగా నున్నవారు రాజద్రోహులై, బహమనీరాజ్యమునుండి విడిపోయి తమపాలనమున నున్నపరగణాలకుఁ దామే రాజుల మని ప్రకటించి స్వతంత్రపరిపాలనము చేయ నారంభించిరి. అట్టి వారిలో సుల్తాను-కూలీ-కుతుబ్-ఉల్-ముల్కు గోలకొండ రాజధానిగఁ జేసికొని తెలుఁగు దేశమును బరిపాలింప

నారంభించెను. ఇతఁడు తురుష్కదేశమునుండి వచ్చిన యొక యుద్ధవీరుఁడు. ఇతఁడు బహామనీరాజ్యమునుండి కొంతప్రదేశము నాక్రమించుకొనుటతో మాత్రము తృప్తి నొందక, మహమ్మదీయమతమునకు శత్రువులుగా నున్నయాంధ్రరాజులను జయింపఁగోరి విజృంభించెను. కంభముమెట్టున కధిపతి యైనసీతాపతి నోడించి, యంతవఱకుగల తెలుఁగుదేశము నాక్రమించెను. అద్దంకి గంగాధరకవి వీనివిజయములను దనతపతీసంవరణోపాఖ్యానములో—

"సీ. పడమటను సవాయి బసవనిఁ గాఁజేసి యచటఁ గొయ్యలకొండ నావరించె
తపది మల్లాఖాను దక్షిణంబునఁ గొట్టి హరియించెఁ బానుగ ల్లాదిగిరులు
నుత్తరంబున బరీదోడి పాఱఁగఁ దోలి మెతుకుదుర్గంబాక్రమించిమించెఁ
బ్రథమదిక్కున నొడ్డి పాత్రసామంతుల ధట్టించి కంభముమెట్టఁ గొనియె
నతనిఁ బొగడంగఁ దగదె యాచతురసీతి
రూఢి గిరిదుర్గలుంఠనప్రౌఢతేజు
వాహశిఖరాధిరోహరేవంతమూర్తి
కుతుబశాహినిజ్మపాలు గుణవిశాలు"

అనుపద్యంబునం దభివర్ణించెను. ఇతఁ డాంధ్రదేశముపై దండెత్తివచ్చి వరుసగా కంభముమెట్ట, కొండపల్లి, ఏలూరు, రాజమహేంద్రవరము, శ్రీకాకుళము మొదలగు దుర్గములను ముట్టడింపఁగా విశ్వనాథదేవగజపతి, సుల్తాను-కూలీ-కుతుబ్‌షాతో సంధిచేసికొని, యుభయరాజ్యములకు గోదావరినది సరిహద్దుగా నిర్ణయించుకొనిరి. అంతట సుల్తాను కూలీకుతుబ్‌షా తన ముఖ్యనగర మైనగోలకొండకు మరలి పోయెను. ఇతఁడు ౧౫౪౩ వ సంవత్సరములోఁ దొంబదవయేటఁ దనరెండవకుమారుఁ డైనజమ్షీదుచేఁ జంపఁ బడియెను. తరువాత ౧౫౫౦ వ సంవత్సరమునఁ బ్రసిద్ధివహించిన ఇబ్రహీమ్-కూలీ-కుతుబ్‌షాహ తెలింగనాదేశము నాక్రమించుకొనియెను. ఇతఁడు సుల్తాను-కూలీ-కుతుబ్‌షాహయొక్క నాలుగవ కొమరుఁడు. ఇతనికి జగదేవరావనునాంధ్రుఁడు మంత్రిగా నుండెను. ఇతని సైన్యములో రెండువంతు లాంధ్రులుగా నుండిరి. అయినను మతభేదముచేత విశ్వాసపాత్రుఁ డయ్యును, జగదేవరావు తనమంత్రిత్వమును నిర్వహింపలేక, ఇబ్రహీముతో సరిపడక, విజయనగరసామ్రాజ్యమున కభిషిక్తుఁ డైనసదాశివరాయనిమంత్రియగు రామరాజుతోఁ జేరుకొని, కుతుబ్‌షాసైన్యములతోఁ బోరాడుచుండెను. అంతట హిందూమహమ్మదీయప్రభువు లనేకు లేకమై, గోలకొండదుర్గమును ముట్టడించిరి. కొండవీటిదుర్గమున కధిపతిగానున్న రామరాజుమేనల్లుఁడు తిమ్మరాజు కొండపల్లిదుర్గమును బట్టుకొనియెను.

గజపతులపక్షమున సీతాపతి, వేదాద్రి వత్సవాయ ముసలితిమ్మరాజుగారును దండెత్తివచ్చి, ఏలూరుదుర్గమును ముట్టడించిరి. ఏలూరుసర్కారునకు డిలావర్ ఖానుఁడు గవర్నరుగానుండి, కోటలోనుండి యధికపౌరుషముతోఁ బోరాడెను గాని నిష్ప్రయోజనమై, మిక్కిలి దురవస్థలో నుండి, గోలకొండ కనేకచారులను బంపించి, సహాయమునకై నిరీక్షించి యుండెను. అంతట ఇబ్రహీము తన్ను ముట్టడించి యున్న శత్రువులతో సంధిచేసికొని కొంతసైన్యమును డిలావర్ ఖానునకుఁ దోడ్పడుటకై యేలూరునకుఁ బంపించెను. డిలావర్ ఖానుఁ డీసైన్యముయొక్క తోడ్పాటుచే శత్రువులను దరిమి, కుతుబ్ షాహ యొక్క యుత్తరువును శిరసావహించి, శత్రువులు సరిహద్దును దాటిరాకుండ, నిడుదవోలులో నొకకోటఁ గట్టించెను. ఈకోటను గట్టి డిలావర్ ఖాను రాజమహేంద్రవరదుర్గమును ముట్టడించి స్వాధీనము చేసికొనుట యుక్తమని కుతుబ్ షాకు బోధించెను.

## —:రఫత్ ఖానుని దండయాత్ర:—

అప్పుడు హరిచందనదేవుఁడు లేకవిష్ణుదేవుఁ డనునాంధ్రుఁడు గజపతులరాజ్యము నాక్రమించుకొని, బంగాళాదేశము మొదలుకొని గోదావరిపర్యంతముఁగల తూర్పుతీరమును బరిపాలించుచుండెను. రాజమహేంద్రవరదుర్గ మాతనిరాజ్యములో నిదిగా నుండి, తత్ప్రాంతప్రదేశమునకుఁ బరిపాలకుఁడుగానున్న వేదాద్రిచే (రెడ్డికాఁబోలు) సంరక్షింపఁబడుచు నాంధ్రమహమ్మదీయులకు దుస్సాధ్యముగ నుండెను. ఈదుర్గాధ్యక్షుఁ డైనవేదాద్రి కొంచె మించుమించుగా స్వతంత్రుఁ డై, వ్యవహరించుచుండెను. రెడ్డిసంస్థానమునకుఁ బరిపాలకుఁ డై వేదాద్రికి ప్రధానమంత్రిగా నున్నవత్సవాయ పేట్రాజుగారిపుత్రుఁడును మహావీరుఁడు నగుముసలితిమ్మరాజుగారు రెండువేలసైన్యమున కధీశ్వరుఁ డైనసరదారుగానుండి, మహమ్మదీయులతోఁ జెలిమి చేయ నారంభించెను. ఆయన మహమ్మదీయులకుఁ దోడ్పడుటకును, అందునకుఁ బ్రతిఫలముగ వారు కిమ్మూరుసీమను దమ కిచ్చునట్లును నొండంబడిక చేసికొని యుండెను. ఇంతియగాక కళింగదేశమున మాండలికరాజు లన్యోన్యము వంచకులై, యొండొరులతోఁ బోరాడుచుండిరి. బంగాళాదేశప్రాంతమునుండి శత్రువులు దండెత్తివచ్చుటచేత హరిచందనుఁ డుత్తరభాగమున యుద్ధములు చేయుచుండెను. ఈకారణములచేత ఇబ్రహీము ఉత్సాహవంతుఁ డైనడిలావరుఖానునికోరికను మన్నించెను. అప్పుడు ప్రసిద్ధికెక్కినసేనాని యగురఫత్ ఖానులారీయను నాతనికి మల్లిక్ నాయబ్ అనుబిరుదము నొసంగి, సైనాధ్యక్షునిఁ గావించి, తత్క్షణముపోయి నిడుదవోలుదుర్గమునఁ

ప్రవేశించి, రాజమహేంద్రవరము వెళ్లుటకు సంసిద్ధుఁడవుగా నుండవలసినదని యాజ్ఞాపించి పంపెను. రఫత్ ఖానులారీ పదివేలగుఱ్ఱపుబలముతోఁ బయలుదేఱి వెళ్లెను. ఇతని రాకకు భయముచెంది, వేద్రాద్రి సీతాపతి మొదలగు గజపతులసేనాపతులు తమ పొరుగుననున్న మాండలికులను హెచ్చరించి, రాజమహేంద్రవరమున సైన్యముల సమకూర్చుచుండిరి. మహమ్మదీయచరిత్రకారులు తెల్పినది సత్యమగునేని వీరిసైన్యము లక్షకాల్బలమును, రెండువేలగుఱ్ఱపుదళమును, రెండువేలతుపాకివాండ్లను గలిగియుండెను. అంత్రముశే గోదావరినిదాటి, మహమ్మదీయులను మార్కొనిరఁట. అప్పుడు ఘోరమైనయుద్ధము జరిగెననియు, నాయుద్ధములో హిందువులు నిలువఁజాలక మరలివచ్చి, రాజమహేంద్రవరముఁ బ్రవేసించిరనియుఁ నొక చరిత్రకారుఁడు * వ్రాయుచున్నాఁడు. మహమ్మదీయులకు జయము లభ్యమైనను, తమశత్రువులను వెంబడింపక పోవుటకుఁ గారణము కాన్పింపదు. అంతియగాక మహమ్మదీయులు తరువాత నెమ్మదిగాఁబోయి ధవళేశ్వరముకడ గోదావరినిదాటి దానినివశపఱచుకొని, దండునిలుచుతావుగఁ జేసికొనుటకుఁగూడ కారణము కాన్పింపదు. కావున హిందువులు గోదావరిని దాటి మహమ్మదీయులపైకి ముందుగాఁ బోయియుందురని తలంపరాదు. ఇట్లు రఫత్ ఖాను ధవళగిరిప్రవేశించి, తనసామాగ్రిని, కొంతసైన్యము నచ్చట నిలిపి, కొంత సైన్యముతోఁ బోయి, తాటిపాకదుర్గమును బట్టుకొనఁ బ్రయత్నించెను. నరసింగరాననువీరుఁడు దానిని రక్షించుచుండెను. వర్షకాలముకూడ తటస్థమయ్యెను. మహమ్మదీయు లోడిపోయినందున వర్షకాలము వెళ్లినతరువాత మఱలవచ్చి ముట్టడింపఁదగునని నిశ్చయించి, తురుష్కసేనాపతి తనసైన్యములను మరలించుకొని పోయెను. వర్షకాలము వెళ్లినతరువాత మహమ్మదీయులు తాటిపాకదుర్గమును వశము చేసికొనిరి. ♦ తాటిపాకసీమ యంతయు మహమ్మదీయులవశ మయ్యెను. ఆసైన్యము తిరిగి వచ్చినతరువాత తిన్నగఁబోయి రాజమహేంద్రవరమును ముట్టడింపఁదలంచిరిగాని విజయనగరాధీశ్వరుండైనరామరాయలకును, దక్కనుసుల్తానులకును తల్లికోటకడ ఘోరమైన మహాయుద్ధము జరుగుచున్నందున రఫత్ ఖానులారీ కుతుబ్ షా యాజ్ఞనుశిరసావహించి, తురుష్కసైన్యముల నన్నిఁటిని మరలించుకొని, మూలబలమును జేరుకొన గోలకొండకుఁ బోయెను. క్రీ. శ. ౧౫౬౪ వ సంవత్సరములో నాంధ్రకర్ణాటులకు, మహమ్మదీయులకు తల్లికోటకడ ఘోరయుద్ధము జరుగుటయు మహమ్మదీయులకు విజయము కలుగుటయు, రామరాజు, వేంకటాద్రి కదనభూమినిఁ బడుటయు తిరుమలరాజు పెనగొండకుఁ బాఱిపోవుటయు, విజయనగరము మాఱఁగొనఁబడి

---

* ఫెరిస్టా. ♦ తాటిపాకసీమ ప్రస్తుతపు రాజవోలుతాలూకాలో నున్నది.

విసర్జింపఁబడుటయు మొదలగునవి సుప్రసిద్ధము లైనచరిత్రాంశములు. పండ్రెండు మాసములు గడచినవెనుక రఘత్ ఖానులారీ పదివేలగుఱ్ఱపుదళముతో మరల రాజమహేంద్రవరముపై దండెత్తివచ్చెను. అతఁడు ధవళేశ్వరము చేరునప్పటికి సీతాపతి పెద్దాపురము, రాజానగరములనుండి సేనలను రాజమహేంద్రవరమునకుఁ జేర్చునట్లుగా సమాచారము తెలియవచ్చెను. అతఁడు తత్క్షణమే పోయి పెద్దాపురమును ముట్టడించి, సేనలు రాజమహేంద్రవరమునకు రాకుండ నడ్డుపెట్టవలయునని నిశ్చయించుకొని బయలుదేఱఁగా, దారిలో సీతాపతికిని రఘత్ ఖానునకును గొప్ప యుద్ధము జరిగెను. అప్పుడు సీతాపతి యోడిపోయి పెద్దాపురముకోటలో దాఁగొనియెను. రఘత్ ఖాను పెద్దాపురమును ముట్టడించెను. సీతాపతి తనకుటుంబముతోఁ దప్పించుకొని రాజానగరదుర్గమునకుఁబోయి చేరెను. పెద్దాపురదుర్గము ప్రయాసముమీద శత్రువులవశ మయ్యెను. ఆమఱునాఁడు రఘత్ ఖాను రాజానగరముపై దాడి వెడలెను. అడవులు దట్టముగానుండి దారు లిరుకైనవి యగుటచేత దినమునకు రెండుమైళ్లకంటె నెక్కువగా మహమ్మదీయసైన్యములు ప్రయాణము చేయఁ జాలకపోయెను. మార్గమధ్యమున, శత్రువు లందంద మార్కొనుటవలన మూడువందలసైనికులకంటె నధికముగా మరణము నొందిరి. ఎట్లయినను మార్గము చేసికొని మహమ్మదీయులు రాజానగరమును ముట్టడించునప్పటికి సీతాపతి తనసైన్యముతోఁ దప్పించుకొని రాజమహేంద్రవరమునకుఁ బోయి, వేదాద్రితోఁ జేరికొనియెను. అంతట మహమ్మదీయసైన్యాధిపతి రాజమహేంద్రవరముపైకి దాడివెడలెను.

## —: రాజమహేంద్రవరయుద్ధము :—

అప్పుడు రాజమహేంద్రవరముకోటసమీపమున మున్నెన్నఁడును జరిగియుండదని యొక మహాయుద్ధ మిరుపక్షములవారికిని జరిగి, రక్తనదులు ప్రవహించెను. హిందువులు కుడిప్రక్కనున్న మహమ్మదీయసైన్యభాగము నోడించి తఱిమిరిగాని వారికిఁ దరువాత ధవళేశ్వరమున నిలువయున్న మూలబలము వచ్చి తోడ్పడుటచేత హిందువులు బహిరంగప్రదేశమున నిలువఁజాలకఁ దుర్గములోఁ బ్రవేశించిరి. రఘత్ ఖానుఁడు నాలుగు మాసములవఱకుఁ గోటను ముట్టడించియుండెను. అప్పటికి హిందూసైనికులకుఁ గోటలో నిల్చుట దుర్భరమై యుండెను. అప్పుడు వేదాద్రి సంధికై తన మనుష్యులను రఘత్ ఖానునికడకుఁ బంపెను. రఘత్ ఖానుఁడు తనకడ లేఖరిగానున్న ల్లపండితునిఁ బంపించెను. వేదాద్రిని, సీతాపతిని వారికుటుంబములతో విడిచి పెట్టుటకు నొప్పుకొన్నయెడలఁ గోట వశము చేసెద మని వర్తమాన మంపిరి. అందుకు

యుద్ధమున విసిగి వేసరి యున్న రఫత్ ఖానుఁ డంగీకరించెను. వేదాద్రి ఖాసింకోటకును, సీతాపతి విజయనగరమునకును స్వకుటుంబములతో వెడలి పోయిరి. రాజమహేంద్రవరము క్రీ. శ. ౧౫౭౧-౭౨ సంవత్సరములలో మహమ్మదీయులవశ మయ్యెను. అయ్యది నాఁటినుండి మఱియెన్నఁడును హిందువుల వశమున నుండలేదు. ఈ యుద్ధమువలన లాభముపొందిన సరదారుఁడు వత్సవాయ ముసలితిమ్మరాజుగారు మాత్రమే యై యున్నారు. తరువాత రఫత్ ఖాను మలారీ కుతుబ్ షాహాయాజ్ఞప్రకారము ఖాశింకోట మొదలగు దుర్గములపైకిఁగూడ దండెత్తిపోయి ఖాశింకోటసమీపమున హిందూ సైన్యాధిపతి యగు వేంకటరాజు నోడించి బందరు మొదలుకొని కటకమునఱకుఁ గల దేశమునంతయు జయించి రాజమహేంద్రవరమునకు మరలి వచ్చెను. దేశములోని వివిధప్రదేశము లాంధ్రరాజులచేఁ బరిపాలింపఁబడుచున్నను వారెల్లరును మహమ్మదీయులకు లోఁబడినవారై కప్పములు చెల్లించువారుగా నుండిరి. అట్టివారిలో వత్సవాయముసలితిమ్మరాజుగారు మిక్కిలి ప్రముఖులుగా నుండిరి.

---

## —:వత్సవాయ ముసలితిమ్మరాజుమహారాజులుంగారు:—

(క్రీ. శ. ౧౫౫౫—౧౬౦౭)

వీరు పెద్దాపుర సంస్థానమును సంపాదించినవిధము స్థానికచరిత్రమునం దిట్లు చెప్పఁబడు చున్నది. పెద్దాపురముచుట్టు నుండుప్రదేశము పూర్వకాలమున కిమ్మీరుఁ డను కిరాతరాజుచేఁ బరిపాలింపఁబడిన దనియు, వానిపేరిటనే కిమ్మూరు గ్రామమున దుర్గము నిర్మింపఁ బడిన దనియు, ఆకారణమున నీప్రదేశము కిమ్మూరుసీమ యని వ్యవహరింపఁ బడుచుండె ననియుఁ దెలియు చున్నది. ఇయ్యది మొదట రెడ్లపరిపాలనముక్రిందనుండి దేశము గజపతులయధీనమైనతరువాత వత్సవాయముసలితిమ్మరాజుగారిచే సంపాదింపఁబడినది. అల్లాడ వేమారెడ్డిసంతతివాఁడైన రెడ్డివేంకటప్ప యనునాతఁడు కిమ్మూరు, కొవ్వాడ, గురుగుమిల్లి, గూటాల, క్రొత్తపల్లి, ప్రోలునాఁడుసీమలను బరిపాలించుచున్నప్పుడు వానిసరదారుఁడైనయిసుకపల్లి పెరుమాళ్ల పాత్రుఁ డనునాతఁడు కిమ్మూరుసీమను బరిపాలించుచుండెను. ఈతని యనంతరమున నీసీమ కీతనివంశములోనివాఁడే యగు పెద్దాపాత్రుఁడు పరిపాలకుఁ డయ్యెను. ఈతఁడు తనసిబ్బంది కైనవ్యయము పోఁగా మిగిలినయాదాయమును నగరునకుఁ జేర్పవలసిన దనియధికారు లగురెడ్లచే నాజ్ఞాపింపఁబడియెను. ఈ పెద్దాపాత్రుఁడు కిమ్మూరుసీమలోఁ జేరిన తమిరె యను గ్రామమునకు నుత్తరభాగమున రెండుగుట్ట

లుండఁగా వానిని లోఁపుచేసికొని కోటనుగట్టించి మన్నుగోడ పెట్టించి, వానిపై బుట్టును బురుజులు తీర్పించి దానికి దక్షిణమున పెద్దాపురమను పేటను గట్టించి ప్రభుత్వము చేసెను. తరువాత విస్సమ్మ యను రెడ్డివనిత యీ సీమలను బరిపాలించుచు రెండువేలపౌజునకు సరదారుగా నున్న వత్సవాయ ముసలితిమ్మరాజుగారికి తనఖా బెట్టెనఁట. ఆమెయనంతరము ముసలితిమ్మరాజుగారు పెద్దాపురముకోట కధిపతులై వేహాద్రికి మంత్రియై యుండి మహమ్మదీయులను రాజమహేంద్రవరదుర్గమును వశపఱచి, తాను వారికి మిత్రుఁడై పెద్దాపురిప్రాంతదేశమును మహమ్మదీయులు జయించినను తానే స్వతంత్రపరిపాలనము చేయ నారంభించెను. వీరి పౌరుష పరాక్రమాదివిశేషములు రామవిలాసములో —

"సీ. రణమున గజ్జెంపు రౌతులఁ బరిమార్చె వాసిగా నెఱజెర్లవాకలోనఁ
పెద్దాపురంబున బిరుదాంకపురిలోన యవనవీరులఁ బరాహతులఁ జేసెఁ
బ్రకటించునరేంద్రసుతునిదర్పమడంచెఁ దిరుపతిచెంతఘూనరులు మెచ్చ
మూరుపునాట శత్రుక్షత్రనక్షత్ర రుచిరూపుమాపె సూర్యుం డనంగ
నంగవంగకళింగ గౌళాదిదేశ
వసుమతీనాథ సభలలో వార్తకెక్కె
వత్సవయ పేర ధారుణీశ్వరునిసుతుఁడు
రమ్యగుణశాలి శ్రీ తిమ్మరాజమౌళి" .

అను సీసపద్యములో నభివర్ణింపఁబడియెను. ఈయన శ్రీకాకుళ నవాబగు షేరుమహమ్మదుఖానునిచే నొకఖడ్గమును బహుమానముపొందినట్లుగా పైగ్రంథములోని —

"ఉ. షేరుమహమ్మదుక్షితిప శేఖరుఁ డద్భుతశౌర్యధైర్య సద్
వ్యారుఁడు మెచ్చి పైడియొరవాల్ దనకేల నొసంగు వేళ శౌ
ర్యారిసమానమూర్తి తనహస్తముమీఁదుగ నందె వారిగం
భీరుఁడు వత్సవాయకుల పేరయతిమ్మనృపాలుఁ డున్నతిన్"
అనుపద్యమునఁ జెప్పఁబడి యుండెను.

వీరు వత్సవాయరామరాజుగారికి నెనిమిదవతరమువారుగా నుండిరి. వత్సవాయ రామరాజుగారికిఁ దెలుఁగురాజుగారును, వారివంశమునఁ దిరుమలరాజుగారును, వారికి నాగరాజుగారును, వారికిఁ దిరుపతిరాజుగారును, వారికి సింగరాజు, జగ్గరాజు నను వారును, వీరిలో జగ్గరాజుగారికి పేరరాజుగారును వారికి పై ముసలితిమ్మరాజుగారును జగ్గరాజుగారును జనించి నట్లుగా రామవిలాసములోని వంశావళింబట్టి తెలి

నుచున్నది. వీరితల్లిగారు గొట్టుముక్కల నరసరాజుగారి పుత్త్రికారత్న మైన నారమాంబగారని శేషధర్మము లనియెడి ప్రబంధములోని—

“ సీ. బుధు లెంచుతాలిమి భూమిదేవికి సాటి సత్పుత్త్రమహిమఁ గౌసల్యసాటి
యతిథిపోషణమున నన్నపూర్ణకు సాటి పలుకునేర్పున బ్రహ్మపొలఁతి సాటి
యనఘపాతివ్రత్యమున నరుంధతిసాటి. వైభవంబున శచీవనితసాటి
తగుసెనరున సుమిత్రాదేవికిని సాటి నైర్మల్యమున సురనదికి సాటి
యనుచు బంధుజనంబులు వినుతి సేయ
నలరె శ్రీ గొట్టుముక్కల కులపయోధి
చంద్రుఁ డైనట్టి నరసభూమీంద్రుపట్టి
చారుసద్గుణనికురంబ నారమాంబ ”

అను పద్యమువలన వేద్యమగు చున్నది. ఈయన క్రీ. శ. ౧౫౫౫ వ సంవత్సరమునకు సరియైన యానందసంవత్సర భాద్రపద బహుళ సప్తమికి సరియైన ౯౬౪ వ ఫసలీ మొదలుకొని క్రీ. శ. ౧౬౦౭ వ సంవత్సరమునకు సరియైన పరాభవ సంవత్సర మార్గశిర బహుళ ద్వితీయవఱకు నేఁబదిరెండు సంవత్సరముల రెండు మాసముల యిరువదియైదు దినములు ప్రభుత్వము చేసి ౭౬ సంవత్సరములు జీవించి విగతదేహు లైరని స్థానికచరిత్రమునఁ దెలుపఁ బడుచున్నది. ఈయన శేషధర్మములను ప్రబంధము నంకితము నొంది యనేకధర్మకార్యము లాచరించినట్లుగా రామవిలాసములోని—

“ సీ. బిరుదాంకపురిని సుస్థిరముగా నిర్మించెఁ బాములన్నిటినిఁ బోలు చెఱువు
తిరుపతివల్మీకగిరిఁ బూలపల్లెను ఫలవృక్షవనముల నిలిపెఁ జాల
నృహరిగేహతటాక నిక్షేపవనములు కొమరుగాఁ బెద్దాపురమున నునిచె
విశ్వనాథకవీంద్ర విరచితశేషధర్మప్రబంధము సాదరముగ నందె
విప్రవంశప్రతిష్ఠలు వెలయఁ జేసెఁ
బుత్త్రులను గాంచె నీతినిఁ బుడమి నేలె
వత్సవాయాన్వయమునకు వన్నెఁ దెచ్చె
మెచ్చి పేరయతిమ్మధాత్రీశ్వరుండు ”

అను పద్యములవలనఁ దెల్లమగుటయకాక యాయన మిక్కిలి ధర్మాత్ముఁ డని తేటపడుచున్నది. బిరుదాంకపుర మనఁగా బిక్కవోలు. బిక్కవోలు చెఱువు నేఁ డంతగా నుపయోగకారి కాకున్నను గాలువలు త్రవ్వించుటకుఁ బూర్వ మా ప్రాంతమున మిక్కిలి యుపయోగకరమై యుండుటచేతనే కవి దానిని క్షీరసాగర తుల్య

మని యభివర్ణించి యున్నాడు. మఱియు వీరు కోటబురుజులలో నొక్కటియైన తాళ్ళబురుజుమీఁద దేవాలయమును గట్టించి యందు నృసింహస్వామినిఁ బ్రతిష్ఠించిరి. ఇది యిప్పటికిని శిథిలమై యున్నది. ఈశిథిల మైనదేవాలయములోని విగ్రహ మొకటి పెద్దాపురము నందలి శ్రీ సీతారామస్వామివారి యాలయములోఁ బ్రతిష్ఠింపఁబడినది. పై రామవిలాసములో లక్ష్మణకవి వర్ణించినట్లుగనే విశ్వనాథకవి తా నంకితము చేసిన శేషధర్మములయందు—

“ సీ. కట్టించె గుడి జగత్కర్త జనార్దనస్వామికి నవనిపై శాశ్వతముగఁ
బెట్టించె నన్నంబుఁ బేర్మితో నేప్రొద్దు ననివారితముగ నభ్యాగతులకు
నలరించెఁ బ్రచురతోయ ప్రపూరిత తటాకము సర్వజంతూపకారకముగఁ
గావించె సకలవృక్షశ్రేణిశోభితం బగుచు నెప్పుడు నంద మైనతోటఁ
జేసెఁ బ్రతిష్ఠ లక్ష్మీనృసింహపాద
భక్తిని సిరులచేఁ బ్రబలుధన్యుఁ డౌర
......వత్సవాయాన్వయమున
తిమ్మభూపాలమౌళి సత్కీర్తిశాలి ”

అను పద్యములో వర్ణించి యున్నాడు. ఈ తిమ్మరాజుగారికి జగ్గరా జను సోదరుఁడు కలఁడనియు, అతఁడు పరాక్రమవంతుఁ డనియు, రాముననుసరించు లక్ష్మణుని వలె సమస్తకార్యములం దోడ్పడుచు ననువర్తించు చుండె ననియు విశ్వనాథకవి యీ క్రిందిపద్యములోఁ జెప్పియున్నాడు.

“ చ॥ అనితసహోదరుండు కుసుమాయుధమూర్తి దిగంతరాళవి
శ్రుతసితకీర్తి దానరవిసూనుఁడు వైభవభాసమానుఁ డు
ద్ధత రిపురాజసంహరుఁడు ధర్మపరుండు సమస్తసత్కళా
చతురుఁడు వత్సవాయ చినజగ్గనృపాలుఁడు ధన్యుఁ డెంచఁగన్

మ॥ మనుజస్తుత్యుఁడు జగ్గభూవిభుఁడు రామక్ష్మావిభున్ లక్ష్మణుం
డనువర్తించువిధంబునం దను మహాహర్షంబునన్ సర్వదా
యనువర్తింపఁగ ధర్మమార్గమున హెచ్చెన్ పేరభూపాలనం
దనుఁ డౌ తిమ్మనృపాలమౌళి సిరులన్ ధాత్రీస్థలిన్ వర్ధిలన్ ”

ఏనుఁగు గుర్వమంత్రియు, పోలప్రెగడసూరమంత్రియు, రెండు భుజములై యుండఁగా నుండ నీతిమ్మరాజుమహారాజులుం గారు చతుర్భుజునివలె వర్ధిల్లెనని—

“ గుణవిభూషణుఁ డేనుఁగుగుర్వమంత్రి
ధీరుఁ డగు పోలప్రెగ్గడ సూరమంత్రి

కడమరెండుభుజంబులు గాగఁ బ్రబలె
మహిఁ జతుర్భుజుం డనఁగఁ దిమ్మప్రభుండు "

అను గీతమున నుడివియున్నాఁడు. ఈతిమ్మభూపాలుండు వైష్ణవమతావలంబకుఁడై శ్రీమాన్ నల్లానుచక్రవర్తుల అల్లాడాచార్యునిపుత్రుఁ డగుతిరుమలాచార్యునకు శిష్యుఁడై యుండినటుల పై శేషధర్మములలో నుదహరింపఁబడియుండెను.

ఈమహారాజులుంగారు దక్షారామమునకు విజయము చేసినప్పుడు వెణుతురుపల్లి విశ్వనాథకవి కృతినిర్మాణమునకుఁ గడంగుట తనయనుంగుమంత్రియగు నేనుఁగుగుర్వామాత్యుఁడు విన్నవించిన సంతోషించి, యాప్రభువులు "నీవుచెప్పఁబూనిన శేషధర్మకావ్యమును మాపేర నంకితముచేయు" మని యాకవి కానతిచ్చి యాతనిం గర్పూర తాంబూల జాంబూనదాదులచే బహూకరించిన నతఁడు సంతోషించి శేషధర్మము నా యన కంకితము గావించెను. ఈవిశ్వనాథకవి యాంధ్రమున శ్రీరామవిజయ మనుయక్షగాన కృతిని, గౌరీవివాహ మనుద్విపదప్రబంధమును, హరిశ్చంద్రచరిత్ర మను నిరోష్ఠ్యప్రబంధమును, సంస్కృతంబునఁ బారిజాతాపహరణంబును రచియించి వాసిగాంచెను. కాని యీగ్రంథము లిప్పు డెచ్చటను గానవచ్చుట లేదు. ఇట్టివిశ్వనాథకవు లేకాలమున నీ సంస్థానమున నెందఱుండిరో, యాకాలమున మనయాంధ్రభాషామతల్లి యెటులఁ దాండవమాడెనో తెలిసికొనుట కింతకంటె వివరము లేవియుఁ దెలియరావు.

---

## —• శ్రీ వత్సవాయ రాయపరాజు మహారాజులుంగారు •—

(క్రీ. శ. ౧౬౦౭-౧౬౪౯.)

పెద్దాపురసంస్థానమును సంపాదించి మన్నెము తోటపల్లి, జడ్డంగి సహితముగా ముల్లేడు చాగలనాడు కిమ్మూరుపరగణాలను ఏఁబదిరెండు సంవత్సరములు పరిపాలించిన శ్రీ వత్సవాయ ముసలితిమ్మరాజుమహారాజులుంగారు, ఆయనయొక్క డెబ్బదియాఱవయేట ననఁగా క్రీ. శ. ౧౬౦౭ వ సంవత్సరమునఁ గాలధర్మము నొందిరి. ఆయనకు రాయపరాజు, గోపాలరాజు, రామచంద్రరాజు, నను మువ్వురు కుమారులు కలరు. శ్రీ తిమ్మరాజుమహారాజులుంగారి యనంతరమున నాయన కుమారులలో జ్యేష్ఠులైన శ్రీ రాయపరాజుమహారాజులుంగారు సింహాసనము నధిష్ఠించిరి. ఈయనకు జగదేకవీర రాజాధిరాజరాజవేశ్యాభుజంగాది బిరుద నామములు కలవు. ఈయన యమితశౌర్యపరాక్రమోపేతులై మర్మదాంధు లగుధారుణీధవులను వైరివీరులను ఖడించి, రాజ్యమును విస్తరింపఁ జేసి కిమ్మూరు, బిక్కవోలు, తుని, కొత్తాము ముల్లేరు, పిఠాపురములను ధర్మపరులై పరిపాలించి రని లక్ష్మణకవికృత మగురామవిలాసములోని యీక్రింది పద్యములనఁ దెలియవచ్చుచున్నది.

"మ. ఘనశౌర్యంబున దుర్మదాంధనృపులన్ ఖండించి సత్కీర్తి చే
కొని కిమ్మూరు, బిక్కవోలు, తునియున్, గోత్రాము, ముల్లేరు సాం
పెనయన్ బీఠపురంబు ధర్మపరుఁడై యేలెన్ సమస్తార్థులన్
మనిచెన్ దిమ్మనృపాలు రాయపమహీనాథుండు భాగ్యోన్నతిన్"

ఈయన దైవభక్తియు, ప్రజానురక్తియు, సత్కార్యాసక్తియుం గలిగి ప్రజాపరిపాలన మొనర్చిరి. ఈయన చేసిన సత్కార్యములను గురించి లక్ష్మణకవి తన రామవిలాసములో—

"సీ. శ్రీరామునకుఁ గట్టమూరను గట్టించె గుళ్ళు మంటపములు గోపురములు,
గంభీరజలతటాకంబు త్రవ్వించె గృహస్తపురంబున సుస్థిరముగఁ
బొలుపుగా వాల్మీకిపురి కొండ్రకోటను ఫలభూజవాటికల్ పదిలపఱచె"

అని యిట్లు వర్ణించియున్నాఁడు.

ఈ రాజశేఖరుఁడు తన తండ్రిగారైన శ్రీ తిమ్మరాజుమహారాజులుంగారి వలెనే కవిజనాశ్రయుఁడై, కవుల నాదరించి పోషించి, వారిచేఁ గృతు లందినవాఁడు. ఈయన హరిభక్తిసుధోదయం బను నొక ప్రబంధమునకుఁ గృతికర్తయైనట్లు పై నుదహరింపఁబడిన పద్యములోనిదే యగు

"ప్రస్తవ్య మగుహరిభక్తిసుధోదయం బనుమహాకృతిరత్న మందుకొనియె"

అనుపాదముచేఁ దెలియవచ్చుచున్నది. ఈ హరిభక్తిసుధోదయ మిప్పు డెచ్చటను గాన రాకున్నది. అంతియగాక దాని కృతికర్త యగు కవిపుంగవునిపేరైనం దెలియవచ్చుట లేదు. ఈవత్సవాయవారు మొదటనుండియు నాంధ్రభాషాభిమానులై యాంధ్రకవితావధూటికిం బ్రాపకులై కవులై యనేకము లగుకృతిరత్నముల నందిరి. కాని వానిలో రెండు మూడు తక్క మిగిలినవెల్ల నామమాత్రావశేషములగుట నాంధ్రదేశము యొక్క దురదృష్ట మనిచెప్పవచ్చును. వీరందిన యన్నికృతులునుగూడ నుండియున్నచో నాకీ చరిత్రము వ్రాయుటయం దమితసహాయకారు లగుటయేగాక భాషాభిమానులకుఁ గూడ నెక్కుడు నుపయోగకారులై యుండును. వీరు గొప్పపరాక్రమవంతులు. వీరియొక్క శౌర్యపరాక్రమకార్యములను గురించి రామవిలాసములో—

"సీ॥ దర్పాంధయవనమస్తకముల బురుజులు గట్టించె నమ్మయ్యగట్టుచెంత
లొంపకలోవలో గుంపులుగొని పోరవచ్చినదొరల గర్వం బడంచెఁ
జెలఁగి పోత్రాజును జేపట్టి రాఘునరాజుదేశమునకు రాజుఁ జేసె
శరభరాజును గృహాంతరవాసుఁ గావించి యతనిగూడెంబు వీరన్న కిచ్చె
గడుసుమన్నీల భృత్యులు గా నొనర్చె

నిగ్రహానుగ్రహంబులు నెగడఁ జేసె
వత్సవయతిమ్మధారుణీశ్వరునిసుతుఁడు
రాజమాత్రుఁడె రాయపరాజశౌరి ”
అనియు

“ పేరుగలుగు మహమ్మదుబేగు నదిమి
మెచ్చఁ దగిన థమామీలు తెచ్చుకొనియె ”

అనియు వర్ణింపఁబడియున్నది. ఈ పై పద్యమువలన నీయన విశేషముగ మన్నె రాజులతో యుద్ధము చేయుచు వారిని జయించుచువచ్చినటుల తేటపడఁ గలదు. యీ పై పద్యమున నుదాహరింపఁబడినమన్నెదొర లేయేగూడెములకుఁగాని యే యేప్ర దేశములకుఁ గాని యధిపతులో వారియుదంత మెంతమాత్రమును దెలియరాకున్నను ఆయాప్రదేశములిపుడు పెద్దాపురతాలూకాలో నుండుటంబట్టి యీ మహారా జుల కొకప్పుడు సామంతు లనుకొననగును. గొప్ప గొప్ప పరగణాలను గొన్నింటిని బరిపాలించి తమయనుపమానశౌర్యపరాక్రమములను జూపి పగతురను పాదాక్రాంతులుగఁ జేసి యాకాలమునందలి సాటిరాజులలో మేటు లని పేరు వడసిన వత్సవాయ వసుమతీవరులచరిత్రములే మనకుఁ దిన్నగఁ దెలియరానప్పుడు ఎచటనోకొలదిప్రదేశముల నేలినయీమన్నెరాజులవృత్తాంతములు వివరముగా తెలియక పోవుట యొకవింతలోనిదికాదు. పెద్దాపురంతాలూకాలోనిశరభవర మనుగ్రామ మేరా జపుంగవునిపేరటఁ గట్టఁబడెనో యాశరభరాజుమొదలగురాజులను జయించుటయేకాక యీరాయపరాజుగారు తండ్రిగారివలెనే తాముకూడ మహమ్మదీయులకు మిత్రులై త మయవిక్రమాధిక్యముచే నబాబులుకూడ సాధింపలేనిదుర్గములను సాధించి యాకాల మున గోలకొండనబాబుగానున్నఅబ్దుల్ హసేన్ కుతుబ్ షావారిచేతను,మాదన్నపంతులు గారిచేతను బహుసత్కారముల నందినట్లు రామవిలాసములోనియీక్రిందిపద్యము తెలు పుచున్నది.

“ మ. సులతాన్ శాహబహద్దరబ్దులహసన్ క్షోణీంద్రుచేఁ బూజ్యపిం
గళిమాదన్నబుధేంద్రుచేత బహుసత్కారంబు లందెన్ నబా
బులు సాధింపఁగలేనిదుర్గనికరంబుల్ లీలచే గెల్చె ది
క్కులఁ గీర్తు ల్వెలయించె రాయపమహాక్షోణీశ్వరుం డున్నతిన్. ”

ఈపయినిఁజెప్పఁబడినిఅబ్దుల్ హసేన్ కుతుబ్ షా క్రీ. శ. ౧౬౧౧ మొదలు ౧౬౭౨ వఱకు * పరిపాలించినట్లు కనఁబడుచున్నది. కాని శ్రీయుతకొమర్రాజులక్ష్మ

* Robert Sewell's lists of antiquities, Madras, Part II, Page 167.

ణరావుపంతులుగారు ఈనబాబు క్రీ. శ. ౧౬౫౮ వఱకు * మాత్రమే పరిపాలించినట్లు వ్రాసి యున్నారు. ఈతేదీలలో నేది నిజమయినను మనరాయపరాజుగారు వారితో సమకాలికులయినట్లు తెలియఁగలదు. ఇంతవఱకు స్వతంత్రులుగఁ బరిపాలన మొనరించుచున్నగోలకొండనబాబులు ఈఅబ్దుల్ హసేన్ కుతుబ్ షావారినాఁటినుండియే ఢిల్లీపాదుషాహలకు సామంతులయి వారికి కప్పములు చెల్లించవలసి వచ్చినది. ఇంక మాదన్నపంతులుగారినిగూర్చి చదువరులకుఁ గొంత చెప్ప వలసి యున్నది. వీరినిగుఱించి శ్రీయుతలక్ష్మణరావుపంతులుగారు తమమహమ్మదీయమహాయుగములో నీక్రిందిరీతిని వ్రాసియున్నారు.

---

## అక్కన్న మాదన్న గార్లు.

" ఈ యన్నదమ్ముల (అక్కన్న మాదన్నగార్ల) పేళ్లు మన తెలుఁగువారు రెండువందల సంవత్సరములనుండి గౌరవపూర్వకముగా స్మరించుచున్నారు......... వీరియింటిపేరు పింగళివారు. † ఈపింగళివారిది భారద్వాజగోత్రము. కావున వీరికిని గౌతమగోత్రుఁ డగు పింగళియొక్క వంశమునకును నేమియు సంబంధము లేదు. అక్కన్న మాదన్నగారి వంశజుల మని చెప్పుకొను పింగళివా రిప్పుడు నైజాము రాజ్యములోని యోరుగంటిలో నున్నారు. వీరిద్దఱును మహారాష్ట్రు లనియు అక్కన్నగారికి 'ఏకనాదపంత్' అనియు మాదన్న పంతులుగారికి 'మదనపంత్' అనియుఁ బేళ్లుండె నని కొందఱు మహారాష్ట్రులిటీవలివారు వ్రాసి యున్నారు. కాని వా రేమియు నాధారము చూపినవారుకారు. నేను చూచినంతవఱకు పూర్వమహారాష్ట్రతురుష్కాంగ్ల గ్రంథాగులలో 'అక్కన్న' 'మాదన్న' నామములే వాడంబడి యున్నవి. ఇదియుఁగాక ప్రస్తుతము మాదన్నగారివంశజుల మని చెప్పెడువారు తెలుఁగువారు కావున వీరు తెనుఁగువారనియే మనము నిశ్చయింపవచ్చును."

వీరిసంబంధముననే చెప్పఁబడు నొకచిన్నకథ కలదు. శ్రీయుత లక్ష్మణరావు పంతులుగా రనినట్లు దానిసత్యాసత్యములు నిర్ణయించుటకు వీలులేకపోయినను, వినుట కిది యింపుగానుండు నని తలఁచి దానినిఁగూడ వారిగ్రంథమునుండియే దీసి యీక్రిందఁ బొందుపఱుచుచున్నాఁడను.

---

* మహమ్మదీయ మహాయుగము, పుట 218.

† వీరాంధ్రులైనట్లు పైమత్తేభమే చాటుచున్నది.

## —అక్కన మాదన్నగార్ల భ్రాతృత్వమును గుఱించినకథ—

" అక్కన్నగా రొకబీదవాఁ డగుబ్రాహ్మణుఁడఁట. మాదన్నగారు మంత్రిత్వము చేయుచుండఁగా అక్కనగా రాతనియింటికి వచ్చి ప్రవేశించెనఁట. తన భార్యబంధువుఁడని తలఁచి మాదన్నగారును, భర్తబంధువుఁడని తలఁచి యాతనిభార్యయు అక్కన్నగారిని మిక్కిలి మర్యాద చేయుచుండిరి. అక్కన్నగారు వయస్సులోఁ బెద్దవాఁడగుటచే మాదన్నగా రాతనినిఅన్నగా రనిపిలుచుచుండిరి. లోకులును అట్లే తలఁచుచుండిరి. ఇట్లు కొన్నిదినములు గడచిన తరువాత నొకనాఁడు మాదన్నగారు భార్యతో అక్కన్నగారిని గుఱించి ముచ్చటింపఁగా, నాతఁ డామెకు బంధువుఁడుకాఁ డని తెలిసెను. అందుపై నతఁడక్కన్నగారిని మనకుఁ గలబంధుత్వముఁ దెలుపు మనఁగా " నాయనా ! వినుము. నేను పెద్దమ్మకొమారుఁడను. నీవు చిన్నమ్మకొమారుఁడవు. ఇట్లు మన మక్కచెల్లెండ్ర బిడ్డలము గాన నన్నదమ్ములమునుమా! ఈరహస్యము నీమనస్సులో నుంచుకొనుము. మన మెప్పటియట్ల యన్నదమ్ములవలెఁ బ్రవర్తించెదము " అని యనె నఁట! అక్కన్నగారి బుద్ధిచాతుర్యమునకు మెచ్చి మాదన్నగా రాతని నటుతరువాత నన్నగా నేచూచుచుండి రఁట"

ఈమాదన్నగారు, అబ్దుల్ హసేన్ కుతుబ్ షావారివెనుక రాజ్యపాలనమును వహించినఅబూహసేన్ కుతుబ్ షావారివద్ద మంత్రిత్వపదవి నందుండిరి. అక్కన్నగారు "షాహలష్కర్" (అనఁగా సైన్యాధిపతి) అధికారమునుబొంది యుండిరి. వీరినిగుఱించిన విశేషాంశములు వీరితో సమకాలికులగు తిమ్మరాజుగారి పరిపాలనమును గూర్చి వ్రాయునప్పుడు తెలుపఁ గలము.

---

## *దక్షిణహిందూదేశమునఇంగ్లీషువారిప్రాథమికవర్తకస్థానములు.

ఈ రాయపరాజుగారి కాలముననే ౧౬౧౧వ సంవత్సరమున దక్షిణహిందూదేశమునందు క్రీ. శ. ౧౬౦౦ సంవత్సరమున నేర్పడిన ఇంగ్లీషుఈస్టు యిండియాకంపెనీవారు (హిందూదేశముతో వర్తకముచేసికొనుట కేర్పడిన యాంగ్లేయసంఘము) మొదటి గిడ్డంగి(factory)నిమచిలీపట్టణమునవద్ద స్థాపించిరి. ఈమచిలీపట్టణమే దక్షిణహిందూస్థానమున నింగ్లీషువారు సంపాదించిన వర్తకస్థానములలో మొట్టమొదటిది. హిందూ

*ఈచరిత్రవిశేషములు పాఠశాలలలో బాలురకు సామాన్యముగా నుపయోగించునవే కాంగ్లేయచరిత్రములనుండి తీసికొనఁబడినవి.

దేశముయొక్క పశ్చిమతీరమున సంపాదించిన వర్తకస్థానములలో మొదటిదిసూరతుపట్టణము. క్రీ. శ. ౧౬౧౨వ సంవత్సరములో దానినిసంపాదించుకొని, అచ్చట నొకగిడ్డంగిని కట్టిరి. పదునేడవశతాబ్దప్రారంభమున సూరతు ఒకగొప్ప రేవుపట్టణముగా నుండెను. ఈయింగ్లీషువారచ్చటకు రాకమునుపే పోర్చుగీసువారు వచ్చి వర్తకము చేసికొనుచుండిరి. తాము వర్తకము చేసికొనుచుండ నాంగ్లేయులుకూడ వచ్చి వర్తకము సాగించుట వారికిఁ గిట్టదయ్యెను. అందుమీఁద నాంగ్లేయులపై నసూయ పెరిగి వారివర్తకమును జెడఁగొట్ట నఖండప్రయత్నములు చేసిరి. అందువలన పోర్చుగీసువారికిని, ఆంగ్లేయులకును క్రీ. శ. ౧౬౧౫వ సంవత్సరమునఁ బశ్చిమతీరమునఁ దపతీనదీముఖద్వారమున కొంత దూరమున నొకగొప్పయుద్ధము జరిగెను. క్రీ. శ. ౧౬౩౯వ సంవత్సరమున ప్రస్తుతము చెన్నపట్టణమునందున్న సెంటుజార్జికోట కట్టఁబడెను. బంగాళమునందలి హుగ్లీనది మీఁదఁ గొంతనేలనుసంపాదించి యచ్చట ౧౬౪౦వ సంవత్సరమున నొకగిడ్డంగినిఁ గట్టిరి. దక్షిణహిందూస్థానమున నాంగ్లేయుల ప్రాథమికవర్తకస్థానములన్నియు నీరాయపరాజుగారి కాలముననే యేర్పడుటచే ఈయన పరిపాలించిన కాలము మిగుల ముఖ్యమైనది.

ఇట్లు ఘోటకవాహినీఝూటకర్కశపారసీక సైనిక శిరచ్ఛేదకుండును, రణరంగవిజయేందిరాకరగ్రహణమంగళయోగ్యపటహ శంఖస్వనుండు ను అయిన గోపాలరాజును రామచంద్రరాజును దన కుడియెడమభుజముల ట్లుపచరింపఁ బ్రజానురంజకముగ నలువదిరెండేండ్లు పరిపాలన మొనరించి శ్రీరాయపరాజుమహారాజులుంగారు ఆయనయొక్క డెబ్బదియయిదవయేట ననఁగా క్రీ. శ. ౧౬౪౯ వ సంవత్సరమున స్వర్గస్థులైరి.

---

## —శ్రీ వత్సవాయ తిమ్మరాజుమహారాజులుంగారు—

(౧౬౪౯–౧౭౭)

శ్రీ రాయపరాజుగారికి శుభగుణకదంబయయి సూరాంబ యను నామంబునం జెన్నారు సతీతిలకముగలదు. ఈపుణ్యమూర్తులగు దంపతులకు తిమ్మరాజు బలభద్రరాజు నను నిరువురు కుమారులు కలరు. వీరిరువురిలోఁ బెద్దవారైనతిమ్మరాజుగారు తండ్రిగారు కాలము చేసినవెనుక ప్రజాపరిపాలనాభారమును వహించిరి. వీరు క్రీ. శ. ౧౬౧౭ లో జననమొంది రాజ్యమునకు వచ్చునప్పటికి ముప్పదియొక్క వర్షముల ప్రాయముగలవారై యుండిరి. ఈయన యమితశౌర్యపరాక్రమవంతులై గొప్పగొప్పరాజులను జయించి మించినవారగుటచే ఈయన సార్వభౌమతిమ్మరాజుగారనియు, ఈయనయొక్క ధర్మకార్యతత్పరతచేతను. చేకొన్నజయములచేతను కీర్తితిమ్మరాజుగారనియుఁ బ్రఖ్యాతి

గాంచిరి. ఈ కీ ర్తితిమ్మరాజుగారి విజయములనుగూర్చి లక్ష్మణకవి తన రామవిలాస ములో నిట్లనివర్ణించియున్నాఁడు.

"సీ॥ రాజులు మెచ్చఁ బర్లాకోట సాధించి నరహరిదేవు దుర్నయ మడంచెఁ
గుదురైనబావిణీకోటలగలునట్టి యొదుకోటంతయు నుర్విఁ గలిపెఁ
దుగరాజుమొదలైన దొరలను భంగించి విశ్వంభరుని యుద్ధవిరతుఁ జేసెఁ
దగఁ బూసపాటి సీతారామ భూపాలుఁ డభినుతింపఁగ విజయంబుగాంచె
సరసమతుయవనాధీశుఁ దురగపతిని
గయ్యమునఁ గెల్చి లోకవిఖ్యాతిఁ జెందె
వత్సవాయాన్వయమునకు వన్నె దెచ్చె
రాయపనృపాలు శ్రీతిమ్మరాజమౌళి."

ఈపైపద్యమునందలి మొదటిపాదమునఁ జెప్పఁబడిన పర్లాకోటయనునది గంజాము జిల్లాలోని పర్లాకిమిడి కోటయేమోయని తోఁచుచున్నది. * ప్రకృతమున గంజాంజిల్లాలో పర్లాకిమిడి, పెద్దకిమిడి, చిన్నకిమిడియను మూఁడుసంస్థానములుకలవు. ఈభాగముల నామములంబట్టిచూడ కిమిడియను నొకపెద్దసంస్థానమ్మీతీరున మూఁడుభాగములుగ విభాగింపఁబడినట్లు తెలియఁగలదు. ఈ కిమిడిజమీందారులు తా మతిపురాతనమైన ఒరిస్సా కేసరి రాజవంశమునకు సంబంధించినట్లు చెప్పుకొనుచున్నారు. ఈపర్లాకిమిడికోటయే పర్లాకోటయనిచెప్పినను పర్లాకిమిడిని బాలించిన భూపాలురలో నరహరిదేవుఁడున్న ట్లెచ్చటనుఁ గానరాదు. అప్పుడు పర్లాకిమిడి సంస్థానమును బాలించుచు, మనతిమ్మరాజుగారికి సమకాలికులైనవారు ముకుందరుద్రనారాయణదేవుఁడు, ముకుందదేవుఁడు అనంతపద్మనాభనారాయణదేవుఁడు అనువీరుముమ్వురుకలరు. వీరిలోముకుందరుద్రనారాయణదేవుఁడు క్రీ. శ. ౧౬౩౦ మొదలు ౧౬౫౬ వఱకును, ముకుందదేవుఁడు ౧౬౫౬ మొదలు ౧౬౭౮ వఱకును, అనంతపద్మనాభనారాయణదేవుఁడు ౧౬౭౮ మొదలు ౧౬౯౬ వఱకును బరిపాలించెను. శ్రీతిమ్మరాజుగారు ౧౬౯౯ వఱకుఁ బరిపాలించిన వారగుటచేత అనంతపద్మనాభనారాయణదేవునియనంతరమున రాజ్యమునకు వచ్చిన సర్వజ్ఞజగన్నాధనారాయణదేవుఁడుకూడ సమకాలికుఁడనియే నుడువవచ్చును. కాని వీరి నలువురిలో నెవ్వరును నరహరిదేవ నామధారులైనట్లు కనిపించదు. ఒకవేళ నీపర్లాకిమిడి కోటయే పర్లాకోటయని సిద్ధాంతమేర్పడినయెడల నరహరిదేవుఁడను నామాంతర మీపైన వచించిన నలువురు పరిపాలకులలో నెవ్వరికో యొకరి కుండవలయును. ఈవిషయమును గుఱించి యింతకెక్కుడుగఁజర్చింప నాధారాభావముచే వీలులేకపోయినది.

* Sewel's lists of antiquities of Madras, Voi. II, p.p. 185.

పైపద్యచతుర్థచరణమునఁ జేర్కొనఁబడిన పూసపాటిసీతారామరాజుగారిని గూర్చి యొకింత చెప్పుట కాధారములుకలవు గాన ఆయననుగుఱించి యీ క్రిందఁ జెప్పఁ బోవుచున్నారము. ఈపూసపాటివారినిఁ గూర్చి రాయబహద్దూరు శ్రీకందుకూరి వీరేశలింగముపంతులుగారు తమ "ఆంధ్రకవులచరిత్ర" యందిట్లువ్రాసియున్నారు.

"ఓరుగంటియందుండిన కాకతీయరాజులు చెప్పుకొనునట్లుగానే యీపూసపాటివారును తాము సూర్యవంశజుఁడైన మాధవవర్మ సంతతివారమని చెప్పుకొందురు. కొండపల్లి సర్కారులోని పూసపాడను గ్రామనివాసముచేత వీరికి పూసపాటివారని యింటిపేరు కలిగినది. ఓరుగంటి సంస్థానము ప్రతాపరుద్రునితో నశించినవెనుక వత్సవాయవారు పూసపాటివారు మొదలైనవారు మహమ్మదీయులకు లోఁబడిరి. రఘునాధరాజను మాఱుపేరుగల పూసపాటి తమ్మిరాజుగారు గోలకొండలో సరదారుగానుండి శ్రీకాకుళమునకువచ్చి శ్రీకాకుళమునకు ఫౌఁజుదారుగానుండిన షెర్ మహమ్మదుఖాన్ వలన ౧౬౫౨వ సంవత్సరమున కూలిమి భోగాపురము తాలూకాలను గుత్తకుపుచ్చుకొని పాలనము చేయ నారంభించెను. ఈయనపుత్రుఁడైన సీతారామచంద్రరాజుగారు మఱికొన్ని తాలూకాలనుగూడ కవులునకుఁ బుచ్చుకొని పర్లాకిమిడిసంస్థానాధిపతియయిన గజపతిదేవుతో మైత్రి సంపాదించి, ౧౨౫ గుఱ్ఱపురౌతులతోను, ౮౫౦ కాల్బలముతోను పొట్నూరు జయించి కళింగరాజని పేరొడసి యాయూరు నివాసమేర్పఱచుకొని ప్రబలుఁడయి యుండెను."

ఈసీతారామచంద్రరాజుగారు గొప్పపరాక్రమవంతుఁడనియు, రాజనీతివిశారదులనియు తెలియుచున్నది. వీరే మనతిమ్మరాజుగారి సమకాలికులు, ఈయిన మెచ్చుకొనునట్లుగనే తిమ్మరాజుగారు విజయము గాంచిరని లక్ష్మణకవి వర్ణించియున్నాఁడు.

పూసపాటి తమ్మిరాజుగారినుండి కూలిమిభోగాపురము తాలూకాలను కవులునకుదీసికొనిరో యట్టి శ్రీకాకుళపు ఫౌఁజుదారుఁడైన షెర్ మహమ్మదునే లక్ష్మణకవి పైపద్యమున "సరసమతుయవనాధీశుఁ దురగపతిని" అని వర్ణించియున్నాఁడు. ఈ షెర్ మహమ్మదునుగూడఁ గయ్యమునఁ గెల్చి విజయలక్ష్మీపరిగ్రహణ మొనరించినవాఁడగుటచే శ్రీతిమ్మసార్వభౌముఁడు శ్రీకాకుళమువఱకునుండు దేశమును దన దోర్వీర్యముచే నార్జించెనని నిస్సంశయముగ వక్కాణింపవచ్చును.

పైపద్యమునఁ జెప్పఁబడిన తక్కిన బావిణీకోటనుగుఱించి కాని, యోదుకోటనుగుఱించికాని, దుగరాజునుగుఱించికాని విశేషాంశములు తెలియుటలేదు. కాని దుగరాజుశబ్దము విశాఖపట్టణముజిల్లాలోని పాచిపెంట జమీందారులచే బిరుదముగ నుపయో

గింపఁబడుచున్నదనియు బావిణీకోటయు, రాయదుర్గకోటయు, విశాఖపట్టణము గంజాము మండలములలోనివనియు, నవిశిథిలములైయున్నవనియు తెలియుచున్నది. వీనిననుసరించి చూడఁగా వత్సవాయవారు, పూసపాటివారి ప్రభుత్వ మున్నతదశ నందకపూర్వమే గంజాము విశాఖపట్టణమండలములలోని యాయాభాగములను జయించి ప్రఖ్యాతిఁగాంచిరని నుడువవలసి యున్నది.

ఇట్లఖండపరాక్రమవంతులై యనేకరాజుల్లను జయించి పెక్కుదుర్గముల నాక్రమించి సాటిరాజులందఱిలో శ్రేష్ఠులై సార్వభౌమ శ్రీతిమ్మరాజుగారు వినుతిఁగాంచిరి.

ఈయన తాతగారైన మొదటి తిమ్మరాజుగారు ఆయనయొక్క యేలుబడిలో ఆయనపినతల్లి కొమారులైన గణపతిరాజు నారాయణరాజుగారికి చిల్లంగి మొదలగు గ్రామములను గొన్నింటిని "జమియ్యతు" క్రింద "మొకరరు" చేసియుండిరి. నాఁటినుండియు నారాయణరాజుగారు చిల్లంగిలో మట్టికోటఁగట్టించి గ్రామములు బందోబస్తుచేసికొనియుండిరి. కాని యాగణపతిరాజువారికిని ఈతిమ్మరాజుగారికిని సరిపడక విరోధము వచ్చి యంతకంతకు శత్రుత్వము ప్రబల మయ్యెను. అందుమీఁద నీతిమ్మరాజుగారు ఈ చిల్లంగికోటను ముట్టడించి యచ్చటి పరిపాలకులను సాధించి కోటను స్వాధీనముచేసికొని యాగ్రామములను గిమ్మూరు పరగణాలోఁ గలుపుకొనిరి.

ఇదివఱకుఁ గొంతకాలమునుండియు బెండపూడి ఇసుకపల్లి పరగణాలు మహమ్మదీయ పాలకుల (సైన్యాధిపతుల) యధీనము క్రిందనుండుచువచ్చినవి. కాని వానినుండి తమకుఁదగినంత రాఁబడిరానందున వారు దానిని పిఠాపురాధీశుల కంటఁగట్టయత్నించిరి. కాని, యాపరగణాలు పాడులోనున్నవనియు, వానింజేకొనుట నష్టమునకే కాని లాభమునకుఁగాదనియు, నందువలన నారెండు పరగణాలను దాము భరించలేమనియుఁ బిఠాపురపు వారుచెప్పగా నాతురుష్కాధికారులు బెండపూడి పరగణాను బిఠాపురపు రావువారికిని, ఇసుకపల్లి పరగణాను పెద్దాపురపు వత్సవాయవారికిని దఖలుపఱచినారు. నాఁటినుండియు ఇసుకపల్లిపరగణా వత్సవాయవారి యధీనముక్రిందకువచ్చెను. పెద్దాపురపు సంస్థాన మీకాలముననే చాలగావిరివి జెంది, సర్వవిధముల నభివృద్ధిగాంచిన దగుటచేత, నిదియే దీనికుచ్ఛదశయని యూహింపనగును. ఈరాజ్యవిస్తారమువలననే శ్రీ తిమ్మరాజుగారు సార్వభౌమ బిరుదమును వహించినట్లు తలంచవలసియున్నది.

ఈయన యెంతపరాక్రమవంతుఁడో యంత సత్కార్యదీక్షాసముత్సాహుఁడు. ఈయననుగుఱించి లక్ష్మణకవి తనరామవిలాసములో నిట్లభివర్ణించియున్నాఁడు.

మ॥ నిధినిక్షేపతటాక దేవగృహము ల్నిర్మించె నుద్యద్దయా
దధియయి దీనులఁ బ్రోచె షోడశమహాదానంబులుంజేసె నం

బుధిపర్యంతధరిత్రియేలె బుధులన్ పోషించె సంపూర్ణ
ధర్మధనుండై నుతికెక్కె వత్సవయ తిమ్మక్ష్మాపతీంద్రుండిలన్.

ఈ తిమ్మరాజుగారు పెద్దాపురమును బరిపాలించుచుండఁగా పిఠాపురమును తెనుఁగురాయనింగారి మనుమఁడును చంద్రారాయనింగారి కొమారుఁడునగు మాధవరాయనింగారు పరిపాలన సేయుచుండిరి. ఆమాధవరాయనింగారు తమబంధువర్గములోఁ జేరిన నారసింహరాయనింగారి కొమార్తెయయిన రమణయ్యగారిని పరిణయము సేసికొనిరి. ఈ పిఠాపురపురావువారే యింతకుఁగొంతకాలముక్రితమీ నారసింహరాయనింగారికి జూపల్లె ముతా నిచ్చియుండిరి. శ్రీపీఠికాపురాధీశులగు రావువంశీయులకును పెద్దాపురపు వత్సవాయవారికిని మైత్రి యుండినందున, ఒకానొకప్పుడు నారసింహరాయనింగారు పిఠాపురమునకుఁ బోవుచు పెద్దాపురము వచ్చినందున శ్రీ తిమ్మరాజుగారు రమణయ్యగారికని చెప్పి కొన్ని గుఱ్ఱములను ఇంకను నితరబహుమానములను చేసిరి. కాని యానారసింహరాయనింగారు తమకొమార్తె పిఠాపురముననుందురనియు, ఆమెకు పసుపుకుంకుమక్రింద శాశ్వతముగ జరుగులాగున నేదైన నేర్పాటుచేయవలసినదనియుఁ గోరగా, పిఠాపురపువారికిని తమకునుగల మైత్రిఁబాటించి, అంతవఱకు తమసంస్థానముక్రింద జరుగుచున్న చాళుక్య భీమవరము (చామర్లకోటవద్దది) గ్రామమును రమణయ్యగారికి పసుపుకుంకుమ నిమిత్తమిచ్చివేసినారు. ఈప్రకారము వత్సవాయతిమ్మరాజుగారమితోదారసాహసములంగలిగి, చేతికడ్డులేకుండ దానముసేయుచు, దమవితరణముచే శిబికర్ణులందలపించుచు వన్నెయు వాసియుం గాంచిరి.

---

## —భాషాభిమానము కవిసన్మానము.—

ఈతిమ్మరాజుగారు కూడ తండ్రితాతలవలెనే తాముకూడ భాషాభిమానులై కవీశ్వరులనాదరించి ప్రసిద్ధిచెందినవారు. రామవిలాసమును రచియించిన ఏనుగు లక్ష్మణకవీ తాతగారైన లక్ష్మణకవిగారు ఈయనకాలముననుండెయుండి, తాము రచియించిన ద్రౌపదీ పరిణయప్రబంధము నీయనకంకితముచేసియుండిరి. ఈసంగతియే రామవిలాసములోని యీక్రిందిపద్యమువలనఁ దెలియగలదు.

" హరిహరపద్మజాంశభవుఁడై తగు నేనుఁగులక్ష్మణార్యుచే
సురుచిరశబ్ద భావరసశుంభదలం కృతిమాధురీ మనో
హర మగు ద్రౌపదీపరిణయంబను నుత్తమకావ్యమందె సు
స్థిరమగు కీర్తిసాం పెసఁగఁ దిమ్మనృపాలుఁడు ధర్మపద్ధతిన్ "

ఈ యేనుఁగు లక్ష్మణకవియే ధ్రువచరిత్రమును వేంకటరాజపుత్రుఁడగు జగ్గరాజునకును, తుల్యామహాత్మ్యమును కస్తురిరంగరాజ పుత్రుఁడగు జగన్నాథరాజునకును, వత్సవాయకులజులయిన రాజబంధువుల కంకితము చేసెను.

శ్రీ తిమ్మరాజుగారు కృతినందిన ద్రౌపదీపరిణయముగాని, పైన పేర్కొనఁబడిన ధ్రువచరిత్ర తుల్యామహాత్మ్య ప్రబంధములుగాని యిప్పుడెక్కడను గానరాకున్నవి.

ఈ వత్సవాయ రాజులమీఁదఁ జెప్పఁబడినవని యొకటి రెండు చాటువులు బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారిచే సముపార్జింపఁబడిన చాటుపద్యమణిమంజరియందు ముద్రితములై యున్నవి. ఆపద్యము లష్టదిగ్వినుత యశోవంతుఁడైన యీకీర్తి తిమ్మక్షమాకాంతునిమీఁదనే చెప్పఁబడిన వేమోయనితలంచి వాని నీక్రింద పొందుపఱుచుచున్నాఁడను.

" ఉ॥ తీరుగ వత్సవాయకుల తిమ్మజగత్పతికీర్తిహార మా
హారశరద్ద్విజన్మ కులిశాయుధజాతులమించె ; శౌర్యమా
హారశరద్ద్విజన్మ కులిశాయుధజాతులమించె ; రూపమా
హారశరద్ద్విజన్మ కులిశాయుధజాతులమించె నిద్ధరన్ "

" ఉ॥ రాజులరాజు లోభి, యొకరాజులరాజతిమూర్ఖుఁ డష్టది
గ్రాజులరాజు చోరుఁడు, విరాజులరా జొకపక్షి, తారకా
రాజులరాజు దోషి, ఫణిరాజులరాజొకవక్రగామి, యీ
రాజులు రాజులా సుగుణరాజులరాజవు నీవుగాక, యో
రాజవతంస ! వత్సవయ రాజమహీపతి ! తిమ్మభూపతీ "

వీరి తమ్ములైన బలభద్రరాజుగారుకూడ భాషాపోషకులై కిరాతార్జునీయమును గృతినందుటయేగాక తాముకూడ కవులయి శ్రీరామశతకమును రచియించి విఖ్యాతులైరి ఈ సంగతియే రామవిలాసములోని యీక్రిందిపద్యమువలన వేద్యమగుచున్నది.

" మ॥ అమితఖ్యాతికి మూలమైన కృతిఁ దానందె న్గిరాతార్జునీ
యము శ్రీరాములపేరఁ బద్యశతకం బాయూఢి నిర్మించె భో
జమహీజానిగతిన్ బ్రసిద్ధిగనియెన్ సాహిత్యపారజ్ఞుఁడై
రమణన్ శ్రీబలభద్రరాజు ప్రజలన్ రక్షించె ధర్మస్థితిన్ "

ఇట్లనేక కవిపుంగవులచే సంస్తుతులందుచు, నచ్యుతుండగు శ్రీకృష్ణునకు బలభద్రునింబోలె, బలభద్రుం డచ్యుతాంశసంభూతుఁడగు తమకు దక్షిణభుజంబుకైవడి ననువర్తించుచుఁ, దమకొక యండగానుండ సార్వభౌమ తిమ్మరాజుగా రుదారసాహసవిక్ర

మార్కులై రణరంగవిజయులై కవిజనాశ్రయులై, రసగ్రహణభోజులై ప్రతీతిఁ గాంచి విరాజిల్లిరి.

---

## దేశస్థితి.

ఈకాలమునందలి దేశస్థితినిఁ దెలిసికొనుట కొంతవఱకు ముఖ్యావసరము గనుక, దానినిగుఱించి యీక్రిందఁ దెలుపఁబోవుచున్నారము. * క్రీ. శ. ౧౫౭౧-వ సంవత్సరమునుండియు రాజమహేంద్రవరము, శ్రీకాకుళము సర్కారులు గోలకొండలోని కుతుబ్ షాహివంశమునకు స్వాధీనములైనవి. కృష్ణానదికి దక్షిణమునందు ననేకులు హిందూరాజులుకూడ గోలకొండ నవాబులకు సామంతులైరి. రఫత్ ఖానుఁడు రాజమహేంద్రవరమునొద్ద విజయమునొంది రాజమహేంద్రవర పరిపాలకునికి సాయమొనరించిన ఖాసింకోటరాజునుకూడ సాధింపఁ దలంచి యుత్తరదిక్కుగాఁ బ్రయాణమై వెడలెను. కాని మార్గమధ్యమున హిందువులసైన్యము లాతనినెదిరించుటచే తిరిగి హిందూ మహమ్మదీయుల కొక గొప్పయుద్ధము సంభవించెను. ఈ యుద్ధమునఁగూడ హిందువులే పరాజయమునొందుట తటస్థించినది. ఈ యుద్ధమైనపిదప నంత గొప్ప యడ్డంకు లేవియు లేకపోవుటచే, ఈ పైనఁజెప్పిన రెండు సర్కారులందునుంగల దుర్గములను వశపఱచుకొని ఒరిస్సారాజైన విజయనాథదేవునికూడ నోడించి తనయిష్టమువచ్చిన షరతులనంగీకరించునట్లాతనితో సంధిచేసికొని యటుపిమ్మట రాజమహేంద్రవరమునవచ్చి చేరెను. అందువలన నాఁటినుండియు, బహామనీరాజ్యవినాశనసంక్షోభ సమయమున హిందువులచే సంపాదింపఁబడిన రాజ్యములన్నియు జయింపఁబడి, మచిలీపట్టణమునుండి ఒరిస్సావఱకునుంగల దేశమంతయుఁ దిరిగి మహమ్మదీయరాజుల పరిపాలన క్రిందకువచ్చెను.

కాని యీమధ్యకాలమున, అనఁగా మహమ్మదు కూలికుతుబ్ షాహ (౧౫౮౧-౧౬౧౧) పరిపాలించుచుండఁగా ఖాసింకోటరాజు చనిపోవుటచే పండ్రెండేండ్ల వయస్సుగలిగిన యతని కొమారుఁడైన ముకుందరాజు సింహాసనమునకువచ్చి గోలకొండనవాబులయధికారమును ధిక్కరించి వారికి కప్పముచెల్లించుట మానుకొనెను. అంతటితోఁ జాలక యాతఁడు మహమ్మదీయ గౌర్నరునుపట్టుకొని యతనినిబంధఖానాలో ఖైదీగానుంచఁ బ్రయత్నించెను. అందువలన నాతని నణఁచి వేయుటకై మీర్ జైనుల్ అబిదీన్సరుసుమ్దార్ అను సేనాని పంపఁబడెను. ఈ మహమ్మదీయ సైన్యాధిపతి కిరుగుపొరుగులనుండు హిందూరాజులు సహాయముగా నేతెంచిరి. అప్పు డిరువాఁ

---

* Godavary District Manual: Mahammaden period.

ఖలవారికిని రాజమహేంద్రవరమువద్ద నొకమహాయుద్ధము జరిగెను. అందెంతసేపటికిని నేపక్షమువారికిని జయాపజయముల నిర్ణయించ వీలుకాదయ్యెను. దాదాపుగా మహమ్మదీయు లోడిపోయిరి. కాని యింతకుఁబూర్వమే సేనానాయకత్వమును వహించిన అమీర్ జుమ్లా అమీనుల్ ముల్కు అనునతఁ డాకస్మికముగా నింతవఱకు మూలబలముగా నుంచిన యొక గొప్పయాశ్విక సైన్యముతో హిందూరాజులంబోదివి వారినోడించి విజయంబునుంగాంచెను. మహమ్మదీయులకు విజయము చేకూరెననుటయే గాని వారి సైన్యమున ధైర్యపరాక్రమములనెఱపుచుఁ బోరాడిన వీరాతివీరులైన గొప్పవార లనేకులు రణరంగమున నిహతులైరి. ముకుందరాజు ఖాసింకోటకుఁ బారిపోయెను. అక్కడికిని మహమ్మదీయు లతనిని వెంబడించుటచేఁ దుట్టతుదకు దేశమునువదలిపెట్టి యాతఁడు బంగాళమునకుఁ దాఁగొనియెను. ఈ యుద్ధమున నాంధ్రక్షత్రియవీరులు గొప్పపరాక్రమమును జూపినట్లాలోచింప వలసియున్నది.

ఈ ముకుందరాజుతోఁ బోరాటమునకు రాజమహేంద్రవరము, ఏలూరులనుండి సైన్యములు తీసికొనిపోఁబడినప్పుడు కొండలలో నివసించుచు, అప్పుడప్పుడు కొల్లపెట్టుటకు గోదావరీ పల్లపు భూములపై దండెత్తివచ్చుచుండురెడ్లు, అదియేతగినసమయమనియెంచి కోయవాండ్ర సహాయమునుదీసికొని, ఏలూరు, నిడుదవోలు, బాహార్జల్లీలను, దోచుకొనిరి. ఆయాదేశవాసులు రక్షణమునకై చుట్టుపట్లనుండు నరణ్యములకుఁ బాఱిపోయిరి. కొంతసైన్యముతో అమీర్ ఖాన్ అనునతఁడు వారిపైకిఁబంపఁబడెను. అతఁడు వారి నోడించి తరుముగా వాడుకప్రకారము వారు చెల్లాచెదరై పోయి తిరిగి కొండగుహలలోను, లోయలలోను, మూఁగుచువచ్చిరి. ఒకప్పు డిరువది వేలమంది గోదావరీతీరమున మహమ్మదీయుల నెదిరించ నిలిచిరనికూడ ప్రజ లనుకొనుట కలదు. కాని తుట్టతుదకు వారు సంపూర్ణముగ నోడింపఁబడుటయు, దేశమున శాంతి సంస్థాపనయుం గూడ గలిగెను.

ఏలూరును, గోదావరికిఁ బశ్చిమముననుండు ప్రదేశమునుగూడ సంపూర్తిగ జయింపఁబడెను. కాని రాజమహేంద్రవరముమీఁదను, నదికి ప్రాగ్దిశనున్న ప్రదేశముమీఁదను మహమ్మదీయుల యధికార మే మాత్రమును భద్రముకాని స్థితిలో నుండెను. ఆ పరగణాయొక్క విజయము సంపూర్తి యనిపించుకొనఁజాలదయ్యెను. మధ్యడెల్టాలోని నగరములంక ఇబ్రహీమ్‌షాహాయొక్క సైన్యములచే జయింపఁబడక మిగిలియుండెనని తెలియవచ్చుచున్నది. అంతియగాక పరగణాయొక్క మధ్యభాగ మైనను, అప్పుడప్పుడు కొండలలోని యనారోగ్యప్రదేశముల కాత్మరక్షణకై తరుమఁగొట్టఁబడుచువచ్చిన జమీందారుల కొల్లలనుండియు, దోపిడులనుండియు, రక్షింపఁబడలేకపోయెను. ఆ

జమీన్దారులు తఱుచు నువ్వెత్తుగ నొక్కసారి దండునుగూర్చుకొని వచ్చి పైనిపడ్డం పఁబడినట్లుగనే దోఁచుకొనుచుండిరి. తగినంత మూలబలము లేకపోవుటచే మహమ్మదీయులు వారిని పూర్తిగ నణఁచిపెట్టుటకు సాధ్యముకాకుండెను.

అయినప్పటికి, ఢిల్లీలోని పాదుషాహలు రాజమహేంద్రవరము సర్కారును తమసామ్రాజ్యములోఁజేర్చుకొని దానిని ఒరిస్సాపరగణాలో నొకకొంతభాగముగఁ బరిగణించుచువచ్చిరి. బంగాళములోని అక్బరుపాదుషాహ ప్రతినిధియయిన రాజా మాన సింగు, ఒరిస్సాయొక్క యుత్తరభాగమును కొంతజయించి, దక్షిణమున నున్న సామంత రాజ్యములగు రాజమహేంద్రవరము, శ్రీకాకుళములనుగూడ తానుజయింపక పోయినను తనవిజయములలోఁ గలుపుకొని వానికి రు. 1,25,000 లు శిస్తుకట్టెను. ప్రతిసంవత్సర మీసొమ్ము వచ్చుచున్నట్లు "అయిని అక్బరీ" యనుగ్రంథమున వ్రాయఁబడియున్నది. కాని యథార్థమునకు మొగలుల యాయుధములు చిలుకసరస్సును దాఁటిరాలేదని చెప్పవలసియున్నది. ఒరిస్సాలోని యొకభాగమని పాదుషాహ లీజిల్లామీద నెంతనామమాత్రాధికారము చెలాయించుచువచ్చినను, నిజమున కదిమాత్రము గోలకొండనవాబుల స్వాధీనములోనే యుండెను. వారు తమకువచ్చురాఁబడి వసూలుచేయుటకై కొంతబలము నచ్చటనిలిపిరి. ఆ బలముల పోషణార్థము కొన్నిమాన్యము లియ్యఁబడెను. ఆ మాన్యములకు పన్నుకొట్టి వేయఁబడెను. అట్టి మాన్యములవలననో, యుద్ధమతరగతుల వారినుండి బలాత్కారముగ నేవియో లాగుటవలననో, లేక యన్యాయముగఁ బ్రజలను హింసించి లంచములను బుచ్చుకొనుట చేతనో, యాబలములు తమజీవనము గడుపుచుండిరి. పొందికలేని యాపరిపాలనము క్రీ. శ. ౧౫౭౧ మొదలుకొని మన సార్వభౌమ తిమ్మరాజుగారి కాలమువఱకు జరుగుచుండెను.

ఈ పరిపాలనమిట్లు జరుగుచుండఁగా క్రీ. శ. ౧౬౭౨ మొదలుకొని ౧౬౮౭ వఱకు అబూహసేన్ కుతుబ్ షాహ యను నాతఁడు గోలకొండ నవాబుగానుండెను. అతఁడుమిక్కిలిమంచివాఁడు. "అతఁడు హిందువులను మహమ్మదీయులను సమానముగ నాదరించుచు సమర్థులైన హిందువుల కున్నతోద్యోగముల నొసంగుచుండెను. ఈయనయొక్క మంచితనమునుబట్టియే ప్రజ లీయనను తాన్ షాహ లేక మంచిరాజని పిలుచుచువచ్చిరి. ఈ తాన్ షాహశబ్దమే రానురాను తానీషాగా మారను." ఈయన కాలముననేయున్న శ్రీరామభక్తుఁడైన రామదాస నామాంతరముగల గోపన్నగారిని సంస్మరించక తీరదు. ఈతానీషాగారివద్ద నున్నతపదవుల నాక్రమించిన యాంధ్రులలో అక్కన్న మాదన్నయనువారలిరువురు. వీరిద్దఱిలో అక్కన్నగారు సైన్యాధిపతియనియు, మాదన్నగారు మంత్రి యనియు రాయపరాజుగారి పరిపాలనముంగూర్చి వ్రాయున

పుడే తెలిపియున్నాఁడను. ఈ గోలకొండ రాజ్యమును సాధించవలయునని పెక్కురు పెక్కుమారులు ప్రయత్నించి యుండిరి. కాని రామలక్ష్మణులవలెనున్న యీపురుష సింహములనుజూచి వెనుకకు తగ్గుచుండిరి. అక్బరుషాదుషాహ మునిమనుమఁడైన యౌరంగజేబేదోయొక మిషనుకల్పించి యీ గోలకొండను బట్టుకొనుట కనేకమారులు ప్రయత్నించెను. కాని భండనగాండీవియని ప్రఖ్యాతినొందిన అక్కన్నగారును, బుద్ధిని బృహస్పతినిమించి యాలోచన కంతటివాఁడులేఁడని పేరుగాంచిన మాదన్నగారును ఔరంగజేబు సైన్యములను కోటగోడలను దరియనీయకుండఁ దరుముఁగొట్టుచునుండిరి.

క్రీ శ. ౧౬౮౬-వ సంవత్సరమున ఔరంగజేబు గోలకొండను తిరిగి ముట్టడించెను. కాని యీపర్యాయము, తానీషా హిందువులకు గొప్పపదవుల నిచ్చుచున్నాఁడని తానీషాను ద్వేషించినట్టియు, అక్కన్న మాదన్నగార్లకు విరోధులైనట్టియు మహమ్మదీయులు శత్రుపక్షమునఁ జేరిరి. ఈ గోలకొండను ముట్టడింపకపూర్వము శత్రుసేనలు హైదరాబాదును ముట్టడించి దానిని జయించినవి. అప్పుడచ్చటనున్న తానీషా గోలకొండకు పారిపోయి వచ్చి దుర్గద్వారమును మూయించెను. అక్కన్న మాదన్నగారలు హైదరాబాదుపట్టణముననే ముష్కరులగు తురుష్కులచే వధియింపఁబడిరి. కాని వారికీర్తిమాత్ర మాంధ్రజాతియున్నంతకాల ముండి తీరును.

తనపక్షముననున్న మహమ్మదీయులే తన్నువిడిచిపెట్టి శత్రుపక్షమునఁజేరి మోస మొనరించుటచే తానీషా యోడిపోవలసినవాఁడయ్యెను. అయినను అతఁ డమితధైర్య శౌర్యములనుజూపుచు నేడుమాసములవఱకు దుర్గమును సంరక్షించుకొనుచుఁ బోరాడెను కాని ఔరంగజేబుమాయలముందఱ నీతని ధైర్యశౌర్యములేవియుఁ బనికిరాకపోయెను. చిట్టచివరకు ఔరంగజేబు ౧౬౮౭వ సంవత్సరమున కోటను స్వాధీనపఱచుకొని తానీషాను జెఱఁబెట్టెను. ఆమఱుసటి సంవత్సరముననే గోలకొండ మొగలసామ్రాజ్యములోఁ జేర్పఁబడియెను.

నాఁటినుండి మన రాజమహేంద్రవరము, శ్రీకాకుళము సర్కారులుకూడ గోలకొండరాజ్యములోనివగుటచే, మొగలులవశ మయ్యెను. ఈ సర్కారులు ఒకరి స్వాధీనముతప్పి మరియొకరి స్వాధీనమైనవన్నమాటయేగాని క్రొత్తపరిపాలనయందేమాత్రము మార్పు కనఁబడదయ్యెను. ఇదివఱకువలెనే యిప్పుడుకూడ హింసాన్యాయములు ప్రబలములయియే యుండుటచే ప్రజలకీనూతనాధికారుల పరిపాలన క్రొత్తచేయలేదు.

ఈ క్రొత్తగా సంపాదించినరాజ్యములను బరిపాలించుటకై యౌరంగజేబొకప్రతినిధిని నియమించెను. ఆప్రతినిధికి దక్కనుసుబాదారనిపేరు. ఇతఁడు

మొదట ఔరంగబాదులో నివసించి తరువాత హైద్రాబాదును తనముఖ్యనివాసస్థానముగఁ జేసికొనియెను. కాలక్రమమున నీదక్కనుసుబాదారుఁడే హైద్రాబాదు నైజామనుపేరఁ బిలువఁబడుచువచ్చెను. ఈదక్కనుసుబాదారుక్రింద నిరువది రెండు పరగణాలు కలవు. వానిలో రాజమహేంద్రవరము శ్రీకాకుళము అనునవి రెండు. ఈరెండును ఏలూరు, కొండపల్లి, గుంటూరు మొత్త మీయయిదునుకలిసి యిప్పటికిని ‘‘ఉత్తరసర్కారు’’ లను నామంబున వ్యవహరింపఁబడుచున్నవి.

ఈ తిమ్మరాజుగారి పరిపాలనాకాలముననే అనఁగా క్రీ. శ. ౧౬౬౪వ సంవత్సరమున ఫ్రెంచితూర్పుఇండియావర్తకసంఘ మేర్పడి యీయిండియాలో వర్తకముచేసికొనుచున్న డచ్చి, ఇంగ్లీషు, పోర్చుగీసువారివలెనే హిందూదేశముతో వ్యాపారము చేయుట కారంభించినది. ఈ ఫ్రెంచిదేశీయులనే పరాసువారనిపిలుచుచుందురు. వర్తకవ్యాపారమునకై వచ్చిన యీపరాసుసంఘమువారు సూరతుపట్టణమున ౧౬౬౭ లో హిందూదేశమున తమ మొదటి గిడ్డంగినికట్టిరి. క్రీ. శ. ౧౬౭౪వ యేట ఫ్రాన్సిస్ మార్టిన్ అనునొక గొప్పపరాసుదేశీయుఁడు విజాపురపునవాబు నాశ్రయించి, కొంత నేలనుసంపాదించి, యచ్చటనే తూర్పుతీరమునందు మొదటి పరాసుస్థానము నేర్పరచెను. అదియే పుదుచ్చేరియని పిలువఁబడుచు నిప్పటికిని పరాసువారికై యున్నది.

క్రీ. శ. ౧౬౬౧లో బొంబాయి ఇంగ్లీషువర్తకసంఘమువారిక్రిందవచ్చెను. ౧౬౯౦వ సంవత్సరమున బంగాళములోని సతనాటియను ప్రదేశమాంగ్లేయుఁడైన జాబ్‌చార్నక్ అనువానిచే కొనఁబడెను. ఆప్రదేశారంభమునుండియే ప్రస్తుతమున్న కలకత్తానగరము కట్టఁబడినది.

ఈవిధమున వర్తకవ్యాపారము నిమిత్తమైవచ్చిన ఫ్రెంచి, ఇంగ్లీషు, తూర్పుఇండియా వర్తకసంఘములు వీరి నాశ్రయించియు, వారి నాశ్రయించియు, కొంతకొంత భూమిని సంపాదించుకొనుచు భారతభూమిలోఁ జక్కఁగఁ దమస్థానముల నేర్పఱచుకొనినవి.

గోలకొండ, మొగలసామ్రాజ్యమునఁ జేర్పఁబడిన సంవత్సరముననే (౧౬౮౭) ప్రజానురంజకముగఁ బరిపాలించి, యక్షయకీర్తిని సంపాదించిన సార్వభౌమ శ్రీ తిమ్మరాజుగారు తమ డెబ్బదవయేట పరమ పదమునొందిరి.

## —: ♦ రెండవ రాయపరాజు మహారాజులుంగారు. :—

( ౧౬౮౮—౧౭౧౪ )

శ్రీ సార్వభౌమ తిమ్మరాజుగారికి సంతానము లేకపోవుటచే ఆయన యనంతరమున ఆయనతమ్ములైన బలభద్రరాజుగారి కొమారులు రాయపరాజుగారు సింహాసనారూఢులైరి. వీరిని ఉద్దండరాయపరాజుగారనికూడ పిలుచుటకలదు. ఈయనను గురించి లక్ష్మణకవి తన రామవిలాసములో నిట్లని వర్ణించి యున్నాఁడు.

‹‹చ॥ శుకకలహంసబర్హిబలసూదనరత్నసవర్ణసింధుబా
హ్లికముఖదేశసంభవసమిద్ధహయంబుల నోలిఁదెచ్చి కా
నుక లిడి దేశనాథులు మనుప్రతిమాను నవార్యశౌర్యతా
రకరిపుతుల్యు వత్సనయ రాయనృపాలుని గొల్తు రెప్పుడున్॥
మ॥ సరసాత్ముల్ నిరతాన్నదానకలనాసంతోషితానంతభూ
సురపాళీశుభవాక్యవర్ధిత జన్స్తోమాశ్వరాజ్యార్థసు ।
స్థిరలక్ష్మీపరిపూర్ణరమ్యభవనుల్ శ్రీవత్సవాయాన్వయా
భరణుల్ రాయపరాజచంద్రునిఁ బగు న్బల్మారువర్ణింపఁగాన్ ››

ఈయన యనివార్యశౌర్యపరాక్రమవంతుఁడై పద్మనాయకులను జయించినట్లు పైనిఁజెప్పిన రామవిలాసములోనిదే యగు నీ క్రిందిపద్యము వెల్లడించుచున్నది.

‹‹గీ॥ రూపునన కాను విక్రమాటోపమునను
మాధవుని గెల్చి విఖ్యాతమహిమఁ గాంచెఁ
బద్మనాయకవిజయంబు పదిలపఱచెఁ
దేజమున రాయపక్షమాధీశ్వరుండు ››

వీరు రాజరికము చేయుచుండఁగా, క్రీ. శ. ౧౭౦౭న సంవత్సరమున మొగల చక్రవర్తులలో శ్రేష్ఠుఁడైన ఔరంగజేబు కాలముచేసెను. ఇతనివెనుకవచ్చిన యితని కొమారులు దుర్బలులైనందున, ఇతని మరణముతోనే మొగలమహాసామ్రాజ్యము శిథిలమైపోవుట కారంభించినది. ఔరంగజేబుక్రింద నుద్యోగములలో నుండి గొప్పరాజకార్యధురంధరులైన తురుష్కులు స్వాతంత్ర్యము సంపాదించుటకై ప్రయత్నములు సేయఁజొచ్చిరి. అట్టివారిలో దక్కను సుబాదారుఁడొకఁడు. అతని

♦ పెద్దాపురంతాలూకాలో చేరిన రాయభూపాలపట్నము వీరిపేరుతోనే కట్టఁబడినది.

పేరు కమ్రుద్దీన్ అసఫ్ జా. ఇతఁడు నైజామ్-ఉల్-ముల్కు అను బిరుదుతో హైదరాబాదును రాజధానిగఁ జేసికొని దక్షిణదేశమును బరిపాలింపఁజొచ్చెను. ఇతఁడు ఢిల్లీపాదుషాహాకు పేరునకుమాత్రము ౧౭౨౨వఱకు సామంతుఁడనిచెప్పుచు ౧౭౨౩ లో తాను స్వతంత్రప్రభువైనట్లు ప్రకటించెను. అప్పటినుండియు నదివఱకు మొగలులవశమునందున్న గోలకొండసుబా యితని స్వాధీనములోనికివచ్చెను. ఈతని కాలమున ఆర్కాటు, కర్నూలు, రాజమహేంద్రవరము, శ్రీకాకుళములు ఈగోలకొండ సుబాలోనివిగా నుండెను. వీనిని నిజామ్-ఉల్-ముల్కునకు ప్రతినిధులుగానుండినవబాబులు పరిపాలించుచువచ్చిరి. ఈతని వంశీయులైన హైదరాబాదు పరిపాలకులిప్పటికిని ఈనిజామ్ అనుబిరుదుతోఁ బిలువఁబడుచున్నారు.

దేశము ఒకరి స్వాధీనమునుండి మరియొకరి స్వాధీనములోనికిఁ బోవుచున్న గందరగోళసమయముననే మనరెండవ రాయపరాజుగారు విగతదేహులైరి. ఈయనయొక్క పరిపాలనమునుగుఱించి యిప్పుడున్న యాధారముల ననుసరించి యింతకన్న నెక్కువగ నేమియుఁదెలియరాదు. ఇంతకంటె నేమియువిశేషములు తెలియరాకుండుటంబట్టి యీయనరాజ్యమున శాంతినిలచియుండెనేమోయని యూహించుట కవకాశమిచ్చుచున్నది ఈ గ్రంథమును వ్రాయుటయందు మిక్కిలిసహాయకారియైన మూలగ్రంథమగు రాయువిలాసముకాని, నాకు దొరకినయితరాధారములుకాని, యీయన పరిపాలనమునుగుఱించి వ్రాయుటలో నింతకంటె తోడ్పడవయ్యెను.

శ్రీ గొట్టుముక్కల భగవద్రాజుగారి కొమార్తెయయిన రాగమ్మగారు ఈ రాయపనృపాలుని సతీమణియై విలసిల్లెను. ఈ యిరువురుపుణ్యదంపతులకు తిమ్మరాజుగారు, బలభద్రరాజుగారు, సూరపరాజుగారు అను ముగ్గురుకొమారులుఁగలిగిరి.

---

## —: మూడవ తిమ్మరాజుమహారాజులుంగారు. :—

( ౧౭౧౪—౧౭౩౪ )

రెండవ రాయపరాజుగారు దేహము చాలించినవెనుక ఆయన కొమారులలో జ్యేష్ఠులైన తిమ్మరాజుగారు ప్రజాపరిపాలనాభారమును వహించిరి. ఈయన రాజ్యమునకువచ్చినప్పటి కీయన పదిసంవత్సరముల ప్రాయమువారు. ఈయనకు యుక్తవ

స్సు వచ్చునంతవఱకు తల్లిగారైన • రాగమ్మగారే మంత్రిదండనాథాగ్రణుల సాహా
యముతో రాజ్యతంత్రమును నడుపుచుండిరి.

ఇట్లు రాఘువమ్మగారు కొమారుని సింహాసనమెక్కించి రాజ్యమేలుచుండఁగా
హజీహుస్సేన్ అను సర్ లష్కరుఁడు హైదరాబాదునుండివచ్చెను. రెండవరా
మపరాజుగారి పరిపాలనలో కమ్రుద్దీన్ అసఫ్‌జా స్వతంత్రుఁడయ్యెనని చెప్పియుం
టినికదా! అతఁడు రాజమహేంద్రవరము శ్రీకాకుళము సర్కారులకు నవాబుగా
అన్వరుద్దీనును నియమించెను. ఈ సర్కారులందలి జమీందారులు చెల్లించవలసిన
ప్పము బాకీపడియుండ వానిని వసూలుచేయుటకై అన్వరుద్దీను తనతాబేదారైన
రుస్తుంఖానును బంపెను. అతఁడు రాజమహేంద్రవరమును దన ప్రధాననివాసస్థాన
ముగఁజేసికొనియెను. ఈ రుస్తుంఖానుకే హాజీహుస్సేన్ అనునామాంతరముకలదు.
అతఁడు ౧౭౩౭ మొదలు రాజమహేంద్రవరముసర్కారు నేడేండ్లు పరిపాలించెను.
అతఁడు సైన్యముతోవచ్చుచుండఁగా నాతని నెటులైన దేశములోనికడుగుపెట్టకుండ
చేయవలెనని మొగలతుర్తి సంస్థాన ప్రభువులైన కలిదిండివారితాలూకు రామరాజు
గారును, నూజువీడు సంస్థానికులతాలూకు సుబ్బన్నగారును, తమసైన్యములం జేర్చు
కొని యుభయులు నొక్కటిగాఁగూడి రెండుమూఁడుమారు లాతనిని ఎలూరువద్ద
నెదిరించిరి. కాని పరాజితులై పెద్దాపురము వచ్చిచేరిరి. దేశాభిమానస్వాతంత్ర్య
గౌరవముల నెఱింగిన రాఘువమ్మగారి ప్రోత్సాహమున తిమ్మరాజుగారును, పిఠాపుర
మును బరిపాలించుచున్న రావువెంకటకృష్ణారాయనింగారును, వీరికిఁదోడైనిలిచి
యీ హాజీహుస్సేనును గోదావరినిదాటిరాకుండ చేయవలెనని యోచనలుచేసి బలము
లను సంసిద్ధముచేసి యుద్ధమునకు సిద్ధపడిరి. ఇంతలో నాసర్ లష్కరుఁడు గోదా
వరినదిదాటి రాజమహేంద్రవరమువచ్చెను. అంతట నొకటిఁగాఁగూడిన వీరందఱి
సైన్యములును రెండుసారు లాతురుష్కసైన్యాధిపతిని శాలివాహనశకము ౧౬౬౪వ
సంవత్సరమునకు సరియయిన క్రీ. శ. ౧౭౪౨వ సంవత్సరమున మార్కొనియెను. కాని
దైవము తురుష్కులపాలనుండుటచేతను, మహమ్మదీయుల వంచకత్వమువలనను, నీ
యుద్ధమునగూడ రుస్తుమ్‌ఖానుఁడే విజయుఁడయ్యెను.

---

• పెద్దాపురము తాలూకాలోచేరిన రాగమ్మపేటయు ఆగ్రామమున కనతి
దూరమున నున్న రాగమ్మచెఱువు నొక మహాతటాకమును నీమె వలననే
యేర్పరుపఁబడినవి.

వెంకటకృష్ణారాయనింగారు తమకు సన్నిహితజ్ఞాతియైన రావుబుచ్చన్నగారిని వెంటఁబెట్టుకొని రామరాజు, సుబ్బన్నగార్ల సహితముగఁ గొండవాండ్రసహాయమునఁ బితూరీచేయుటకై తోటపల్లి మన్యమునకుఁ బాఱిపోయిరి. కాని యచ్చటికరిగిన వారిలో బుచ్చన్నగారు తక్క మిగిలినవారు మన్యపుజ్వరములచేఁ బీడితులై మృత్యువుపాలైరి.

అటుతరువాత కొంతకాలమునకు సర్ లప్కారుఁడు పెద్దాపురమునకరిగి పశ్చిమమున నున్న పాండవులవారిమెట్టయని చెప్పఁబడుచోట దండువిడిసి తన్నోడింప సైన్యములను సహాయమిచ్చెనుగదా యను కక్షచే రాగమ్మగారికి కపటముగ నిట్లని తనకొమారుఁడైన నూరుద్దీన్‌హుస్సేనుచే రాయబార మంపెను. “మీది ప్రాచీనమైనసంస్థానము. మీది ధర్మపరిపాలనము. ధర్మప్రభువు లగు మీ కొమారుల నొక్కపర్యాయ మిచ్చుటకుఁ బంపినచో వారి దర్శనము చేసికొని ధన్యుల మగుదుము. మేము కూడ వారికి సంస్థానమును స్థిరపఱచి వెడలిపోఁగలము.” ఇవ్విధమున తన తనూజుఁడైన నూరుద్దీన్‌హుస్సేనుచే రాయబార మంపఁగా రుస్తుంఖానుని కపట మెఱుంగక, యతని వాక్యములయందు సంపూర్ణవిశ్వాసముంచి, గౌరవపరివారముగ నిరువురు మువ్వురు ననుచరులను మాత్రమే తోడిచ్చి రాఘవమ్మగారు తన కొమారులను పరమసాధువైన మేషాకృతినున్న క్రూరవ్యాఘ్రము దగ్గఱకు, మహాభీలమృత్యుగహ్వరమునకు, యమసదనమునకు సాగనంపినట్లు సాగనంపెను. ఆమె యొక్క కుమారులుకూడ నూరుద్దీన్‌హుస్సేన్ ♦ వలెనే హాజీహుస్సేన్ వాక్యములందలి కాపట్యము నెఱుంగక తమ పాలిటి యమాలయమునకుఁ బోయిరి.

అప్పుడా రాజకొమారులను హాజీహుస్సేను తన డేరాలోనికి రప్పించి కొంతసేపు సంభాషణ జరిగిన పిదప నూనె కాపించి సలసల మఱుగుచున్న నూనెను జొన్నవెన్నులతోఁ వీపుమీఁదఁ గొట్టించి దయాదాక్షిణ్యరహితుఁడై, క్రూరకిరాతస్వభావుఁడై, రాక్షసప్రవృత్తిని నెఱపి, దారుణహింసపాలు చేసి యసువులం దీసెను.

ఈవిధమున నా రాజకుమారుల వధాప్రకారము స్థానికచరిత్రయందు వివరింపఁబడి యున్నను, హాజీహుస్సేనునకు సంస్థానమువా రీసఱకు కొంత కప్పము చెల్లింపవలసి యున్నట్లును, ఆ రాజకుమారులు తన డేరాలోనికి వచ్చిన పిదప తమకు కప్పము బాకీపడినందుల కా నవాబువారిపైఁ గోపపడెననియు, నందుకు తిమ్మరాజుగారు యుక్తసమాధానము లొసంగినట్లును, అందుపైఁ దనమాటలకట్లు నిర్భీతచిత్తులై

---

♦ నూరుద్దీన్ హుస్సేన్‌ఖానుఁడు రాజసోదరుల కత్యంతమిత్రుఁడై యుండుటచే, నది కనిపెట్టి రుస్తుంఖానుఁడు తన కొమారునిద్వారమున నీకుతంత్రమునడిపెను.

ప్రత్యుత్తరము లొసంగుట కిట్టక యాతురుష్క సైన్యాధీశుఁడు వారలం జెఱ నుంచఁ బ్రయత్నించె ననియు, నటుపిమ్మట శౌర్యవంతులును, మానధనులు నగు నప్రభువులు తమ కైజారులం దీసి పొడుచుకొని క్షత్రియోచిత మరణము నంది రనియుఁ గూడఁ జెప్పఁబడుట కలదు.

ఈ ధరణీశ్వరుల వధావిధాన మనతికాలముననే నగరులోఁ దెలియ రాఘవమ్మ గారు పుత్రశోకావేశముచేతను, మానాభిమానరహితులును, నకార్యకరణోత్సుకులు ను, నగు ముష్కర తురుష్కు లేవౌర్జన్య మొనరింతురో యన్నభీతిచేతను, అగ్ని ప్రవేశముం గావించి వీరమాతయుం బోలె దేహపరిత్యాగ మొనరించిరి. సంస్థా నసేవకులలో విశ్వాసపాత్రుఁడైన చల్లా పెద్ది యనునతఁడు రాగమ్మగారివాఁడి యను మతిం గైకొని పతివ్రతాశిరోమణు లగు క్షత్రియకాంతారత్నములు సర్లష్కరు ని సైనికులచే నెట్టిపరాభవమునకును పాలుగాకుండునట్లు వారి నవరోధమున నుంచి దాని కగ్ని ముట్టించి, తానును వారితోఁబాటు యగ్నినిబడి తన విశ్వాసమును వెల్ల డించెను. అంతట వారెల్లరు నా మహాగ్నిహోత్రజ్వాలలఁ దమ భౌతికశరీరంబులం జాలించి యుత్తమలోకముంగూర్చి జనిరి. హిందూదేశమున క్షత్రియకాంతా రత్నములు చూపిన ధైర్యసాహసములు నిరుపమానములని తెలుపుట కిట్టి యుదాహ రణములు కూడ ననేకములు గలవు.

ఈపైన వివరింపఁబడిన తెఱంగున రాయపరాజుగారి కొమారు లైన రెండవ తిమ్మరాజుగారు ౧౭౧౮ మొదలుకొని యిరువదేండ్లు భూతలంబునుం బాలించి క్రీ.శ. ౧౭౩౮ లో విగతజీవు లైరి. ఈయన యనేక దేశలిపులును, ననేక దేశభాషలును నేర్చినట్లు రామవిలాసములోని యీక్రింది పద్యమువలనఁ దెలియవచ్చు చున్నది.

“ ఉ. ధీరులు సన్నుతింప బహుదేశలిపుల్ బహుదేశభాషలన్
సారకవిత్వసౌష్ఠవరసజ్ఞతయున్ దనసూక్ష్మబుద్ధిచే
నేరిచె విద్యలన్నిఁటికి నిత్యవిభూషణ మైనయీవిచే
భూరియశంబుగాంచె గుణపూజ్యుఁడు తిమ్మనృపాలుఁ డిమ్మహిన్.”

ఈ తిమ్మరాజుగారి మరణముతో క్రీ. శ. ౧౭౩౧ వ సంవత్సరమునకుఁ బూర్వ మునుండియు వత్సవాయవంశీయులచే నవిచ్ఛిన్నముగఁ బరిపాలింపఁబడుచు వచ్చు చున్న పెద్దాపురసంస్థానము మహమ్మదీయుల యధికారముక్రిందకు వచ్చెను. ఇక్క డనుంచి యీ సంస్థానము క్షీణదశకు వచ్చుటకుఁ బ్రారంభించినది.

## —♦ మహమ్మదీయుల సర్వాధికారము ♦—

(క్రీ. శ. ౧౭౩౪ మొదలు ౧౭౪౯ వఱకు)

రాగమ్మగారగ్నిప్రవేశ మొనర్చుతరి, నామెదగ్గఱ కొండపెర్ల మహాలక్ష్మి యను నొకబ్రాహ్మణపితంతు వుండెను. అప్పుడా రాగమ్మగారు తమకు మనుమఁడును, తిమ్మరాజుగారి కొమారుఁడును, నేఁడాది శిశువునై యున్న జగపతిరాజుగారిని విజయనగరమునందున్న పూసపాటి విజయరామరాజుగారి భార్యయును, దన సోదరీసమానయు నైన చంద్రయ్యమ్మగారికి సంగతియంతయుం జెప్పి యొప్పగింపవలసిన దని చెప్పెను. అంతట వితంతువైన నాబ్రాహ్మణియు నేకసంవత్సరప్రాయుఁ డైన యారాచకొమరుని నామె యాజ్ఞాప్రకారము విజయనగరమునకుం గొనిపోవ బయలుదేఱి వచ్చుచుండఁగాఁ గొంతమంది మహమ్మదీయభటు లామెను ద్వారమునొద్ద నడ్డగించి యీ రాజపుత్రు నెచ్చటకుఁ దీసికొనిపోవుచున్నా వని యడుగ నామె యతఁడు రాజపుత్రుఁడు కాఁడనియు, తన కొమారుఁడే యనియుఁ బ్రమాణముచేసి చెప్పెను. అటుపిమ్మట నాభటులు సంశయమనస్కులై యామెవచనంబులను విశ్వసింపఁజాలక తమ సంకోచముం దీర్చుకొనఁ నొక జామిపండు తెచ్చి యాబాలునికిచ్చి, యతనిచే నాఫలమును గొఱికించి యా యుచ్ఛిష్టఫలము నామెను భుజియింపవలసినదని యానతిడిరి. అంతట నామెయు, నారాజపుత్రసంరక్షణమే తన విధాయకకృత్యముగా నెంచి, కులభేదము నించుకయుం బాటిసేయక, యేతత్సందర్భమున నాభటుల కేమాత్రము ననుమానము వొడమునట్లు కూడ నటింపక, వారొసఁగిచ్చిన తత్క్షణమే యా యుచ్ఛిష్టఫలమును భుజించి యాతురకల సంశయము నివారించెను. పిదప నాభటులును నామెవాక్యములు విశ్వసనీయము లైనవిగ నెంచి బాలకసహితముగ నామెను వదలి పెట్టిరి.

ఆక్షత్రియపుత్రప్రాణత్రాతయైన యా మహాలక్ష్మియుఁ దన గమ్యస్థానముం జేర చేబ్రోలుమార్గముపట్టెను.

ఈమధ్యకాలములో తోటపల్లిమన్యమునకుఁబోయిన బుచ్చన్నగారు కొంతమందిని సహాయముఁదీసికొని దేశముమీఁద పితూరీచేయుటకై ప్రయత్నము చేయుచుండఁగా నాయుఁడుపాటిసంవత్సరమున ననఁగా రాక్షససంవత్సరమునకు సరియైన క్రీ. శ. ౧౭౩౪లో హాజీహుస్సేనుఖానుఁ డాతనిని పిఠాపురములోఁ బట్టుకొని శిరచ్ఛేదము చేయించెను. ఇతఁడు పిఠాపురమునుండి కళింగదేశమును జయింపఁబోవుచుండఁగా పెద్దాపురమునందలి మహమ్మదీయభటులు బాలకసహితముగాఁ గోటలోనుండి వచ్చుచున్న బ్రాహ్మణవితంతువును వదలిపెట్టిరను వార్తవిని వారిపైమండిపడి తుట్ట

తుదకు చేబ్రోలువద్ద నా బ్రాహ్మణింబట్టుకొని యాబాలకునిఁ జెఱనుంచి యతనిని జాగరూకతతోఁ జూచుచుండవలసినదని యొకసేవకుని కొంతసైన్యమును నియోగించెను.

ఈరీతిని ప్రళయరుద్రుఁడై, దుర్వారక్రౌర్యమును వెలయించి, జనసంహారమే తన వినోదక్రీడయుఁ బరమావధియుగ నెంచి, మృగయుఁడు మృగములంబలె ప్రజలఁ దఱిమితఱిమి వేఁటాడి కసిమసంగుచు, దుర్నిరీక్ష్యతేజుఁడై రుస్తుంఖానుఁడు క్రీ. శ. ౧౭౩౦ మొదలు ౧౭౩౭ వఱకుఁ బరిపాలించెను.

* ఈ పదునెనిమిదవ శతాబ్దాదినుండియు హైదరాబాదులో నివసించుచున్నట్టియు, రాజకార్యవ్యవహారములను సంబంధించిన కాగితములనుఁబరీక్షించగలిగినట్టియు జేమ్సుగ్రాంటు అనుఆయన యీ యేండ్ల భయంకర పరిపాలనమునుగూర్చి యాక్షేపణాగర్భితములగు నపహాస్యవచనముల నిట్లువ్రాసియున్నాఁడు.

"రుస్తుంఖానుయొక్క న్యాయబుద్ధివలనను, భుజబలమువలనను ప్రజలుపొందిన యుపకారము లసంఖ్యేయములు. ఇతఁడు తనకొసంగఁబడిన యధికారము నతి సమర్థతో నెఱపి, నాలుగు దక్షిణపరగణాల సహితముగ రాజమహేంద్రవరము నేడేండ్లు పరిపాలించెను. ఈ పరగణాలలోనుండెడి జమీందారులు మొగలమహా చక్రవర్తియైన ఔరంగజేబు మరణానంతరమునఁ బుట్టిన సంక్షోభములను, కలతలను దమకు వీలుగాఁజేసికొని, తమమట్టుపట్లనున్న మహమ్మదీయనాయకుల యధికారమును ద్రోసిపుచ్చి తాము సాధారణముగా స్వతంత్రులగుటకుఁ బ్రయత్నించుచువచ్చిరి. జమీందారులయొక్క యిట్టి యుండగములను నివారించి, సరియైనపద్ధతులమీఁదఁ గ్రమ పరిపాలనమేర్పఱచుట, యీ క్రొత్త జిల్లాదారు (రుస్తుంఖాను) ని, ముఖ్యకార్యముగానుండెను. అవసరమువఱకుఁ దగినపద్ధతినవలంబించుట, నిదానించి కనికరము చూపుట, పరుషమై, సర్వసామాన్యమైన న్యాయమునొసంగుట, వీనికనుకరించఁదగిన యుదాహరణమని, నేఁటివఱకు ప్రజలచేఁ దలంపఁబడుచున్న నైజాముగారి యాశయము దోషరహితమైనదని, యీ క్రొత్త జిల్లాదారుని నవపడిక స్థిరీకరించెను. ఆకాలమునందే, జమీందారులు పరధనాగారములను మోసముచేసి యపహరించుటచే, వారు పాటుపడుస్వభావముగల కృషీవలుని, శిల్పకారునింగూడ హింసయను నయోహస్తముతోఁ బిండి పిప్పిఁజేసిరి. గనుక నట్టి నిర్దయాళులైన క్రూరులగు జమీందారులను నిర్మూలము చేయుటయే రుస్తుంఖానుని పరిపాలనయందలి ప్రథమప్రధానవిషయమైయుండెను. అతనికరవాలముబారింబడక పాఱిపోయినవారు రాజద్రోహులుగ

* Godavary District Manual.

పరిగణింపఁబడిరి. అట్లు పాఱిపోయినవారును పారినంటి పెట్టుకొని యున్నవారును గూడ తిరిగి వచ్చినయెడల బహుమానము లొసంగఁబడునని ప్రకటింపఁబడెను. ఇందు వలనఁ జాలినంతమంది త్వరలోనే ప్రోగయిరి. వారట్లు ప్రోగయినది భయాశ్చర్యములను గలిగించు "కల్లామినారులు" అని పిలువఁబడు రెండు స్మరణచిహ్న శిరోగోపురముల నిర్మించుటకే గాని సజీవులై యుండి యిహసౌఖ్యముల ననుభవించుటకు మాత్రము కాదయ్యెను. ఇట్టి కల్లామినారులప్పుడు ప్రతిపరగణాయొక్క ముఖ్యపట్టణమునద్ద సామాన్యముగాఁ గానవచ్చుచుండెను. సాధారణముగాఁ బ్రజ లెల్లరు నితనికి భయపడుచు నితఁడన్న వెఱఁగుపడుచుండెడివారు. ఈరుస్తుంఖానుఁడవిశ్వాసు లైన యాజమీందారుల నెల్లరం దొలఁగించి వారికి బదులుగ అమీనులను నియమించి ప్రసిద్ధిఁ జెందెను. ఈరుస్తుంఖానునితీక్ష్ణపరిపాలన ముత్తరసర్కారులలోఁ బ్రశంసనీయమైనపేరువడి యుండెను."

ఈరుస్తుంఖానుఁ డిట్లనివార్యకార్యనిర్ణీతుఁడై, ప్రళయాంతకుని చందమున విజృంభించుచుండ నీతని తనముందు నూరుద్దీనుహుస్సేనుఖానుఁ డీ ప్రళయ సంహారమును గాంచి సహింపలేక బలవంతముగ నాతని మెడమీఁద దేరాకొయ్యలు వేసి త్రొక్కించంపించి వానిపాలిటి యమదూతయయ్యెను.

ఈరుస్తుంఖానునిమరణమును నూరుద్దీనుహుస్సేను తనపైయధికారికిఁ దెలిపిన మీఁదట పాతఁడును అతఁడొనరించిన కార్యము మంచిదేయని యాతనిం గొనియాడి యతనికి రాజమహేంద్రవరమునకే గాక దాడి వెడలి జయించిన గోకళింగముసర్కారునకుఁగూడ నధికారమిచ్చితిమని ఫర్మానానిచ్చెను. అటుపిమ్మట నూరుద్దీనుహుస్సేను కళింగమును జయించుటకై దాడివెడలిపోవుచు, చేబ్రోలు వెల్లువయందు మన తిమ్మరాజుగారి కుమారుఁడైన జగపతిరాజుగారిని తురుష్కులు చెఱలో నుంచినసంగతి తెలిసి, పూసపాటి పెదవిజయరామరాజుగారు విజయనగరమునుండి నలుబదివేల పౌఁజును గూర్చుకొనివచ్చి నూరుద్దీన్‌హుస్సేను నెదిరించెను. అప్పు డుభయపక్షముల వారికిని ఘోరసంగ్రామము జరిగెను. అట్లు మహోగ్రముగ యుద్ధము జరుగుచుండఁగా విజయరామరాజుగారి తురుపు అనకాపల్లి బోయలు అనెడు పౌఁజు రెండువేలమంది నూరుద్దీనుహుస్సేన్‌ఖానుఁడెక్కిన దంతావళముం బొదివి, దానిపైనున్న యంబారీ చుట్టుకొని మహమ్మదీను లోకమూల నీటెలును బల్లెములు పుచ్చుకొని పొడుచుచున్నను, గొబ్బరిపుచ్చెలట్లు తలలనూడఁగొట్టుచున్నను వెనుకకుఁ దిరుగక, తమప్రయత్నములనుండి మఱలక, యతిసాహసముతో నంబారీత్రాళ్లను ద్రెంచి వైచి నవాబును బట్టుకొని శిరస్సును ఖండించిరఁట. ఇదియే నిజమయిన గో

గాంధ్రుల ధైర్యసాహసములు భూలోకమున శాశ్వతముగ నుండవలసినదే! అంతట పరకలసైన్యములు కదనరంగమునకు వెన్నిచ్చి తమపిక్కల యౌదార్యమును జూపినవి! అట్టిపిమ్మట విజయరామరాజుగారు, జగపతిరాజుగారిని స్వాధీనము చేసికొని తమకన్న స్థూలురైన సరదారు మున్నగువారికి బహుమానములొసంగి యాచిన్నవానిని వాని యొద్దనుండి తీసికొని విజయనగరము వెంటఁబెట్టుకొనివెళ్లి తమ యన్నకొమారుఁడైన అనంతరాజుగారితోఁ గూడఁ బెంచుచు సంరక్షించుచుండిరి.

ఇప్పుడీ చెఱవిడిపించి తెచ్చిన పెదవిజయరామరాజుగారి భార్యయయ్యిన చంద్రయమ్మగారికి జగపతిరాజుగారు మేనగోడలి కుమారుఁడని వేరొకచోట చెప్పఁబడినది. ఈ పెదవిజయరామరాజుగారు శ్రీ సార్వభౌమ తిమ్మరాజుగారి పరిపాలనమునఁ జెప్పఁబడిన శ్రీపూసపాటి సీతారామచంద్రరాజుగారి మనుమఁడు. ఈయన తండ్రిగారైన యానందరాజుగారి యనంతరమున రాజ్యమునకువచ్చి మన్నెదొరలను గెల్చి వారిదేశము లాక్రమించుకొని మన్నెసుల్తాను బిరుదమును వహించిరి. ఈయనయే తమపేరట విజయనగరమునుగట్టించి, తమ రాజధానిని పొట్నూరునుండి విజయనగరమునకు మార్చుకొనిరి. వీరు ౧౭౧౨-వ సంవత్సరమునకు సరియయిన విజయసంవత్సర విజయదశమీ జయవారమునాఁడు విజయనగరమునఁ గోటకట్టుటకు శంకుస్థాపనము చేసినట్లు "ఆంధ్రకవుల చరిత్రము" నుడువుచున్నది.

ఈ పెదవిజయరామరాజుగారి నగరున జగపతిరాజుగారు ఆనందరాజుగారితోఁ బెరుగుచుండుటనుఁ దెల్పియుంటిమి. కాని యొక్క యింటనే పెరుగుచున్న యీ స్వాతంత్ర్యాభిలాషులగు రాజకొమారుల కిరువురకును పొసఁగదయ్యెను. వీరిరువురు ప్రతివిద్య యందును నొకరి కొకరు మించవలెనని ప్రయత్నించుచుండిరి. ఇరువురునుగూడ దేని యందును నొకరికొకరు తీసిపోయినవారుకారు. బాల్యక్రీడా వినోదములయందు సహితము జగపతిరాజుగారొక పక్షమువహించిన ఆనందరాజుగారు వారికెదుటిపక్షము నవలంబించుచువచ్చిరి. తుదకు కోడిపందెములలో సయితము జగపతిరాజుగారొకవైపు, ఆనందరాజుగారొకవైపు నుండుచువచ్చిరఁట! ఆనందరాజుగారి కానాఁటికానాఁడు వయస్సువృద్ధియగుచున్నట్లుగనే జగపతిరాజుగారిపై నసూయకూడ నభివృద్ధి యగుచుండెను. కాని ఆయనకు నిర్నిమిత్తముగ జగపతిరాజుగారిపై నుదయించిన యసూయా ద్వేషము లేపనియుఁజేయక యప్పటికి మాత్రము నిష్ప్రయోజనము లయ్యెను. వీరిరువురినిగురించిన యొకచిన్న యితిహాసముకలదు. అప్పటి యీ క్షత్రియకుమారు లిరువురి మైత్రిసంబంధ మెట్లుండినదియు భావించుటలో నియ్యది కొంతవఱకుఁ దోడ్పడునేమో యని దాని నీక్రింద పొందుపఱుచుచున్నాఁడను.

"ఒకానొకఁడు విజయనగరముకోటలోఁ గోడిపందెములు జరిగెనఁట. జగపతిరాజుగారికిఁ జరణాయుధములం బెంచుట యత్యంత ప్రీతికరమై యుండెను. తామంతికాఁ బెంచుచుండిన కుక్కుటమునే జగపతిరాజుగారు పందెముకట్టిరఁట. ఆనందరాజుగా రాసమయమున నొక్క కుక్కుటమును పోటీకి తెచ్చి పందెమునకు వదలిరఁట! ఇట్లొక కొంతతడవా రెండు పుంజులును బోరాడినపిమ్మట జగపతిరాజుగారి కుక్కుటరాజమే గెలుపుఁగొనెనఁట! అంతట ఆనందరాజుగారు ఓడిపోయినను ఆవిచారమును మోమునం దోపనీయక, యించుకనవ్వుచుఁ బరిహాసవచనములఁ "పెంపుడికోడియే గెలిచిన" దని జగపతిరాజుగారిని గేలిసేసిరఁట!

ఈ విధమున నానందరాజుగారీజగపతిరాజుగారి నసూయానేత్రమునం జూచుచు వచ్చినను, చంద్రయ్యగారొకకంటను విజయరామరాజుగారొకకంటను ఆయనం గనిపెట్టుచు నేకొఱంతయుం గలుగకుండ సంరక్షించుచుండిరి.

ఇట్లుండఁగాఁ బెద్దాపురసంస్థానమును దిరిగి నిలువఁబెట్టుటకై నితాంతప్రయత్నములు జరుగుచుండెను. పెదవిజయరామరాజుగారీ కార్యమును సాధించుటకై తమప్రధానామాత్యులైన బుట్టాబుచ్చన్నగారితో స్థలమంత్రాంగములుచేసి యప్పుడమీరుదారుగానున్న "నీమత్ ఆలీని" మంచిమాటచేసికొని యతఁడెట్లో సమ్మతించునట్లుచేసి యతనికి రు. ౯౦,౦౦౦ లు లంచమిచ్చి సఫలీకృత ప్రయత్నులైరి. పిదప నప్పటికి షోడశవర్షప్రాయులైయున్న వత్సవాయ జగపతిరాజుగారిని క్రీ. శ. ౧౭౪౯-వ సంవత్సరమునఁదిరిగి తమ పితృపితామహార్జిత రాజ్యమునకుం బట్టాభిషిక్తులంజేసి పూసపాటి పెదవిజయరామరాజుగారు పెద్దాపురసంస్థానపునస్సంస్థాపన కర్తలై వినుతిఁగాంచిరని కొందఱును యీయనయే తనభుజబలపరాక్రమములచేత మార్గమున నెన్నిచిక్కులు తటస్థించినను, ఎంతద్రోహముచేయించుట కానందరాజుగారు యత్నించినను, విజయుఁడై, రాచవారి సాహాయ్యమున అప్పటిపరిపాలకుఁడైన మహమ్మదీయుని నయమునను భయమునను లోబరచుకొని రాజ్యాభిషిక్తుఁడయ్యెనని కొందఱును జెప్పుచున్నారు. ఏదియెట్లున్నను స్వతంత్రేచ్ఛగల మన జగపతిరాజుగారు తిరుగ పోయినసంస్థానమును సంపాదించుట యెంతయుఁ బ్రశంసనీయము.

---

## —శ్రీ వత్సవాయ జగపతిరాజుమహారాజుంగారు—

(౧౭౪౯–౧౭౫౭)

శ్రీవత్సవాయ జగపతిరాజుగారు బాల్యముననే తురుష్కులవలన కష్టములనుభవించి, పిదప పెదవిజయరామరాజుగారిచేతఁ బెంపఁబడి చిట్టచివరకు వారిసాహాయ్యము

చేతనే తమ రాజ్యమునకుఁ బునరభిషిక్తులై క్రీ. శ. ౧౭౪౪ మొదలుకొని పాలించిరి. శ్రీయన కాక్రేనికోన శ్రీదంతులూరి రామరాజుగారి తనూజయయిన సీతమ్మగారినిఁ బరిణయమైరి. ఈరామరాజుగారు నాధర్మపత్నియొక్క పుట్టినింటివారికుటుంబములో సుప్రసిద్ధక్షత్రియులు. ప్రస్తుతము గుండేపల్లి జమీందారులగు క్షత్రియ లీకుటుంబములోని వారె!

వీరు రాజ్యమునకు వచ్చునప్పటికి ముస్తాఫానగరము, ఏలూరు, రాజమహేంద్రవరము, శ్రీకాకుళము, సర్కారుల జాఫర్ అలీయను నతఁడు పరిపాలించుచుండెను. జాఫర్ అలీ, తనక్రింద అమీన్ దారుగానున్న నీమత్ ఆలీ తనకు తెలియకుండ లంచమును గ్రహించి పెద్దాపురముసంస్థానమును తిరిగి వత్సవాయవంశీయులకిచ్చివేసెనని యాతనిపై మండిపడి, జగపతిరాజుగారినిసాధించి తిరిగి కోటను వశపఱచుకొనవలెనని బలములం గూర్చుకొని పెద్దాపురముమీఁదకు దాడివెడలెను. హిందూరాజులపై టాటోటు బూటకముల నుసికొల్పి గెలుపునుబట్టికొని గర్వితమతియయియున్న మ్లేచ్ఛమదగజేంద్రమేడ! ధర్మానువర్తనుఁడై ధర్మయుద్ధుఁడై సుగుణియయి, దుర్జనభర్జన శిష్టరక్షణములు దైవనియత కర్తవ్యములుగ భావించి, తృణీకృతశాత్రవుఁడై, నవీనయౌవనావేశసంవర్ధిత ధైర్యశౌర్య సముత్సాహుఁడై ప్రబలిన జగపతిక్షితినాథకంఠీరవం బేడ! అయినను లోతు దిగనంగాని తెలియదన్న సామెతననుసరించి జాఫర్ అలీ పెద్దాపురాధినాథునితో యుద్ధమునకుండలపడెను. కాని యాభూనాథుని పరాక్రమమునకు నిలువలేక వెన్నిచ్చిపాఱిపోయెను. నాటినుండియు జగపతిరాజుగారు జాఫర్ అలీకిఁ బ్రక్కలోనిబల్లెమై గుండెలు తల్లడమొనరించుచు, వాని పాలిటి కాలయములై యుండిరి. ఆయనయన్న జాఫర్ ఆలీకి హడలుగానుండెను. ఈవిషయమును, లక్ష్మణకవి యిట్లువర్ణించియున్నాఁడు.

" సీ కన్నులనుగ్రాంధకారంబునలెఁ గ్రమ్మిగట్టుపుట్టలు చెట్లుకాననీదు
కఱకు గుత్తపుఁగ్రొత్తగడును సంకిలిజోడు హత్తినగతిహజ్జలాడనీదు
చెవులఁ దాళం బమర్చిన మాడ్కి బంధించు తేమలమొజ్జులాలింప నీదు,
లలినాటియున్న గుండెలలోని గాలమైయూర్పుల సడలింప నోప నీదు,
వత్సవయ జగపతి మహా వసుమతీశ
విజయ ధాటీ సమాటిక విజితవిముఖ
జాఫరలిఖానమానస స్తంభనప్ర
గల్భరూఢభయావేశ గాఢతమము."

" చ. జగపతిరాజసింహాకరసంభృత ఖడ్గఘటోద్భవుండు సాం
పుగ పరవాహినీశ్వర సముత్కటజీవన మెల్లఁ గ్రోలినే

ర్భగ ఘనరాజమండల నిరోధముఁజేసినజాఫరల్లి విం
ధ్యగిరిని నామశేషమగునట్టుగ నుంచె జగద్ధితంబుగన్.

ఈజగపతి రాజుగారిట్లమిత పరాక్రమవంతులై పాలించుచుండఁగా నీయుత్తర సర్కారులు ఫ్రెంచివారి స్వాధీనముక్రిందకు వచ్చెను. అది వారికెట్లువచ్చినదియుఁ దరువాత జరిగిన బొబ్బిలియుద్ధసంక్షోభమును గుఱించియు నిచ్చటఁగొంతవివరముగఁజెప్పుట సముచితముగ నుండకపోదు.

క్రీ. శ. ౧౭౪౮లో నైజామ్ కుమ్రుద్దీన్ అసఫ్ జా మరణమునొందెను. అతనిపిదప నైజాముపదవి నాక్రమించుకొనుటకై యతని ద్వితీయాత్మజుఁడు నాజరుజంగునకు ఇతని మేనల్లుఁడైన మిర్జాఫాజంగునకును, పోరాటములు జరిగెను. ఈసుప్రసిద్ధకలహములలో నాంగ్లేయులు నాజరుజంగుపక్షమునను. పరాసువారు మిర్జాఫాజంగుపక్షమునను, వహించిరి. ఫ్రెంచివారీపైపోరాటమున విజయులైనను వారికిని ఆంగ్లేయులకును గలహములు తుదముట్టవయ్యెను. ఫ్రెంచివారు, హైద్రాబాదు సింహాసనమునఁ దమకు వశవర్తియయిన మిర్జాఫాజంగునుంచి ఆర్కాటునకుఁగూడ నవాబుగఁ దమకనుకూలుఁడైనవాఁడున్న మంచిదనియెంచి, తమస్నేహితుఁడును, సహాయుఁడునైన చందాసాహెబున కాపదవి నొసంగవలెనని ప్రయత్నించిరి. ఇట్టి ప్రయత్నములు జరుగుచుండఁగా కొద్ది సంవత్సరముల క్రితమే యుత్తరసర్కారులనుండి ఆర్కాటునకు మార్చఁబడిన అన్వారుద్దీనును ౧౭౪౯లో ఆంగ్లేయులు నవాబుగ నంగీకరించి వానిపక్షము నవలంబించిరి.

ఈ యుద్ధములో మునిఁగితేలుచు, నాజరుజంగు, ఫ్రెంచివారిస్థానములైన మచిలీపట్నము, యానాముల నాక్రమించుకొనవలసినదని యుత్తరమునను న్నఁ దనయుద్యోగియులకుత్తరువిచ్చెను. అప్పుడు ఫ్రెంచిగవర్నరుగనున్న మాన్స్యూర్ డూప్లే మచిలీపట్నము ప్రాముఖ్యస్థలమనియు, దానిని తిరిగిసంపాదించకపోయినచోఁ దమ దేశాభ్యుదయమునకు భంగముకలుగుననియుఁదలంచి, యచ్చటనున్న తమగిడ్డంగిని, నాపట్టణమును, దిరిగి పట్టుకొనవలసినదని కొంతసేనను బంపించెను. పంపినసైన్యము విజయమునొందుటయుఁ నాయాప్రదేశములనున్న గిడ్డంగులపై ఫ్రెంచిబావుటా నిలుపుటయుఁగూడ జరిగినది.

ఆ సంవత్సరాంతముననే, ఫ్రెంచివారును వారి సహాయులును నాజరుజంగుయొక్క సేనానివేశముంబొదవినపుడు, అతఁడు తాబేదారులచేతఁ గపటమున వధియింపఁబడెను. తక్షణమే ఫ్రెంచివారతని ప్రతికక్షియయిన మిర్జాఫాజంగును, దక్కనుసుబాదారుగాఁజేయ పుదుచ్చేరీకి వెళ్లిరి. అప్పుడచ్చటనొక గొప్పయుత్సవము జరిగెను. ఆ సమయముననే మిర్జాఫాజంగు మచిలీపట్టణమునకు చుట్టుపట్లనున్న ప్రదేమును,

ృష్ణానదికి దక్షిణముననున్న మొగలరాజ్యములను కృతజ్ఞతాపూర్వకముగ ఫ్రెంచివారి కొసంగెను.

మీర్జాషాజంగు యీభోగమును జాలకాల మనుభవించియుండలేదు. అతఁడా నాతరుణములఁ దనకుఁ దోడ్పడుచుండుటకై కొంతఫ్రెంచిసేనను తనదగ్గఱనుంచికొన శ్చయించుకొనెను. అతనికోరిక ననుసరించి బుస్సీయొక్క సైన్యాధిపత్యముక్రింద ౩౦౦ ఇంగ్లేయులును ౨,౦౦౦ ఫ్రెంచిసిపాయిలును వచ్చుచుండఁగా వారికి స్వాగతమొసంగి హైద్రాబాదునకుఁ గొనిపోవు నుద్దేశ్యముతో గోలకొండకు బయలుదేఱెను. అతఁడు చాలదూరము ప్రయాణమైపోకమునుపే తన సేనలలో రేగిన కలహమునణఁచుచుండగా తఁడువధియింపఁబడెను.

అప్పుడు మొదటినైజామగు అసఫ్‌జాయొక్క తృతీయతనయుఁడగు సాల్బత్ జంగును, మీర్జాషాజంగుయొక్క యుత్తరాధికారియని బుస్సీ ప్రకటించెను. ఆతక్షణమే క్రొత్తసుబాదారు త్తరముగా ఔరంగబాదున కతివైభవముతోఁ బోయి యటుతరువాత దానినే తనముఖ్యనివాసస్థానముగ చేసికొనెను.

బుస్సీ కొన్నినెలలవఱకు సాల్బత్ జంగుతో నుండినవెనుక, నతని శరీరారోగ్యము సరిగాలేకపోవుటచే మఱల స్వస్థతనొందుటకై సముద్రతీరస్థమగు మచిలీపట్టమునకుఁబోయెను. కాని యతఁడచ్చటఁ జాలకాలము నిలుచుటకువీలులేకపోయెను. నైజాముయొక్కదివానునకు బుస్సీయన్నను, ఫ్రెంచివారిసహాయమన్నను, మొదటినుండియుఁ గిట్టదయ్యెను. అందువలన బుస్సీ మచిలీపట్టణమున కరిగినప్పు డతఁడు తనయభిప్రాయముతో నేకీభవించువారితోఁగలిసి కుట్రలుపన్ని ఫ్రెంచివారి నుద్యోగములనుండి తొలఁగించి తరిమివేయఁ బ్రయత్నించెను. ఫ్రెంచివారియధికారము నైజామురాష్ట్రమున క్షీణించుచుండుట కనిపెట్టి శరీరాస్వాస్థ్యమునకు లోఁబడియయినను తక్షణమే ఔరంగబాదునకు వెళ్ళవలసినదని డూప్లే బుస్సీకిఁ యాజ్ఞాపించెను. ఆయాజ్ఞవచ్చిన వెంటనే యింకను దేహారోగ్య మనకూలపడకపోయినను, నాసేనాధిపతి తక్షణమేయొక్కనిమిషమైన నాలస్యమొనరించక సముద్రతీరమునువిడిచి హైదరాబాదునకువెళ్లి అచ్చటనుండి .ఔరంగబాదునకుఁ బోయి మొత్తముమీఁద ౩౦౦ మైళ్లు ప్రయాణముచేసెను. ఫ్రెంచివారు వచ్చుచున్నారని తెలిసి నైజామునొక్క దివాను తాను లొంగిపోయినట్లు తెలిపెను. నైజాము బుస్సీని నిజమైనప్రాగ్దేశీయవైభవముతోఁ బ్రవేశమిచ్చి యాదరించెను. దానితో 'వారి రాజీనామా పూర్తియయ్యెను. 'అంతట నైజామును, బుస్సీయును గొప్పయుత్సవముతో నగరునకరిగిరి. అప్పుడు కృతజ్ఞతాచిహ్నముగ నైజామ్ సాల్బట్ జంగ్, పరాసువారి పక్షమున బుస్సీకి, సాధారణముగా నుత్తరసర్కారులని పిలువఁబడు రాష్ట్రములను

ధారవోసెను. అప్పటినుండియు నాసర్కారులమీఁదవచ్చు రివిన్యూవలననే ఫ్రెంచి సైన్యము పోషింపఁబడుచుండెను. ఆవిధమున ఫ్రెంచిసైన్యపోషణార్థమై ౧౭౫౨ లో కొండవీడుపరగణాయును, ౧౭౫౩ వ సంవత్సరమున ముస్తాఫానగరము, ఏలూరు రాజమహేంద్రవరము, శ్రీకాకుళము పరగణాలు ఫ్రెంచివారి యధీనముక్రిందకువచ్చెను.

అంతట బుస్సీ, నైజాముచేఁ గ్రొత్తగానొసంగఁబడిన యీపరగణాలను తక్షణము బయలుదేఱివెళ్లి స్వాధీనపఱుచుకొనవలసినదని మచిలీపట్టణమందున్న ఫ్రెంచి యున్నతోద్యోగియుఁడగు మాన్స్యూర్ మొరాసిన్ అనువాని కుత్తరవుచేసెను. ఫ్రెంచివారియధికారమును స్థాపించుటయందతని కవసరమైనయెడల నుపయోగపడఁగలదని ౧౫౦ మందిమ్లేచ్ఛులను ౨౫౦౦లమంది సిపాయిలును గల సైన్యమాతనికి సహాయముగనంపెను.

ఈ నాలుగు పరగణాలకును గవర్నరుగా నున్న జాఫర్ అల్లీఖాన్ ఫ్రెంచివారిపైఁ దిరుగఁబాటుచేసి, వారికెట్టులైన నీపరగణాలను స్వాధీనపఱుపకుండ మానవలెనని ప్రయత్నించెను. ఇతఁడింతవఱకు శ్రీకాకుళము పరగణాలోనున్న జమీందారులలోఁ బ్రముఖుఁడైన విజయనగరమురాజగు పెదవిజయరామగజపతి మహారాజుగారితో యుద్ధమొనరించుచుండెను. ఆయనకూడ ఫ్రెంచివారికీపరగణాలను స్వాధీనపఱుపకుండ చేయవలెనను తలంపుగలవాఁడగుటచేత జాఫర్ ఆలి ఆయనతో సంధిచేసికొనెను.

ఇట్లాయనతో సంధిచేసికొని యితర జమీన్దారులనుగూడ తమపక్షమునఁజేరి తమయుద్యమమునకుఁ దోడ్పడవలసినదని ప్రోత్సాహపఱచెను. ఈజాఫరల్లిచేతఁ బురికొల్పఁబడినవారిలో బొబ్బిలిజమీందారులగు రంగారావుగారొకరు. ఈవఱకుఁ దమకును దమకును విరోధములున్నను ఫ్రెంచివారిని దేశమునుండి వెడలఁగొట్టవలెనన్న యుద్దేశ్యముతోఁ బూర్వవైరములను గట్టిపెట్టి బొబ్బిలి సంస్థానాధీశులగు రంగారావుగారు జాఫరల్లితోఁ గూడియున్న విజయనగర ప్రభువులగు విజయరామరాజుగారితోఁ గలియుటకంగీకరించి వచ్చిచేరిరి. అప్పుడు వీరందఱును ఫ్రెంచివారి నెదిరించుటకు తమతమ సైన్యముల నొక్కటిగాఁగలిపిరి. కాని రాజమహేంద్రవరము, శ్రీకాకుళము సర్కారుల నిదివఱకిచ్చు శిస్తుకన్న తక్కువ కిచ్చెదననిచెప్పి మొరాసిన్, విజయరామ రాజుగారిని జాఫర్ ఆలీఖానునుండి వీడదీసి తమపక్షమునఁ జేరునట్లుచేసికొనెను.

ఆవిధమున నారెండుసర్కారులను మొరాసిన్, విజయరామరాజుగారికిచ్చుట తమ స్థితికి క్షేమముగాదనియాలోచించి రంగారావుగారు ఫ్రెంచివారి కుద్వాసనచెప్పువిషయమున దీక్షనువహించి, యీయుద్యమమునఁ దామొక ప్రధానపాత్రమునుగైకొనిరి.

జాఫరల్లీఖానుఁడు క్రొత్తగావచ్చి చేరిన తనస్నేహితుఁడైన విజయరామరాజుగారి చేత నంతత్వరితముగను నంతసులభముగను విడనాడఁబడుటగాంచి తక్షణమే దేశమును

వదలిపెట్టి పశ్చిమముగా నరిగి, తానిప్పుడు వదలిపెట్టిన దేశమును గొల్లఁగొనుటలోఁ దనకు సాయపడవలసినదని మహారాష్ట్రులను బిలిచెను. వారును నందుల కంగీకరించి, యొక గొప్ప సైన్యముతో బయలుదేఱివచ్చి తూర్పుకనుమలను దాఁటి శ్రీకాకుళము రాజమహేంద్రవరము పరగణాలగుండా దోచుకొనుచుఁ బోయి తుదకు ఏలూరు వద్దనుండి తమదేశమునకేగిరి.

తలవనితలంపుగఁ గలిగినట్టియు, హానికరమైనట్టియు నీదండయాత్రం గుఱించి విన్నవాఁడై, బుస్సీ స్వయముగా ౧౭౫౪-వ సంవత్సరము జూలై నెలలో మచిలీపట్టణమునకు వెళ్లి అటనుండి ఆగష్టు నెలలో, మహారాష్ట్రులు దండయాత్రచేసిన కాలమున రేగిన యల్లరుల నణఁచుటకును, దమకు నూతనముగా నొసంగఁబడిన పరగణాల పరిపాలనా విధానమును జక్కఁబఱచుటకును, నాలుగు పరగణాలకు మధ్యస్థముగా నున్న రాజమహేంద్రవరమునకుఁ బోయిచేరెను. మహారాష్ట్రులును దాము దోచుకొన్న దోపిడితో సంతృప్తిచెందినవారై జాఫర్ ఆలీ కిఁక నేమాత్రము సహాయముచేయక మిన్నకుండిరి. అందువలన జాఫర్ ఆలీ ఆశోపహతుఁడయ్యెననియు, నందువలన దమకేముప్పును రాదనియు నమ్మి బుస్సీ ఔరంగబాదునకు వెళ్లెను. ఆటుతరువాత నతఁడు మైసూరు మీఁదకు దాడివెడలినప్పుడును, అతనిని మహారాష్ట్రులును, సావనూరు నవాబును నెదుర్కొనినప్పుడును, అతనికిఁ దోడై నిలిచి మఱవరాని సాహాయ్యముఁ గొనరించెను.

* దివానుగానున్న షానవాజ్ ఖానును, నింతవఱకు రాజమహేంద్రవరము మొదలైన పరగణాలకు గవర్నరుగానున్న జాఫర్ ఆలీఖానును, ఇరువురుఁ గలసి బుస్సీ ఔరంగబాదులో లేనిసమయముఁ జూచి యతనిమీఁద కొండెములను జెప్పి నైజాము మనసు విరిచిరి. తనయౌన్నత్యమునకంతకును గారకుఁడు బుస్సీయేయైనను, అతనిని, ఫ్రెంచిసైన్యములను ద్వేషించుచు వారల నెల్లైన నైజాము కొలువునుండి తొలఁగించి యింగ్లీషువారిని రప్పించవలెనను నభిప్రాయముతో షానవాజ్ ఖాన్ నైజాముతో బుస్సీపైనున్నవి కొన్నియు, లేనివి కొన్నియు, గోరంతలు కొండంతలుచేసియుం జెప్పి కృతఘ్నుఁడను నపవాదమునకుఁ బాత్రుఁడయ్యెను. అంతట నైజాము వారు వచించినవన్నియు సత్యములని నమ్మి వారి ప్రోత్సాహమున ఫ్రెంచివారిని తన కొలువునుండి తొలఁగించెను. ఇది ౧౭౫౬-వ సంవత్సరము మే నెలలో జరిగెను. ఇంతటి మహాత్పరాభవానలముచే సంతప్తమానసుఁడయ్యు, బుస్సీ తన మనస్స్థైర్యమును విడనాడక, శత్రువులు తమ్ము వెంటాడించి వచ్చుచున్నను హైద్రాబాదు దగ్గర తనకున్న కొద్ది

* French history in India.

సైన్యముతో శత్రువు నెదిరించుటకు నిల్చెను. అతఁడట్లు తనస్థానమును గాపాడుకొనుచు, శత్రువును దరికిఁ జేరనీయకుండ కొట్టుచు నతితీవ్రముగ యుద్ధ మొనరించుచు, మూడు మాసములఁగడిపెను. అప్పటికతనికి మచిలీపట్టణమునుండి సైన్యములు వచ్చెను. వాని సహాయ్యముతో శత్రువులను జయించి నైజాముపద్దఁ దనయథాస్థానము నాక్రమించుకొనెను. అప్పుడతఁ డీనడుమలోఁ దనపై గుట్రలు పన్ని కొండెములుచెప్పి తుదకు సేనతో దన్నెదిరించిన షానవాజ్ ఖానునుగూడ, తొలఁగించఁడయ్యెను. ఈ వఱకు వరెనే నైజాము తరువాత నతనియంతటివాఁడై యధికారము నెఱపుచుండ వలయుననియే యతనికోరికగనుక బుస్సీ దానిని నెఱవేర్చుకొనుటకై తాను నైజాముచేతఁ దొలఁగింపఁ బడినప్పటినుండియుఁ బ్రియత్నించి తుదకు సఫలీకృతప్రయత్నుఁడయ్యెను. నైజాము సాలబత్ జంగు ౧౭౫౬వ సంవత్సరము ఆగష్టు ౨౦ తేదీన బుస్సీని అతనిపూర్వగౌరవములను బిరుదములను నాతనికి మఱలనొసంగి సన్మానించి యథావిధముతో పూర్వస్థానమునం దతని నుంచెను. ఇంతకు పూర్వము సంభవించినట్టి యపాయము ముందెన్నఁడును గలుగకుండున ట్లేర్పాటులు చేయుచు బుస్సీ ౨౫వ ఆగష్టు మొదలుకొని ౧౫వ నవంబరు వఱకు హైద్రాబాదులోనుండెను. పిదప నీ౧౫వ తేదీనే తన యధికారమును బునఃస్థాపన మొనరించుటకై ౫౦౦ల యూరోపియనులను, 4వేల సిపాయిలను దీసికొని యుత్తరసర్కారులకుఁ బయనమయ్యెను. ఔరంగబాదునకు వెళ్లదలచిన సాలబత్ జంగ్ నకు ౨౦౦ల యూరోపియనులను, ౫౦౦లసిపాయిలను నొక విశ్వాస పాత్రుఁడైన యుద్యోగియుని క్రిందనుంచి తోడిచ్చెను.

బుస్సీ, హైదరాబాదులో యుద్ధ మొనరించుచున్న కాలమున సర్కారులలోఁ గొన్ని కలహములు రేఁగెను. అందువలన నాసమయమునఁదమపక్షమునుండి విశ్వాసము గనబరచిన జమీందారులను బహుమానించుటకును, కలహములు రేపఁ బ్రోత్సాహమిచ్చిన నాయకులనుగాని, కలహకారకులైన జమీందారులను గాని శిక్షించుటకును బుస్సీ సర్కారులకు రావలసివచ్చెను. అతఁడట్లు ౧౫వ నవంబరున హైద్రాబాదులోఁ బయలుదేఱి బెజవాడ, ఏలూరుల మీఁదుగా ౧౯వ డిసెంబరునకు రాజమహేంద్రవరము వచ్చిచేరెను. ఈనడుమలో బుస్సీ రాజమహేంద్రవర శ్రీకాకుళములకధికారిగా ఇబ్రహీమ్‌ఖాను అను వాని నియమించెను. కాని హైద్రాబాదున యుద్ధము జరుగుకాలమున ఇబ్రహీమ్ ఖాను ఫ్రెంచివారి యధికారమును ద్రోసిపుచ్చి తాను స్వతంత్రుఁడై పాలించుచుండెను.

ఇప్పుడు బుస్సీ వచ్చుచున్నాఁడని తెలిసికొనుటతోడనే యతఁడు దేశమునువిడిచి పాఱిపోయెను. ఇంతవఱకు ఫ్రెంచివారికి లోఁబడి వారియెడల విశ్వాసముగలవాఁడై యుండిన పూసపాటి విజయరామరాజుగారు పదివేల స్వసైన్యముతోను చాలమంది జమీందారులతోను బుస్సీనిఁ గలసుకొని యతనికి స్వాగతమొసంగ రాజమహేంద్రవరమున కరుదెంచిరి.

* ''తమదేశములోనుండి విజయనగరరాజ్యములోనికిఁ బాఱుచుండు కాలువలనుమళ్లించి బొబ్బిలిరంగారావుగారి కాపులు తమభూములకుఁ బెట్టుకున్నారనియు, దేశస్వభావమునుబట్టి బొబ్బిలివారిని సాధించుట సుసాధ్యముకాకపోయెననియు, విజయరామరాజుగారు మనస్సులో బొబ్బిలిరంగారావుగారిపై ద్వేషమువహించి యాయనను శిక్షించుటకై బుస్సీని తన యావచ్ఛక్తిని వినియోగించి బహువిధముల ప్రోత్సాహపఱిచి పురికొల్పెను. అంతమీఁద బుస్సీగారు బొబ్బిలిరాజ్యమును విడువవలసినదనియు, దానికిబదులుగా నధికవైశాల్యమునుమూల్యమునుగలదేశ మియ్యఁబడుననియు, రంగారావుగారికి వ్రాసిరి. రంగారావుగారు పిత్రుపితామహాగతమైన బొబ్బిలిరాజ్యమును విడచుటకంగీకరింపకపోవుటయేకాక తక్కినసంస్థానాధిపతులతోడిపాటుగా రాజమహేంద్రవరమునకువచ్చి యాతనిని సందర్శింపకపోయెను., రాజమహేంద్రవరమునకు విజయరామరాజుగారును తక్కినరాజులును వచ్చుటనుగుఱించియు బొబ్బిలిరంగారావుగారు రాకపోవుటను గుఱించియు ౧౭౫౦-వ సంవత్సరప్రాంతములందున్న దిట్టకవినారాయణకవికృతమగు రంగరాయచరిత్ర మిట్లు వర్ణించుచున్నది

''ఉ॥ పాయనివేడ్క విద్విషదపాయకరాయత బాహుశౌర్యులా
పాయకరాయఁడుం గిమిడిపట్టణపుంబృథివీశ్వరుండు నా
రాయణదేవుఁడుం † నరసరాజు మఱింగొలుగొండ మన్నెపుం
రాయఁడు నాదిగాఁగల ధరావరులందఱు వచ్చిరత్తఱిన్॥

గీ॥ ఉద్ధతులముల్క సందర్శనోత్సుకత్వ
మాత్మఁజెట్టాడ నాడాడ నలరుమన్నె
దొరలు వచ్చిర మానుషదోః ప్రసంగ
కలితుఁడగు రంగరాయఁ డొక్కరుఁడుదక్క॥

---

* ఆంధ్రకవుల చరిత్రము.

† విజయనగరము దగ్గరనున్న గంద్రేడు కోపురత్తులను ప్రసిద్ధులును నగుక్షత్రి వారు నర్సరాజుగారు వీరే.

సీ॥ నిజభుజాదండనిర్నిద్ర కోదండంబు గాండీవకార్ముక క్రమముఁజూపఁ
జరమభాగస్ఫుటచ్ఛటుల తూణీరముల్ కవదొనసొంపు సంఘటిలఁజేయ
నాసీరముఖరనానాశంఖకధ్వనుల్ దేవదత్తారవోద్వృత్తిఁ దెలుప
నారౌఁబరతెంచు జలుమత తేజీలు ధవళాశ్వముల మస్తుద్రస్తరింపఁ
గీ॥ గలియుగార్జునుఁడౌర యీఘనుఁడటంచుఁ
దనుజగజ్జన మెన్న నుద్ధతులములుల్క
వీక్షణాపేక్ష సేతెంచె విజయరామ
రాజరాజన్యలోకమార్తాండమూర్తి॥
చ॥ నలువదివేల కాల్బలము నాలుగువేల తురంగమంబులున్
నలువదియేఁబ దేనుఁగు లనంతములైన శతఘ్నికాచయం
బులు నొకవేయి లొట్టియలపూర్వవిభావిభవంబుఁదెల్పుచున్
గొలువ పరాసు తోనిఁ గనుఁగోఁజనుదెంచెను రాజశేఖరన్ ॥"

ఈ కడపటి పద్యమందు విజయరామరాజుగారు నలువదివేల కాల్బలముతో వచ్చినట్లు చెప్పఁబడుచున్నను, ఆయనవెంట నిజముగా వచ్చినసేన పదివేలు మాత్రమే యని యాంగ్లేయచరిత్రకారుఁడైన ఆర్మిదొరగారు వ్రాసియున్నారు. "ఇట్లుండఁగా రంగారావుగారి యనుమతిమీఁదనే బుస్సీదొరగారు కొంచెము సిపాయీలను బొబ్బిలి రాజ్యముమీఁదుగా మఱియొక కోటకిఁబోవుటకుఁ బంపిరి. విజయరామరాజుగారి నేర్పువలననో రంగారావుగారి బుద్ధిపూర్వకమైన యేర్పాటువలననో పంపఁబడిన సిపాయీలు త్రోవలో బొబ్బిలిభటులచే నెదిరింపఁబడి ముప్పది ప్రాణములను గోలుపోయి మరలి రావలసిన వారయిరి. ఈ యవమానము విజయరామరాజుగారి ప్రోత్సాహమునకు తోడుపడఁగా, బుస్సీగారు రంగారావుగారిని శిక్షించి వారిని కుటుంబసహితముగా బొబ్బిలినుండి వెడలఁదోలుటకు నిశ్చయించుకొనెను. ఇన్నూటయేఁబండ్రు గుఱ్ఱపురౌతులును, నాలుగు ఫిరంగులును గల ౭౫౦ యూరోపియనులతోను విజయరామరాజుగారి భటులను సిపాయీలును గలిపిన ౧౧,౦౦౦ స్వదేశీయ పదాతిబలముతోను కొంతమంది క్షత్రియ వీరులతోను బుస్సీగారు బొబ్బిలికోట మీఁదికి దండువెడలిరి." ఈ యుద్ధమున కనేకులు రాజులు ఫ్రెంచివారి పక్షము నవలంబించియున్న విజయరామరాజుగారికి సాహాయ్యార్థ మేగుదెంచిరి. రంగారాయచరిత్ర మీవచ్చినరాజుల నిట్లు పేర్కొనుచున్నది.

"సీ॥ పాలుపొందఁ గార్లపూడి జగన్నాథ రాజుగారొక కొంత ఫౌజుతోడ
సత్యవరపురస్వామి యానందరామ భద్రిరాజొక కొంత బలముతోడ

ఘనయశోనిధిముఖ్య కాశీపతిక్ష్మాధవమౌళి యొకకొంత దళముతోడ
నఘువిక్రముఁడు జింతలపాటినీలాద్రి రాజుగారొకకొంత పోఁజుతోడ
గీ॥ విజయరామరాజక్ష్మావిభునిప్రోల
నేత్రపర్వంబొనర్చిరి నిజభుజాభు
జంగరససాయమాన ప్రచండనిశిత
మండలాగ్ర ప్రభావళుల్ మెండుకొనఁగ
మ॥ జగమెుక్కువ్వఁడిఁ గ్రమ్మఁ జాలెడు మహాసత్త్వంబుచే నొప్పుగొ
ప్పగుదా క్రొత్తలు గైత లొట్టియలు శోభానూర్తిఁ దగ్గొల్వ మా
మగులింగావనిభర్త రాజమణి సంతోషిల్లఁగా వచ్చెనొ
క్క గజోత్తంసము నెక్కి చొక్కమగు నుత్కంఠాతిరేకమ్మునన్॥
శా॥ ధన్యాటోపులు మందపాటి కులరత్నంబుల్ మహారాజమూ
ర్ధన్యుల్ శ్రీరఘునాథ రాజబలభద్రక్ష్మావరుల్ మున్నుసా
జన్య క్రీడలఁ బాఱుదెంచి శిబికాచంచద్గతుల్మీఱ రా
జన్యగ్రామణికిచ్చి యుత్సవముఁ దత్స్వాంతంబు కాంతంబుగన్।

ఈ పైనఁజెప్పిన రాజన్యశేఖరులేకాక, పెద్దాపుర సంస్థానాధీశులైన వత్సవాయ జగపతిరాజుగారుకూడ, విజయరామరాజుగారు తమ కొనరించిన యుపకారమును, మేలునాలోచించి కృతజ్ఞతానిబద్ధులై సంగర రంగమున కేగిరి. వీరిరాఁకను రంగరాయచరిత్ర కృతికర్తయగు దిట్టకవి నారాయణామాత్యుఁ డిట్లు వర్ణించియున్నాఁడు.

“శా॥ శ్రీరంజిల్లు కడాని పైడిజలతారీమాహురీ కెంపుటం
బారీ యేనుఁగునెక్కి పెక్కులు మదేభంబుల్ దనుంగొల్వరాఁ
గారూఢిన్ జతురంగ సైన్యములతో గర్జిల్లుచున్ వత్సవా
యీ రాయప్రభుమౌళివచ్చెఁ గడు రాజీక్షించి హర్షింపఁగన్”

హైదరాబాదువద్ద జరగిన యుద్ధములో పేరిచివారియొక్క సత్తువను దెలిసికొన్నవాఁడగుటచేత జాఫర్ అలీఖాన్ బొబ్బిలివారికి సాయపడ రాఁడయ్యెను.

౧౭౫౭వ సంవత్సరము జనేవరి నెలలో నేమన దేశమందలి భిక్షుకులచేత నిరంతరము గానముచేయఁబడుచుఁ బ్రసిద్ధినొందిన బొబ్బిలి యుద్ధము జరిగినది. ఆ మహాయుద్ధమున వెలమదొరలగు రావువంశీయులును, వారి సైన్యములును క్షత్రియవీరులును జూపిన యత్యంత శ్లాఘాపాత్రములగు ధైర్యశౌర్యసాహస పరాక్రమాది విషయములును, విజయరామరాజుగారు తాండ్రపాపయ్యచే నన్యాయముగా నిహతులైన సంగతియును, మన తెలుఁగుదేశమునందలి జనసామాన్యమునకుఁ దెలియనివికావు.

ఆటుపిమ్మట నీసంగతి విజయనగరములోనున్న చంద్రయ్యమ్మగారికి తెలియఁగా నామె తానిఁకజీవించుట వ్యర్థమనియు, బ్రతికియుండఁ దగదనియుఁజెప్పి సహగమనమునకుఁ బోయెదనని ప్రయాణముకాఁగా, నామె బావగారి కొమారుఁడు ఆనందరాజుగారువచ్చి సహగమనము చేయనెడలఁదన్ను వధియించి మఱియుఁబోవలసినదనిచెప్పి యామె నెట్టకేల కాప్రయత్నమునుండి మఱలించెను. తన పినతండ్రిగారితో బుస్సీగారు చేసిన యేర్పాటులాయనకు సంతృప్తికరముగ నుండకపోవుటచేత ఆనందరాజుగారు ఫ్రెంచివారిని దేశమునుండి వెడలఁగొట్ట వారికి బదులుగా నాంగ్లేయులను రప్పించవలెనని యోచించి కలకత్తాలోను, చెన్నపట్టణములోనునున్న ఇంగ్లీషువారికి, ఉత్తరసర్కారులపై దండెత్తివచ్చినచో తనశక్తియంతయున్న సాహాయ్యమును దాను చేయుదునని చెప్పి యుత్తరములువ్రాసెను.

బుస్సీ శ్రీకాకుళము పరగణానుండి ౧౭౫౭-వ సంవత్సరాంతమున రాజమహేంద్రవరమున కరిగెను. అటనుండి యౌరంగబాదునకుఁ గొన్నితొందరలుగలుగుటచే నక్కడకుఁబోవలసినవాఁడయ్యెను. అతఁడౌరంగబాదుననున్న సమయముననే హిందూదేశమునందలి ఫ్రెంచి స్థానములకు గవర్నరు జనరలుగావచ్చిన మాన్స్యూర్ లాలీ, యతనినిఁ గర్నాటకమునకుఁ బోవలసినదని యాజ్ఞాపించెను. ఆతని యాజ్ఞానుసారముగ బుస్సీ ఔరంగబాదునుండి బయలుదేఱి తన సైన్యముతో మచిలీపట్టణము దాపునకువచ్చెను. కృష్ణానదిమీఁదనున్న రెయ్యూరువద్ద బుస్సీ తనకు బదులుగావచ్చిన యుద్యోగియగు మార్క్విస్ డికాన్ఫ్లాన్స్ అనువానికి ౧౭౫౮-వ సంవత్సరము ఆగష్టు ౩-వ తేదిని దన సైన్యాధిపత్యమును, ఉత్తరసర్కార్ల పరిపాలనాధికారమును గూడ నొప్పగించి, కర్నాటకమునకు వెడలిపోయెను.

ఔరంగబాదునకుఁ బోవుటకై బుస్సీ యెప్పుడు రాజమహేంద్రవరము విడిచెనో, యప్పటినుండియు ఆనందరాజుగారు చేసినపనులు ఫలోన్ముఖములుకాఁజొచ్చెను. బంగాళమునుండి కల్నల్ ఫోర్డు అనునతఁడు ౫౦౦ల యూరోపియనులును ౨౦౦౦ లమంది సిపాయిలును, ౧౦౦ మంది ఓడకళాసువాండ్రునుగల సైన్యముతో బయలుదేఱివచ్చెను. ఈవచ్చిన ఇంగ్లీషుసైన్యము నవంబరు ౧౨ తేదిని విశాఖపట్టణమునుండి పయనమైపోయి ఖాసింకోటవద్ద ఆనందరాజుగారిని కలుసుకొనెను. ఆనందరాజుగారాసైన్యముతోఁగలిసి తన్నెదిరించుటకై రాజమహేంద్రవరమునొద్ద సైన్యసమేతులై వచ్చియున్న ఫ్రెంచివారిని గలిసికొన నేగిరి. అప్పుడానందరాజుగారికిని ఇంగ్లీషువారికిని నొకయొడంబడిక జరిగెను. ఆ యొడంబడికప్రకారము ముందు జయింపఁబడఁగల దేశమంతయు ఆనందరాజుగారికి రివిన్యూవసూలుచేసికొను

, కిచ్చుటకును, రేవుపట్టణములున్ను, నదీముఖద్వీపమునందున్న పట్టణములును ఇంగ్లీ
షువారికిచ్చి వేయఁబడుటకును, ఆనందరాజుగారు నెలకు రు ౫౦,౦౦౦ లు సైన్య
వ్యయముక్రిందను, రు ౬,౦౦౦ లు ఉద్యోగీయుల ప్రత్యేక వ్యయములక్రిందను
యిచ్చుచుండుటకును, ఆనందరాజుగారియొక్కగాని ఇంగ్లీషువారియొక్కగాని స్వాధీ
నమునందున్న దేశముల నొకరికమ్ముటగాని యిచ్చివేయుటగాని యుభయుల యంగీ
కారముమీఁదనే జరుగుటకును నేర్పాటుకావింపఁబడెను. పిదప నాయుభయులుఁ
ను, తమతమసైన్యములనొక్కటిగాఁ జేర్చి ప్రయాణమైరి. * ఆ యుభయుల సైన్యము
లకు డిశంబరు ౩-వ తేదిని ఫ్రెంచిసేనలు గొల్లప్రోలుపద్ద విడిసియుండుటఁ గానవచ్చె
ను. కాన్ఫ్లాన్సు అనునతఁడు శత్రుసైన్యమునకు సేనాధిపత్యమును వహించెను.
అతని సైన్యమున ౫౦౦ల మంది యూరోపియనులును, ౬,౦౦౦ల మంది సిపాయిలు
ను, ౫౦౦లు దేశీయగుఱ్ఱపుదళమును, చాలమంది స్వదేశ సైనికులును నుండిరి.
ఇంగ్లేయులవైపు ౪౭౦ మంది యూరోపియనులును, ౧౯౦౦ల మంది సిపాయిలు
నుండిరి. ఇదియునుంగాక యానందగజపతిరాజుగారు ౫౦౦ల మంది గుఱ్ఱపుదళము
తోను, ౫౦౦౦ల మంది కాల్బలముతోను మరికొంద తేఁటెకాంద్రతోను విలుకాం
డ్రతోను సహాయముగనే తెంచిరి. డిశెంబరు ౬-వ తేదిని ఆంగ్లేయులు, శత్రువునకు
నాలుగుమైళ్లదూరమునన్న చేబ్రోలుగ్రామము నాక్రమించుకొనిరి. ఉభయపక్ష
ముల సేనాధిపతులునుగూడ, పరసైన్యమెంతయుద్దండముగవచ్చినను తమ్మురక్షించు
కొనుచు శత్రువులనెదిరించి యుద్ధముచేయుటకుఁ దామాక్రమించుకొన్నస్థలము మిక్కి
లి వీలుగా కుదిరినదని తమ స్థానములను గదలక మూఁడు దినములవఱకు నిలిచిపోయిరి.
ఆంగ్లేయ సేనానాయకుఁడు కుడిచేతివైపునగాఁ బర్వతప్రాంతములకుఁబోయి ఫ్రెంచి
వారికి వెనుకనున్న రాజమహేంద్రవరమునకుఁ బోవు రాజమార్గమునుబట్టుకొని యావిధ
మున శత్రువు నోడించుటకుఁ బ్రయత్నించిన బాగుగనుండునని తలంచి డిశెంబరు ౯-వ
తేది యుదయమునఁ బైలుదేఱి చేబ్రోలుకు మూఁడు మైళ్లదూరమున నున్నట్టి
కుందూరు లేక చందుర్తి గ్రామమునకు ౮ గంటలకు వచ్చిచేరెను. ఇప్పటికిని ఆం
గ్లేయ సైన్యమునకును పరాసుసైన్యమునకును నాలుగు మైళ్లయెడము కలదు. కాని
ఆంగ్లేయసైన్యమునకు వ్యూహమునన్నుటకు మునుపటికన్న నీస్థలమే మిక్కిలి యను
కూలముగఁ గుదిరియుండెను. ఆంగ్లేయస్కంధావారమునకును, పరాసుశిబిరముల
కునునడుమ (ప్రస్తుతము పాడుపడిన) నాగుల పెంట గ్రామముకలదు. దాని నాక్రమిం
చుకొన్నయెడల స్వరక్షణమునకేమి, శత్రువునెదిరించుటకేమి మిక్కిలి యనుకూలమైన

* Godavary District Gazetteer.

స్థలముగా నుండుననియు దానినిఁ బట్టుకొనుటకే ఫోర్డు కదలివచ్చుచున్నాఁడనియు నూహించి పరాసు సేనానాయకుఁడైన కాన్ఫ్లాన్సు, తానున్న స్థలమునుండి కదలి పరసైన్యాగమనమును నిరోధించ నేగెను. ఫోర్డుమాత్రము తానున్న స్థలమునుండి కదలక శత్రుచలనమునుబట్టియే తన వ్యూహమును జక్కఁబఱచుకొను నుద్దేశ్యముతో నాగిపోయెను. అతఁడాగిపోవుటకుఁ గారణము సైన్యముయొక్క బలహీనతయు, భయము నేగాని తదితర కారణము లెవ్వియుఁ గావనియు, తిరిగి యింగ్లీషువారు తమపూర్వ సేనానివేశమైన చేబ్రోలునకు మఱలి పోవుచున్నారనియుఁ దలంచి కాన్ఫ్లాన్సు తన సైన్యమును ముందుకు వేగిరపడి నడపించెను. ఇప్పుడుభయసైన్యములు ముఖాముఖినొండొంటిం డీకొనినవి. ఇచ్చట నిరువాఁగులవారికిని గొప్ప సమరము జరిగెను. ఆ సంకులసమరమున కల్నల్ ఫోర్డుయొక్క బుద్ధికుశలతచేత నాంగ్లేయులకే విజయము చేకూరెను. ఈ యుద్ధమున ఫ్రెంచివారివైపు ఆఱుగు రుద్యోగీయులును, డెబ్బది మంది జనులును చనిపోయిరి. దాదాపుగఁ జనిపోయినంతమంది జనమును ఖయిదీలుగఁ బట్టుకొనఁబడిరి. ఇఁక నాంగ్లేయులవైపు నొక యుద్యోగీయుఁడును, పదునేనుగురు జనమును నష్టపోయిరట. కొద్దిమందికి గాయములు తగిలెను. పరాసు సేనానాయకుఁడైన కాన్ఫ్లాన్సు, యుద్ధరంగమునుండి రాజమహేంద్రనరమునకు నలుబదిమైళ్లదూరమున్నను గుఱ్ఱపుసవారిమీఁద నర్ధరాత్రమునకువచ్చి చేరెను.

ఈజిల్లాలో జరిగిన యుద్ధములో నిదియే ముఖ్యమైనది. దీనినిబట్టి ౧౭౫౮-వ సంవత్సరమునాఁటికి ఫ్రెంచివారి యాధీనములోనున్న యుత్తరసర్కారులు ఆంగ్లేయులవశమగుటయు, నీజిల్లాయందాంగ్లేయుల యధికారము స్థాపితమగుటయు సంభవించినది. ఈ విషయమున విజయనగరాధీశ్వరు లాంగ్లేయులకు చేసినసహాయ మెన్నటికిని మరువఁదగినదికాదు. ఈ యుద్ధమును ప్రజలు మొన్నటివఱకు సంస్మరించుచు భీతిల్లుచు నే యుండిరి.

౧౭౫౭-వ సంవత్సరమున నైజాము రాష్ట్రమునుండి రోహిలాలు దండెత్తివచ్చుచున్నప్పుడు, ప్రజలందరుకూడ, తమపోయిన రాష్ట్రమునుదిరిగి సంపాదించుకొనుటకై పరాసువా రసంఖ్యాకములగు సైన్యములను గూర్చుకొని వచ్చుచున్నారనియే తలపోయుచువచ్చిరి.

ఓడిపోయిన పరాసు సైన్యమనేక మార్గములంబట్టి రాజమహేంద్రవరము వచ్చిచేరెను. కల్నల్ ఫోర్డు తత్క్షణమే ౧౫౦౦ల మంది సిపాయిలను ముందుగాబోయి రాజమహేంద్రవరదుర్గము నాక్రమించుకొనవలసినదని ప్రయాణముచేసి పంపి తాను వెనుకనుండి బైలుదేఱెను.

తమవైపు వచ్చుచున్నది యొక సైన్యవిభాగమని యెఱుంగక యొకమహాసైన్య
ని తలంచి, కోటలోనున్న ఫ్రెంచివారు తమ్ము రక్షించుకొనుటకుఁ జాలినంత మూల
ము లేకపోవుటచేత దుర్గమును విడిచిపెట్టిరి. చాలమంది యూరోపియనులొకపడవ
పై గోదావరినదినిదాఁటుటకై ప్రయాణమైపోయి నదీమధ్యముననుండిరి. చాలపడవలు
ందుగుండుసామానుతోనిండి గోదావరి యావలియొడ్డును జేరికొనెను.

అప్పుడింగ్లీషువారు రాజమహేంద్రవరదుర్గము నాక్రమించుకొని, కోటగోడల
ందనుండి గోదావరికవతలియొడ్డున మందుగుండుసామానుతో నున్నవారిపై నగ్నివర్ష
ము గురిపించసాగిరి. దానివలన నవతలిగట్టునుండు శత్రువులు తమమందుగుండు సామా
ను దీసికొని పోవుటకుఁగాని, యచ్చటనిలిచి యుండుటకుఁగాని వీలు కలుగ దయ్యెను.
ంత మందుగుండు సామానుతోను, మఱికొన్ని యుద్ధోపకరణములతోను రాజమహేం
ద్రవరముకోటలోనున్న పదునేనుగురు యూరోపియనులు ఖయిదీలుగఁ బట్టుకొనఁబడిరి.
ప్పుడు మిగతసైన్యవిభాగమును దీసికొని కల్నల్ ఫోర్డు రాజమహేంద్రవరము వచ్చి
రెను. ఆనందగజపతిరాజుగారును, వారిబలములును నిజమునకు యుద్ధసందర్భమున నే
క్షమైన జోక్యమును గలుగఁజేసికొనక ఫోర్డువెంబడిని సహాయముగరాక, యుద్ధరంగము
కిరుగు పొరుగుల తచ్చాడుచుండెను. ఆంగ్లేయసైన్యము తత్క్షణమే ఫ్రెంచివారిని వెంటా
ంచి తఱుము నుద్దేశ్యముతో ౨౩ వ తేదీని గోదావరినదిని దాఁటెను.

ఈసంగతి యిట్లుండఁగా కుందూరుయొద్దజరిగిన యుద్ధములో విజయులైన యానం
గజపతిరాజుగారు ఆంగ్లేయులను సహాయముతీసికొని తనరాజ్యము నభివృద్ధిపఱచు
ను నుద్దేశ్యముతో వచ్చుచున్నారని యితర జమీందారులవలెనే శ్యామలకోటలో
ణాచేసికొనియున్న పిఠాపుర ప్రభువులైన పెదమహీపతిరాయనింగారును నీలాద్రి
రాయనింగారును కూడ ననుమానించిరి.

పెదమహీపతిరాయనింగారు రుస్తుంఖానునిచేతఁ దలకొట్టబడిన బుచ్చన్నగారి
మనుమలు. నీలాద్రిరాయనింగారు బుచ్చన్నగారి యన్నకొమారులు. మహీపతిరాయనిం
గారు బాల్యులైయుండుటచేత నీలాద్రిరాయనింగారే వ్యవహారదక్షులై రాజకార్యము
లను నడపుచుండిరి.

* వీరిరువురును పెద్దాపురపు శ్రీవత్సవాయజగపతిరాజుగారు మొదలగు నుత్తర
సర్కారులందలి యితరజమీందారులవలె కుందూరుయుద్ధమున ఫ్రెంచివారిపక్షమున
నిలువఁబడి, జోక్యము కలుగఁజేసికొనినవారుకారు. వీరిరువురును, గజపతిరాజుగారు

* History of Pithapuram.

సాంగ్లేయులును శ్యామల కోటపై దండెత్తి వచ్చుచున్నారని విని వారి నెదిరించుటకై కాకినాడలోనున్న డచ్చి (వలందు) వారిని సహాయముకోరిరి. మూఁడు నెలలవఱకు డచ్చివారి సహాయముతో పిఠాపురప్రభువులు శత్రువులకు దుస్సాధ్యులై నిలిచి కోటను సంరక్షించుకొనుచుండిరి కాని యాహారపదార్థముల లేమిచేతననో లేక మరియేకారణముననో కోటలోనున్నవారు శత్రువులకు లొంగుటయుఁ, గోటపై సాంగ్లేయుల బావుటా ప్రతిష్ఠింపఁబడుటయుఁగూడ జరిగినది. అటుపిమ్మట గజపతిరాజుగారు పెద్దాపురపుమార్గమున రాజమహేంద్రవరము పోవుచు నల్లచెఱువు గ్రామముదగ్గఱ విడుదుల విడిసి జగపతిరాజుగారిని వంచించు కృత్రిమోద్దేశ్యముతో పెద్దమనుష్యులద్వారా తమ్మొక్కమాఱు కలిసికొనవలసినదని నమ్మకముగా ఆయనకుఁ గబురుపంపించెను. దీనినంతయు సత్యమేయని విశ్వసించి జగపతిరాజుగారు గజపతిరాజుగారి కొఱకుఁ గోటలో మేజువాణి మొదలగునవి సిద్ధముజేయించి సముచితగౌరవపరివారముతో ఆయనను గలిసికొన పాలకీయెక్కి ప్రయాణమైపోయి నల్లచెఱువును సమీపించిరి. ఆనందగజపతిరాజుగారును తమకృత్రిమోద్దేశ్యపరిసమాప్తికొఱకే కీలకే మందుమున్నగునవి ధట్టించి బారుచేసి సిద్ధముగానుంచిన ఫిరంగులను పరివారసహితులైన జగపతిరాజుగారు సమీపమునకు రాఁగానే ప్రేల్పించిరి. అప్పుడు వత్సవాయజగపతిరాజుగారు ఆనందరాజుగారి కాపట్యమును, తమపరివారము చెల్లాచెదరై పోవుటయుం దెలిసికొని, యొక్కగుఱ్ఱము నెక్కి యొకాయొకనిఁబోయి తమ కోటలోఁ బ్రవేశించి, తమసైన్యములు యుద్ధసన్నద్ధములు గాకయుండుటచేత నొకవేళ నీలోపున నేరాఁగల యానందరాజుగారిని నిగ్రహించుట కష్టమనియు, నంగునలననట్టి సందిగ్ధసమయమున మరణమే శ్రేయస్కరమనియు నెంచి నగర్లలోఁ దుపాకిమందు పరపించి స్త్రీలతోఁగూడఁ జిచ్చంటించుకొని మృతినొందుటకు సిద్ధపడిరని స్థానికచరిత్రముఁ జెప్పుచున్నది. కాలము తప్పినవచ్చినపుడు శూరుఁడైన నాలోచింపక తీఁగదుకదా! అంతట గజపతిరాజుగారు వచ్చి సంగతి తెలిసికొని మీరు చనిపోవలసినంత యగత్యమేమియును లేదనియు, మీకొమారులైన తిమ్మరాజుగారిని, రాష్ట్రమును, తమకప్పగింతచేసి మీయిష్టము వచ్చిన యేస్థలమునకైన వెడలిపోవలసినదనియు జగపతిరాజుగారితోఁ జెప్పిరి. అంతట జగపతిరాజుగారు తాము బ్రతికియున్నయెడల నెప్పటికైన ఆనందగజపతిగారిపైఁ బగ సాధించుకొనవచ్చునని తలంచి దేశమును విడిచిపెట్ట నంగీకరించిరి. కాని జగపతిరాజుగారు, గజపతిరాజుగారిని నమ్మలేక తాము గోదావరిని దాఁటకమున్నే తమకేహాని చేయుదురోయని యెంచి గజపతిరాజుగారితో తమకు పండ్రెండుజండల సైన్యమునకు సరదారులైన యిరువురు పెద్దమనుష్యులు వారి సైన్యముతోవచ్చి తమ్ము గోదావరిగడచి వెళ్లుపర్యంతము క్షేమముగా సాగనంపుటకు కరారుచేసికొనిరి. ఆప్రకారమే యిరువురు

సరదారులు తమసైన్యములతోవచ్చి జగపతిరాజుగారిని రాజమహేంద్రవరమువద్ద గోదావరినిదాటించి యవతలికి సుఖముగాఁబంపించిరి.

---

## —:పెద్దాపురము గజపతుల యధీనముక్రిందకు వచ్చుట:—

పిదప ఆనందగజపతిరాజుగారు జగపతిరాజుగారి భార్యాపుత్రులను దమయమానిలోనుంచి, పెద్దాపురపుజమీందారీని వశపఱుచుకొనుటకుఁ దమతరపువ్యవహారస్థులను నియమించి కోటలోఁతాణావేయించిరి. నాఁటినుండియుఁ బెద్దాపురముకోట యొకకొంత కాలమువఱకు గజపతులయధీనము క్రిందకువచ్చెను.

అటుపిమ్మట ఆనందగజపతిరాజుగారు రాజమహేంద్రవరమువెళ్లిరి. అప్పటికప్పుడే యేతద్దుర్గము ఫోర్డు స్వాధీనమైయుండుట యానందరాజుగారి కొకయద్భుతముగాఁ గనఁబడెను. రాజమహేంద్రవరదుర్గమును దమ స్వాధీనముచేసినయెడలఁ దామిచ్చెద మన్న సైన్యపోషకధనమును ఆనందరాజుగారు చెల్లించలేకపోయిరి. అందువలన కల్నల్ ఫోర్డు ఫ్రెంచివారినిఁ దఱుముట వదలిపెట్టి, మిక్కిలి విసుఁగుదలతోను, కోపముతోను, గోదావరినిదాఁటి యీవలకు వచ్చెను. ఆనందగజపతిరాజుగారును, ఫోర్డు తనపైఁ బగసాధించుకొన వచ్చుచున్నాఁడేమోయనితలంచి రంపమన్యము దిక్కుగా దగ్గరనున్న కొండలకుఁబాఱిపోయిరి.

ఆంగ్లేయసైన్యాధిపుఁడైన కల్నల్ ఫోర్డు విశాఖపట్టణముననున్న తమ యాంగ్లేయులతో రాకపోకలు జరుపుట కనువుఁజేసికొనుటకై పెద్దాపురమువఱకును బోయెను. విశాఖపట్టణమున కీక్రితము నెలలో ఆండ్రూస్ యనునొకయుద్యోగస్థుఁడువచ్చియుండెను. అతఁడానందగజపతిరాజుగారితో రాజీనామారాయబారములు జరుపుటకు వెనుకకుఁ బంపఁబడెను. అతఁడానందగజపతిరాజుగారిని కొండలలో నుండఁగనే దర్శించి రాయబారము నడిపెను. ఆండ్రూస్ ఆనందగజపతిరాజుగారిని శాంతపఱచి తమతో రాజీకి వచ్చునట్లొడంబఱచి, పెద్దాపురమువద్దనున్న యాంగ్లేయ సైన్యమును గలిసికొనవలసినదని ప్రోత్సాహపఱచెను.

ఇట్లు మిక్కిలి విలువగలిగిన కొంతకాలమును వ్యర్థపుచ్చిన తరువాత ఫోర్డు ౧౭౫౯ సంవత్సరము జనవరి ౨౫ తేదీని పెద్దాపురమునుండి బయలుదేఱి ఫిబ్రేవరు ౬వ తేదీనాఁటికి ఏలూరుచేరెను. అచ్చటనుండి యతఁడు నరసాపురమువద్దనున్న ఫ్రెంచివారి గిడ్డంగి నాక్రమించుకొనుటకు కెప్టెన్ నాక్సు అనువానికి సేనాధిపత్యమునిచ్చి కొంతసైన్యమును బంపించెను.

నరసాపురమున ఫ్రెంచివారిపక్షమున నూఱుమంది యూరోపియనులును, ౩౦౦ల మందియో లేక ౪౦౦ల మందియో సిపాయిలును గలరు. ఆతాలూకాకు జమీందారుండైన మొగల్తుఱ్ఱు (నరసాపురసమీపగ్రామము) రాజును ఆంగ్లేయులు తమకువచ్చి సాయపడవలసినదనికోరిరి. ఆయాహ్వానమునకు మనఃపూర్వకముగ సంతసించినవాఁడై మొగలితుఱ్ఱు జమీందారుఁడు కెప్టెన్ నాక్సును వచ్చి కలిసికొని తనకుఁ జేతనైనంత సహాయమునంతయుఁజేసెను. పరాసువారును జమీందారునియొక్క సహాయమునే నమ్ముకొనియుండిరి. కాని యెప్పుడు జమీందారుఁడు వారికి సాయపడ నేగఁడయ్యెనో వారప్పుడే గిడ్డంగిని వదలిపెట్టి తాము మోసికొనిపోవలేని మందుగుండుసామానునంతయు గోదావరిలో ముంచి వేసివెళ్లిరి. నాక్సు, గిడ్డంగిని రక్షించుటకొఱకై కొంతమంది సైనికుల నచ్చట దిగవిడిచి మిగతపరివారముతో నేలూరువచ్చి యింకను నచ్చటనే నిలిచియున్న విజయనగరమురాజుగారిని గలిసికొనెను.

ఈలోపుగా కాన్ఫ్లాన్సు మచిలీపట్టణమునకుఁబోయెను. ఇతనియొక్క కోరిక వలన దక్కనుసుబాదారుఁడైన సాలబత్ జంగు కృష్ణాపల్లపుభూములనున్న యాంగ్లేయులపై దాడివెడలెను. మార్చి ౭వ తేదీని ఫోర్డు మచిలీపట్టణమునకుఁబోయి దాని నొక మాసమువఱకుముట్టడించినపిదప నాక్రమించుకొనెను. ౧౭౫౯న సంవత్సరము మే నెల ౧౪వ తేదీని ఫోర్డు సాలబత్ జంగుతో సంధిచేసికొనెను. ఆసంధిప్రకారము మచిలీపట్టణమునకుఁ జుట్టుపట్లనుండు ప్రదేశమును, నైజాంపట్నమును ఈనాముగా నాంగ్లేయుల కియ్యఁబడెను. అప్పటినుండియు సుబాదారుకూడ ఫ్రెంచివారితోఁ దనకున్న స్నేహమునంతయు వదలుకొందుననియు, నిఁకనెప్పటికి నుత్తరసర్కారులలో ఫ్రెంచివారిని స్థిరనివాసమేర్పఱుచుకొనకుండ నిరోధించెదననియు వాగ్దానముఁ జేసెను. ఈయొడంబడికనుబట్టి గోదావరినదికుత్తరముననున్న దేశమంతయు మఱల దక్కనుసుబాదారునియధికారము క్రిందకు వచ్చెను.

ఆతక్షణమే యుత్తరసర్కారులనుండి ఫ్రెంచిసైన్యమింకను పూర్తిగా వెడలిపోదయ్యెను. ౨౫౦ మంది యూరోపియనులును, ౨,౦౦౦ ల మంది సిపాయిలును గలయొకచిన్నసైన్యము ఆంగ్లేయులకు వచ్చుచున్న యాహారపదార్థములనుగాని, మందుగుండుసామానునుగాని, సహాయసైన్యమునుగాని నాశనముచేయుటకై మచిలీపట్నము రాజమహేంద్రవరములకు మధ్య నిలిచి పోయెను. ఆసైన్యము రాజమహేంద్రవరమునకుఁ బోయి యచ్చట నున్నయాంగ్లేయసైనికుల నోడించి యాదుర్గము నాక్రమించుకొనెను. కాని త్వరలోనే సాలబత్ జంగును గలిసికొను నుద్దేశ్యముతో దానిని విడిచిపెట్టి వెళ్లిపోయెను.

తరువాత రాజమహేంద్రవరమువద్ద గోదావరినదిని దాఁటి పశ్చిమముగా నేగిన త్సవాయజగపతిరాజుగారు కంభముమెట్టుకుఁ బోయి యటనుండి వేలుపుకొండ కరిగి యక్కడనుండి ప్రండ్రెండువందల సైన్యమునకు వేలుపుకొండ తుపాకినౌకరీ ఖాయము జేసినపిదప వారిని వెంటఁబెట్టుకొని రాజలింగము, కొత్తపల్లిమార్గమున మన్యమునుబట్టి పెద్దాపుర సమీపముననున్న రాగంపేటకు నాలుగునెలలకు వచ్చిచేరిరి.

ఈలోపుననే మచిలీపట్టణ మాంగ్లేయులకు వశమైనదని తెలియకమునుపే ముసాసిక్ అను ఫ్రెంచియుద్యోగియుఁడు తగినంతయుద్ధసహాయసంపత్తితో దక్షిణము నుండి మచిలీపట్నమునకుఁ బయలుదేఱెను. అతఁడు నవంబరు ౧౧వ తేదీకి అప్పటికిని డచ్ (వలందు) వారియధీనములోనున్న కాకినాడ వచ్చిచేరి, కుందూరు యుద్ధమునఁ దమ పక్షమవలంబించి పోరాడినట్టి విశ్వాసపాత్రుఁడైన మిత్రసర్వ్యుఁడుగానున్న జగపతిరాజుగారితోఁ దమయధికారమును బునఃస్థాపన మొనరించుటకును, ఆంగ్లేయుల నుత్తరసర్కారునుండి తరిమివేయుటకును గుట్రలుపన్నఁజొచ్చెను. కాని యాతనిప్రయత్నము లేమాత్రమును సఫలములు కాకపోవుటచేత వెంటనే ప్రయాణమై యోడమీఁదుగా పుదుచ్చేరికివెళ్లి చేరెను.

ఆ సంవత్సరమే డిశెంబరునెలలో ౫౦ మంది యూరోపియనులును, ౧౦౦ మంది సిపాయిలునుగలయొక్క చిన్న ఫ్రెంచిసైన్యము వెనుకటివలెనే జగపతిరాజుగారితో యోచనలుచేసి, వ్యవహారము జరుపుటకై కాకినాడవద్దదిగెను. శ్రీజగపతిరాజుగారు, రావు నీలాద్రిరాయనింగారితోఁగూడి డచ్చివారిద్వారా రాయబారములు జరుపుచుండఁ, గొందఱు పరాసువారు కోటమీద నున్న యాంగ్లేయుల బావుటాను పెకలించి తమ బావుటాను నాటిరి. పిదప నీసంగతియంతయు గజపతిరాజుగారివ్యవహారస్థులును, పెద్దాపురపుకోటఠాణాలో నున్నవారును ఆనందగజపతిరాజుగారికి జాబులమూలమునఁ దెలిపిరి. అటుపిమ్మట ఆనందగజపతిరాజుగారు తమసైన్యమునంతయు వెంటఁబెట్టుకొని జగపతిరాజుగారిని, ఫ్రెంచివారిని సాధించుటకై పయనమైరి. ఈసమయముననే మచిలీపట్నమువద్ద కెప్టెన్ ఫిషర్ యొక్క సేనాధిపత్యముననున్న యాంగ్లేయసైన్యము బంగాళమునకుఁ బయనమై వెళ్లుచుండెను. ఆసైన్యాధీశుఁడగు ఫిషర్ రాజమహేంద్రవరము వచ్చుసరికి కాకినాడవద్ద ఫ్రెంచిసైన్యమున్నదని తెలిసికొనియచ్చటికి దానినోడించనరిగెను. ఈసైన్యమును, ఆనందగజపతిగారిసైన్యమునుగలిసి కాకినాడవెళ్లునప్పటికచ్చటనున్న కొంతమంది ఫ్రెంచివారు, డచ్చివారికోటలోదాఁగికొని పిదప లొంగిపోయిరి. ఓడలుదిగని మఱికొందఱు ఫ్రెంచివారు తమనౌకలును పుదుచ్చేరి మార్గమునకుఁదిప్పిరి.

ఆనందగజపతిరాజుగారు తమసైన్యములను దీసికొని శ్యామలకోటలోనున్న ఫ్రెంచి వారినిఁ దఱుమఁగొట్టి, యాంగ్లేయుల ఛావుటాను మఱలఁబాతుటకై యుద్ధప్రయత్నములు చేసికొని సైన్యముతోఁ జాళుక్యభీమవరమువద్దనుండి వెళ్లుచుండిరి. అప్పుడు రావునీలాద్రిరాయనింగారును జగపతిరాజుగారును కాకర్లపూడివారితోఁ గలిసి కొన్ని వేలపౌజజుతో గజపతిరాజుగారిని మార్కొన నరిగిరి. కానిమార్గమధ్యమున వీరిసైన్యములోఁ గొంతభాగ మేకారణముననో వెనుకకు తగ్గినది. అప్పుడు నీలాద్రిరాయనింగారు సంగతిసందర్భములను, సైన్యస్థితిగతులను, యుద్ధోపకరణవిధానములను విచారించి యీసందర్భమున మనము నిగ్రహించుట కష్టమనియు, నిప్పుడు తిరిగి శ్యామలకోటవెళ్లుట యుక్తమనియు జగపతిరాజుగారితోనుడివిరి. కాని జగపతిరాజుగా రమేయపౌరుషముతో, వచ్చినవార మెట్లును రానేవచ్చినారము. యుద్ధరంగమునకుఁ బ్రయాణమైవచ్చి వెనుకకు మఱలిపోవుట వీరవరేణ్యులకుచితమగునా? తిరిగి మఱలుముఖము పెట్టుట శౌర్యలక్షణము కానేరదని చెప్పి యతిసాహసముతో మిగితబలములతో గజపతిరాజుగారి నెదిరింపఁబోయిరి.

ఈ యుభయయులసైన్యములు ఉండూరు ( శ్యామలకోట సమీపస్థగ్రామము ) సమీపమున సంధించినవి. అచ్చట నొక గొప్పసంకుల సమరముజరిగెను. ఈ యుద్ధమున గజపతిరాజుగారి ధాటికి నిలువలేక రావునీలాద్రిరాయనింగారు యుద్ధరంగమునుండి పాఱిపోయి తిరిగి శ్యామలకోటకువచ్చి యచ్చటనున్న చిన్నవాండ్రను వెంటఁబెట్టుకొని యింక నక్కడనిలువక జూపల్లెవారి సంస్థానములోనిదగు రాఘవపురమునకు వెళ్లి యట డాఁగియుండిరి. జగపతిరాజుగారుమాత్రము ధైర్యశౌర్యములతోనిలువఁబడి యమితవిక్రమమునుజూపుచు, సమరక్రీడను సల్పుచుండిరి. ఇట్లుండఁగా ఆయన యాకస్మికముగా గుండుదెబ్బతగిలి నేలంబడిరి. అంతట నీ సమాచారము ఆనందరాజుగారికిఁ దెలియఁజేయునప్పటి కాయన తలకొట్టి తీసికొనిరావలసినదని కఠినమైన యుత్తరువుసేసిరి. అంతట నీరాజశాసనమునాలించి సత్యారపుజమీందారుఁడును, క్షత్రియుఁడును, భోగాపురముకాకర్లపూడి వారి వంశీయుఁడును, స్వీయసంఘాభిమానియునగు శ్రీ రామభద్రపాయకరాయనింగారు ఆనందరాజుగారి సముఖమునకరిగి, యింతటి యకార్యమునొనర్చుట మీవంటిరాజేంద్రులకు ధర్మముకాదనియు, నదియునుగాక మీతండ్రిగారు మిమ్ములను ఈజగపతిరాజుగారినిఁ బెంచినారనియు, వీరికిపోయినసంస్థానము మీతండ్రిగారు నిర్వాహకముచేసి యిచ్చినారనియు, నందువలన నిప్పుడు మీరును పాలకీ పంపించి సగౌరవముగ నాయనం దోడ్తెచ్చుట యుక్తముకాని తలకొట్టినమిక్కిలి యపకీర్తి రాఁగలదనియు మనవిఁజేసికొనిరి. అటుపిమ్మట మీరవెళ్లి జగపతిరాజుగారిని, పాలకీలో

ంచి కొనిరావలసినదని యానందగజపతిరాజుగారు పాయకరాయనింగారికి సెలవిచ్చిరి. ఆప్రకారమే యాయనయు వెళ్ళి వారిని తీసుకొని వచ్చిరి కాని యానాఁడే నాఁడు రఘునాథులకుఁ దమ భౌతికదేహమును జాలించి వారు తమ యిరువదియయిదవయేట వఁగా క్రీ. శ. ౧౭౫౯వ సంవత్సరమునకు సరియయిన ప్రమాదిసంవత్సర పుష్యశుద్ధ నమినాఁడు వీరస్వర్గ ప్రాప్తులైరి.

ఈగోపుర బావుసీలాద్రిరాయనింగారు శ్యామలకోట విడిచిపెట్టి పాఱిపోవుటను తెలిసికొని గజపతిరాజుగారు యంషూరునుంచి శ్యామలకోటకువచ్చి కోటలోనున్న ఫ్రెంచి రక్షకభటులను తఱిమి తిరిగి యచట నాంగ్లేయుల బావుటాను నిలిపిరి.

ఈప్రకారము జగపతిరాజుగారిపాలన ముగింపునకు వచ్చెను. శ్రీరామవిలాసమను సహస్రగ్రంథమును రచియించినట్టియు, ముందుఁ జెప్పఁబోవు తిమ్మజగపతిరాజుగారి కాశ్రయముగా నుండినట్టియు, వేనుఁగు లక్ష్మణకవిగారు ఈ జగపతిరాజుగారి కాలమున నయితే యుండినట్లాయనచే రచియింపఁబడిన యీక్రిందిచాటుపద్యము నుడువుచున్నది.

"ఉ॥ ఆయతవత్సవాయ సుకులాంబుధి పూర్ణనిశాపతీ! జగ
ద్గేయ శుభాకృతీ! విదితకీర్తిసతీకమనీయయౌవన
ప్రాయవిలాసకృతీ! సతతదైన్యవినిర్జిత పూర్వదిక్పతీ!
శ్రీయుతవాక్పతీ! జగపతీ! నృపతీ! సుకృతీ! మహోన్నతీ!"

* ఈజగపతిరాజుగారు కవిత్వమునందు నిపుణులై పెక్కుపద్యములు శతకములు మొదలైనవి రచియించిరని మీఁదఁ జెప్పినట్లు రామవిలాసములోని యీపద్యముద్ఘోషించుచున్నది.

"చ. వినయముతోఁ గీర్తనల్ రచించి పద్యశతంబులు రాగమాలికా
ఘనతరదండకంబులు సమృద్ధిగనే రచియించి కామిత
ప్రదముగను శ్రీరామచంద్రప్రభుకీర్తనఁ గానుకగా నొసంగెనే
ప్రసిద్ధి మెచ్చ దా జగపతిప్రభుచంద్రుఁడు కీర్తివెంపునన్"

---

—♦ వత్సవాయి జగపతిరాజుగారి మరణము ♦—

శ్రీవత్సవాయి జగపతిరాజుగారు చనిపోయిన యనంతరమున వారిసహధర్మచారిణియగు సీతమ్మగారు తామీయొక్క భర్తృమరణప్రకారంబంతయు రామభద్ర

* వీరినాటినుండియే విజయనగరపు పూసపాటివారు గజపతిబిరుదమును, పెద్దాపురపు వత్సవాయవారు జగపతిబిరుదమును వహించుచు వచ్చినట్లు గానిపించుచున్నది.

పాయకరాయనింగారు తెలియఁజేసిరి. ఆ పతివ్రతాశిరోమణియు వెంటనే యాయన వాక్యములాలించుచునే సహగమనమునకు సిద్ధమయ్యెను. ఈ సంగతి యానందరాజుగారికి దెలియఁజెప్పఁగా నామెయిష్టమేలాగో యాలాగే కానియ్యవలసినదని చెప్పిరి. అప్పటికి శ్రీ సీతమ్మగారి కొమారులును వత్సవాయ వంశాబ్ధిచంద్రులు నగు తిమ్మజగపతిరాజుగారు పూసపాటివారి యధీనములో నున్నందున, సహగమన సంసిద్ధ యయినయాపవిత్రచరిత్ర దమకొమారులు భద్రముసుండి యనిపాయకరాయనింగారికొప్పఁజెప్పి సహగమనమునకు వెడలుచుమాకు సంభవించినయోగమే ఆనందరాజుగారికిని మూఁడు నెలలనాఁటికి సంభవించునుగాత మని శపియించి పెనిమిటిచితిపై నెక్కి దేహమును జాలించెనఁట !

ఈమె సహగమనముచేయుచుండఁగా ఆనందరాజుగారిభార్యలు పసుపుకుంకుమ మున్నగునవి పంపించిరనియు, మాదీదేశమేగాన మాకట్టిసాధనసంపత్తి గలదనియు, కొద్ది దినములలోనే మీకుసయితము సంభవించనైయున్న యిట్టియవస్థను దూరదేశమందున్న మీరే సిద్ధముచేసికొని యుంచుకొనుటమంచిదనియు హితోపదేశముచేసి, తమకు పంపించిన పసుపుకుంకుమలను దిరిగి పంపివేసిరని యొకగాథ చెప్పఁబడుచున్నది.

పిదప ఆనందరాజుగారు మఱిరెండుమాసములకు రాజమహేంద్రవరమున స్ఫోటకపడి కాలధర్మమునొందిరి. అప్పుడు వారి భార్య లిరువురుగూడ సహగమన మొనరించిరి. ఇది శాపబలమే కాఁబోలు ! కక్షబలముచే నవీనముగకల్పింపబడిన శాపబలము ! !

తదనంతర మనకాపల్లి, సర్వ్యవరము జమీందారులగు రామభద్రపాయకరాయనింగారును, బుజ్జా బుచ్చన్నగారు నిరువురు నాలోచించి వత్సవాయ జగపతిరాజుగారి యొక్క హింస తగిలియే యానందరాజుగారిట్లాల్పాయుష్కులైరనియు, నట్లేకానిచో నింతపనిజరిగియుండనేరదనియు, నిఁకనైనను వారిసంస్థానమును నిలువఁబెట్టి ముందునకుఁ దీసికొనివచ్చినగాని లేని యెడల నిట్టిదుర్మృత్యువుచావులే ప్రభువులకు సంభవింపఁగల వనియు, నదియునుంగాక జగపతిరాజుగారు చిన్నవారై యున్నప్పుడు విజయరామగజపతిరాజుగారు తమ యింటనే యుంచి పెంచిరనియు, నందువలన నాసంస్థానమొకటియు నీసంస్థానమొకటియుఁ గాదనియు, దూరాలోచనఁజేసి విచారించి వత్సవాయ వారి పక్షము వారితోఁజేరి తిమ్మజగపతిరాజుగారినిఁ దీసికొనిపోయి పెద్దాపురసంస్థానమున కభిషిక్తులంజేసిరి.

*ఇచ్చట విజయనగరమున, బుజ్జా బుచ్చన్నగారు, జరిగినసంగతు లన్నియు బొబ్బిలిలో మృతులైన పెదవిజయరామరాజుగారిభార్యయు, నప్పటి కథకారిణియు నైన చంద్రయ్యమ్మగారికి నివేదించిరి. పిదప నామెయుఁ గొంతతడవు పెద్దాపురపు వత్సవాయ వారికి సంభవిల్లిన యిక్కట్టులనుగురించియు, గతించిన యానందరాజుగారి నడవడికను

క్షేమించియు విచారించి బుచ్చన్నగారుచేసినపనికిహర్షించిరి. తరువాత సామె మంత్రుల హాలోచనలమీఁద తాళ్ళపాలెమునున్న తమ సన్నిహితజ్ఞాతియయిన పూసపాటి రామచంద్రరాజుగారి ద్వితీయభార్యాపుత్రుఁడైన పండ్రెండేండ్ల యీడుగల వేంకటపతిరాజను చిన్నవానిని పెంచుకొని, ఆచిన్నవానిపేరు విజయరామరాజుగామార్చి యాయనను పట్టాభిషిక్తునిఁ జేసెను.

---

## నాలుగవతిమ్మ జగపతి రాజు మహారాజులుంగారు :

### (క్రీ. శ. ౧౭౬౦—౧౭౯౭)

ఈ మహారాజులుంగారు రాజ్యమునకువచ్చునప్పటి కేడేండ్ల ప్రాయమువారు. మహాప్రభువునందుఁగల భక్తివిశ్వాసములచేఁ దమసంస్థానమును, ప్రజలను భద్రముగఁ గాపాడుచు మంత్రిసేనానాయకులే రాజ్యతంత్రమును నడుపుచుండిరి.

వీరు రాజ్యమేలుచుండఁగా హైదరాబాదునుండి యప్పుడు నైజాముగానున్న నవాబుమీర్ నిజామల్లీఖానుఁడు (౧౭౬౧-౧౮౦౩) సేనాసమేతుఁడై వచ్చి గోదావరి యొడ్డుననున్న కొవ్వూరులో దిగి యుండెను. అప్పు డాయనను సందర్శించుటకై బుట్టా బుచ్చన్నగారు మొదలగు మంత్రివర్గమును, మఱికొందఱుద్యోగియులును, పెంచుకొన్న విజయరామరాజు మహారాజుగారిని వెంటఁబెట్టుకొని చంద్రయ్యమ్మగారు కొవ్వూరునకేతెంచిరి. వీరితోఁబాటుగా పెద్దాపురమునుండి మనతిమ్మరాజు మహారాజులుంగారును, పిఠాపురమునుండి రావు పెదమహీపతిరాయనింగారునువచ్చిరి. నవాబునిజామల్లీఖానునకును విజయనగరపువారికిని బాకీపడియున్న పేష్కషునుగుఱించికొంత చర్చజరిగిన పిమ్మట విజయనగరపుకోటను విజయరామరాజుగారికి ఖాయపఱచిరి. ఆప్రకారముగనే పిఠాపురపుకోటను పెదమహీపతిరాయనింగారికిని, పెద్దాపురపు జమీందారీని తిమ్మభూపాలునకును స్థిరపఱచి వీరికి నౌబత్తులుమున్నగు ప్రాభవ చిహ్నవిశేషములనొసంగి వీరివలనఁ గానుకలు మొదలగు వస్తువులను గ్రహించి వెడలిపోయిరి.

అటుపిమ్మట బుట్టాబుచ్చన్నగారు మొదలగు నమాత్యపుంగవులతోను చింతలపాటి నీలాద్రిరాజుగారు, సింహాద్రిరాజుగారు మొదలగు బంధుజనముతోడను తక్కుఁగల సేనానులతోను చంద్రయ్యమ్మగారు స్వదేశమునకు బైలుదేఱి వెళ్లుచు మార్గముననున్న పెద్దాపురమున తిమ్మజగపతిరాజుగారినిఁ జూడ దిగిరి. మన తిమ్మజగపతిరాజుగారును, తమయెడ నవ్యాజప్రేమఁ గనఁ బఱచినందుకు వారియెడల మిగులఁగృతజ్ఞులై గౌరవపూ

ర్వకమైన విశ్వాసముతో వారికి విందులుజరిపి యాటపాటలచేతను, నృత్యగానాది వినోదములచేతను సన్మానించిరి. వారును గొంతకాలమచ్చటనుండి వీరు చేసిన సత్కారములనందికొని, యెంతయునలరి, మనమహారాజును శ్లాఘించి సుస్థిరరాజ్యవిభవులై వర్ధిల్లవలసినదని యాశీర్వదించి యటనుండితరలి యనతికాలముననే నిజరాజధానిం జేరికొనిరి.

శ్రీరామవిలాస మహాప్రబంధ నిర్మాణచాతురీధురీణుండును, మృదుసుధామధుర గద్యపద్యరచనాప్రవీణుండును నగు నేనుఁగులక్ష్మణ కవిపుంగవుం డీయనకాలముననే విలసిల్లినవాఁడు. ఈ కవీంద్రుఁడు తిమ్మనృపాలునకాశ్రితుఁడై, యాస్థానికవీశ్వరుఁడై యుండెను. ఈయన రామవిలాసమునురచియించి మొదట నీ మహారాజున కంకితమీయఁబోవఁగాఁ సుగుణశీలురగు నమ్మహారాజుగారు తాము చిన్నవారమనియుఁ దమవంశము వారిలోఁ బెద్దలును, కాండ్రేగులనివాసస్థులు నగు వత్సవాయ గోపరాజుగారి కంకితమీయవలసినదనియుఁ జెప్పి తమసౌశీల్యమును, బంధుజనాభిమానమును, దురభిమానరాహిత్యమును, వెల్లడించిరి. ఆహా ! ప్రభువులనిన వారేగదా ! ఆకారణముననే బుధజనరంజకమైన శ్రీరామవిలాస ప్రబంధము తిమ్మజగపతిరాజు మహారాజులుంగారి కాశ్రితులగు లక్ష్మణకవిగారిచే రచియింపఁబడియు, కాండ్రేగులలోనున్న రాజబంధువు లగుశ్రీవత్సవాయ గోపరాజుగారి కంకితముచేయఁబడెను.

మనతిమ్మజగపతిమహారాజుగారును, విజయనగరసంస్థానాధీశ్వరులగు విజయరామ గజపతిమహారాజుగారును సమకాలికులని యెఱుఁగ నగును. వీరిరువురును బ్రాణమిత్రులు. అట్లగుట నొండొరులచ్చటినుండి, యిచ్చటకును నిచ్చటనుండి యచ్చటకును బోవుచుండెడివారు. ఏనుఁగు లక్ష్మణకవిగారికి మన తిమ్మజగపతిమహారాజుగా రాశ్రయులైనట్లే అడిదము సూరకవిగారికి విజయరామగజపతిమహారాజుగారును నాశ్రయులైరి. పెద్దాపురమున తిమ్మజగపతిమహారాజుగారు రాజ్య మేలుచుండఁగా నొకప్పుడడిదము సూరకవి తన ప్రభువువెంట పెద్దాపురసంస్థానమునకువచ్చి రాజులందఱును సభ చేసి కూరుచుండి యుండఁగా—

ఉ. రాజు కళంకమూర్తి రతిరాజు శరీర విహీనుఁ డంబికా
రాజు దిగంబరుండు మృగరాజు గుహాంతర సీమవర్తి వి
భ్రాజిత పూసపాడ్విజయరామ నృపాలుఁడె రాజుగాక యీ
రాజులు రాజులే పెను తరాజులుగాక ధరాతలంబునన్.

అను పద్యమును సభలో నాసీనులయియున్న రాజులపంక్తిఁ జూచుచు లేచి చదివెననియు, అందుమీఁద నింపలి కడపటి వాక్యము తమ్ముద్దేశించి పలికినట్లు భావించి సహజశూరశిఖామణు లగునాసభయందలి సామంత క్షత్రియ పుంగవు

రదఱును కవినిఁ గోపదృష్టితోఁ జూచుచు లేచఁబోవఁగా నతఁడు జంకక ద్వ్యర్థమును జెప్పి "యీరాజు లనఁగాఁ" బై చరణములయందుఁ జెప్పఁబడిన రాజు లద్దలైన వారగని స్పష్టపఱచి రోష ముడిపి, వారిని శాంతచిత్తులను జేసె ననియుఁ జెప్పు చున్నారు. ఇందలి సత్యాసత్యములు కాలపురుషునకే తెలియవలెను. కవులను గురించిన యిట్టి గాథ లాంధ్ర ప్రపంచకమున ననేకము గలవు. వీరికిని శ్రీవిజయరామరాజుగారి కి బ్రాణస్నేహమని యీవఱకే నుడివి యుంటిని కదా! వీరిరువురును విద్వాంసులై యుంటఁ దమ కున్న స్నేహబంధమున నొకరిపై నొకరు సంస్కృత శ్లోకములఁ జెప్పు చును చుండెడివారు. వారి గీర్వాణ వైదుష్యము నెఱుంగ నుదాహరణార్థము వారొం డొరులపై రచియించుకొన్న శ్లోకములలోఁ జెరియొక దాని నిటఁ బొందు పఱచు చున్నాఁడను.

శ్రీ విజయరామగజపతిరాజుగారిమీఁద శ్రీ తిమ్మజగపతిరాజుగారు చెప్పినది.

శ్లో॥ నాళీకభంగకృ దతీవ నదీనబంధు
రన్తఃతమిస్రహననసుధావిభవైకహేతుః।
రాజా కి మిందు రపి నార్యభిమానహారీ
రాజా పరం విజయరాఘువ సార్వభౌమః॥

శ్రీ తిమ్మజగపతిరాజుగారిమీఁద శ్రీ విజయరామరాజుగారు చెప్పినది.

శ్లో॥ అభోజం కలయన్ సదృక్షు మనసే సాహిత్యరీత్యాన్ద్రశో
రమ్యంధాతారమపారసంపది మహాభావే యశోరాశిషు
శత్రూణాం పురభంజనేతిచ గుణే కించోరగేంద్రం మతి
ప్రాగల్భ్యే ప్రతిభాతి తిమ్మనృపతిః పాకాహితప్రాభవః॥

ఆనందగజపతిరాజుగారి మరణానంతరమున రావుకుమార పెదమహీపతి రాయనింగారు పిఠాపురమును రాజధానిగఁ జేసికొని తమ సంస్థానమును బాలించి యున్నారు. ఈయన పరిపాలించుచుండఁగా రాఘవపురమునకుఁబోయిన నీలాద్రి రాయనింగారు పిఠాపురము తిరిగి వచ్చి మహీపతిరాయనింగారి మంత్రింగమువఁ జేయిచేసికొనవలెనని ప్రయత్నించిరి కాని యాయన చేసిన ప్రయత్నములు ఫలోన్ముఖ ములుకాక వ్యర్థములయ్యెను. అటు తరువాత పెదమహీపతిరాయనింగారు ఆయనను పిఠాపురమునుండి వెడలఁగొట్టిరి. పిదపఁ గొంతకాలమున కనఁగా ౧౭౬౫వ సంవత్సరమున కుమారవేంకటపతిరాయనింగారు విధివశులైన యనంతరమున నీలాద్రిరాయనింగారు తిరిగి వచ్చి సింహాసనము నాక్రమించుకొని ౧౭౭౦ వఱకు రాజ్య మేలిరి. ఈయన వెనుక

నీయన జ్యేష్ఠకుమారులగు పెదవేంకటమహీపతి రాయనింగారు రాజ్యమునకు వచ్చిరి. కాని యీయన కనిష్ఠ సోదరులగు ముద్దువేంకటమహీపతి రాయనింగారు తమయన్నగారిని సింహాసనభ్రష్టులంగావించి రాజ్యమును దన యధీనమును జేసికొనవలెనని మహాప్రయత్నములు చేసెను. కాని యవి నిష్ఫలము లయ్యెను. స్థితిగతు లిట్లుండఁగా రెండేండ్లు మాత్రమే పరిపాలనచేసి మశూచికపడి పెదవేంకటమహీపతి రాయనింగారు కాలధర్మ మొందిరి. ఆయన వెనుక సింహాసనారోహణమునకై యీయన కొమారులైన కుమార వేంకటమహీపతిరాయనింగారికిని, ఈయన పినతండ్రులైన బుచ్చివేంకటమహీపతి రాయనింగారికిని, ముద్దువేంకటమహీపతి రాయనింగారికిని కలహములు జనియించెను.

ఈ సందర్భమున నొక్కవిషయము చెప్పవలసియున్నది. చనిపోయిన యిరువురు మువ్వురు పిఠాపుర ప్రభువు లాంగ్లేయదొరతనము (కంపెనీ) వారికి చెల్లించవలసిన పేష్కషు బాకీపడియుండఁగా, వారి యందుండు మైత్ర్యభిమానములచే మన తిమ్మజగపతి మహారాజుగారు జామీనుదారులై వారు చెల్లించవలసిన పైకము నంతయుఁ దామే చెల్లించిరి. కాని జామీనుదారులైన వీ రాంగ్లేయుల కొసంగినసొమ్ము ఎంతకాలమునకును దిరిగి రా దయ్యెను. కాఁబట్టి పెదవేంకటమహీపతిరాయనింగారి యనంతరమున నీకలహ సమయమున సంస్థాన మెటుపోయి యెటువచ్చునోయని తిమ్మజగపతిరాజుగారు తమ సొమ్మును రాఁబట్టుకొనుటకై పిఠాపురము పరగణాను దమ వశము చేసికొని దానిని బరిపాలించుటకై రాజబంధువులైన వత్సవాయ తిరుపతిరాజుగారినిఁ దమకు ప్రతినిధులుగ నియమించిరి. ఈవిధమున ౧౭౭౨ వ సంవత్సరము మొదలు ౧౭౭౫ వఱకు పిఠాపురముపరగణా వత్సవాయవారి మారిఫత్తున జరుగుచుండెను.

అప్పుడు బుచ్చి వేంకటమహీపతిరాయనింగారు తమభ్రాతృవ్య పుత్రుఁడైన కుమార వేంకటమహీపతిరాయనింగారిని సోదరులగు ముద్దువేంకటమహీపతిరాయనింగారిని దేశబహిష్కృతులం గావించి వత్సవాయవారి కియ్యవలసిన పైకమును జెల్లించి, సంస్థానమును బునస్స్వాధీనము చేసికొని ౧౭౭౫ వ సంవత్సరము మొదలుకొని ౧౭౮౬ వఱకు దొరతనము చేసిరి.

ఈ తిమ్మరాజుగారు పరిపాలించుచుండు కాలముననే యనఁగా ౧౭౬౬ వ సంవత్సరమున గుంటూరుతక్క యుత్తరసర్కారులన్నియు నాంగ్లేయుల కియ్యఁబడినవి. గుంటూరు మాత్రము ౧౭౮౮ వ సంవత్సరమున నొసంగఁబడెను. ఇట్లింతవఱకు హైదరాబాదు నైజాము స్వాధీనమునుండిన యుత్తరసర్కారులు ఆంగ్లేయుల (కంపెనీవారి) వశ మయ్యెను. తత్క్షణమే ఆంగ్లేయులును దమకు వశమైన దేశమును పరగణాలుగ విభజించి తమ పద్ధతుల ప్రకారము నూత్నపరిపాలనమును బ్రారంభించిరి.

* ఆంగ్లేయ పరిపాలనా ప్రారంభదశలో నీగోదావరిజిల్లా యావటిలో నైజామునకు ప్రతినిధిగ నీదేశము నేలుచున్న హుస్సేన్ ఆలీఖానునకు కౌలున కీయఁబడెను. తని కౌలు షరతు ౧౭౬౯వ సంవత్సరముతో సరిపోయెను. అంతట నాంగ్లేయ దొరతనమువారు తమ యాధీనమునకువచ్చిన పరగణాలను కొంతమంది సభ్యులుగల యొక యాలోచన సభక్రిందను నొక ముఖ్యాధికారి క్రిందనుంచి పరిపాలించుచు వచ్చిరి. రాజమహేంద్రవరము, కొండపల్లి, ఏలూరు జిల్లాలు మచిలీపట్టణముననున్న ముఖ్యాధికారిచేతను నతని యాలోచన సభచేతను పాలింపఁబడుచు వచ్చెను. శ్రీకాకుళమును ప్రాంతమును విశాఖపట్టణము నందలి ముఖ్యాధికారి వశము చేయఁబడెను.

ఛీఫ్ లని పిలువఁబడు నీముఖ్యాధికారులు పరిపాలించుచుండు కాలమున జమీందారులయొక్కయు రైతులయొక్కయు స్థితిగతు లెట్లున్నదియు నింతవఱకు నాకు దొరకిన యాధారముల ననుసరించి యిచ్చటఁ గొంతవ్రాయుచున్నాఁడను.

♦ ఆకాలమున నుత్తరసర్కారులందలి జమీందారులందఱు పేరునకు మాత్రము నైజామునకు సామంతులుగ నుండుచువచ్చినను నిజమునకు స్వతంత్రప్రభువులుగనె యుండిరి. వారు నైజామున కీయవలసిన కప్పమునీయక యాతనిని చిక్కులు పెట్టుచుండెడివారు. వీరివద్దనుండి కప్పము పూర్తిగ గాకపోయిన గొంతవఱకయిన వసూలు చేయుటకు హైదరాబాదునవాబులు బిరుదముల నిచ్చుచుండెడివారు. బాకీపడి, చెల్లించవలసియున్న కప్పములో నెవ్వరెంత యధికముగా నొసంగిన వారి కంతగొప్ప బిరుదములు నైజా మిచ్చుచుండెడి వాఁడట. ఈరీతిని నవాబులు తమకు రావలసియున్న కప్పమును వసూలుచేసుకొనెడివారని తెలియుచున్నది. ఆవిధముగనే గాని తమ కప్పము రాఁబట్టుకొనుట కింకొకమార్గము వీరికిఁ గాన్పింపలేదు కొం[illegible]లును సైన్యములు పంపి జమీందారులను బెదరింపఁజూచినను వారిదండునుమించి జమీందారుల సైన్యము లుండెడివని చెప్పఁబడుచున్నది. అందువలన వారిని వశపరచుకొను నుపాయము వేఱొకటి లేకుండ నుండెను.

ఉత్తరసర్కారులు ౧౭౬౬ వ సంవత్సరమున గౌరవనీయమైన తూర్పుఇండియా వర్తకసంఘమువారి స్వాధీనమునకు వచ్చునప్పటికి జమీందారు లెల్లరు హైదరాబాదు నైజాము లక్ష్యములేక చెల్లింపవలసిన కప్పములను చెల్లించక సైన్యముల నభివృద్ధి చేసికొని, కోటలను గట్టుదిట్టము చేసికొని సర్వతంత్ర స్వతంత్రప్రభువులై యుండిరి.

* Political Survey of Northern Circars by James Grant.
♦ John Hodgson's report to lord William Bentic in 1805 A.D.

* అప్పుడీ జమీందారుల సైన్యము మూడుతరగతులుగ నుండెను. మొదటి తరగతి వారు సామాన్య నౌఖరులు; వారు చేసిన సేవకు ధనరూపమున జీతము లియ్యఁబడు చుండెను. ప్రతిక్షణమును జమీందారుని గనిపెట్టుకొని యుండి వారియాజ్ఞను శిరసావహించుట వీరిధర్మము. రెండవతరగతివారు మొఖాసానౌఖరులు; వీరికిఁ గొంతభూమి క్విట్ రెంటుమాత్రమే కట్టఁబడి యియ్యఁబడుచుండెడిది. వీరిధర్మము, జీతములేకుండ రాజాజ్ఞకు లోఁబడి నౌఖరీ చేయుటయై యున్నది. మూడవతరగతివారు. సామంత ప్రభువులని చెప్పవచ్చును. ఏదియేని యుద్ధము సంభవించినప్పుడు గాని వేరొక్క సమయమునందుఁగాని తమవద్దనున్న పరివారముతో రాజాజ్ఞకు బద్ధులై సహాయముకట్టుకొని పోరుటగాని సంస్థానమును గాపాడుటగాని వీరిధర్మమై యున్నది. మన పెద్దాపుర సంస్థానమునకు సంబంధించినంతవఱకు కాత్రేనికోన మున్నగు కైస్త్రీయసామంత రాజ్యములును తోటపల్లి మున్నగు జమీందారీలును నీతరగతికిఁ జెందియున్నవి.

ఇట్లు సైన్యములను భద్రపరచుకొని కట్టుదిట్టముగ నున్న జమీందారులు నైజామునకుఁ లోఁబడి యుండకపోవుట యాశ్చర్యము కాదు. స్వతంత్రప్రభువులు వలె నున్న యీజమీందారులను లోఁబరచుకొనుట మొట్టమొదట ఫ్రెంచివారికి వలెనే యాంగ్లేయులకుఁ గూడ ప్రయాస సాధ్యమయ్యెను. ఆదినుండి నీ యుత్తర సర్కారులను వశము చేసికొని పాలించుచున్న ఫ్రెంచివారు, జమీందారులను గోఱలుదీసిన పాములవలెఁ జేయుటకుఁ గాఁబోలు జమీందారీసైన్యమును తగ్గించి వేయుచు వచ్చిరి. ఆపనకమునే మన యాంగ్లేయులు కూడ పన్నుట యుచితమని హాడ్జసన్ దొరగారు తమ రిపోర్టునందు సలహా నిచ్చిరి.

అప్పటి జమీందారు లిట్లు నైజామునకు మస్వాధీనులై యొకరి నొకరు మించవలెనని పాటుపడినట్లుఁ దెలియవచ్చుచున్నది. వారు అధికవ్యయ నవలఁ బుచ్చుట యందును, వైభవాతిశయమునందును నెక్కువ నౌకర్లను చాకర్లను నుపయోగించుట యందును, బ్రాహ్మణులకును దమ్ము నాశ్రయించికొని యున్న యాశ్రితులకును, విరివిగా దానము లిచ్చుటయందును నొకరి కొకరు మించవలెనని యహమహమికచే ధనమును వ్యయపరచుచు వచ్చిరఁట "యథా రాజా తథా ప్రజా" యను నట్లు వారికిఁ దగినట్లుగనే తేరగ వచ్చుచున్న దని చెప్ప మన బ్రాహ్మణోత్తములు 'ఆజమీందారుగా రింత గొప్పదానము చేసె" రని యీజమీందారుగారిని పొగడ్ ంచుచు "ఈయన యింతటి గొప్పవాఁ" డని వారివద్ద నాగినాడు నాయా సంస్థానాధిపతుల నుండి యపారధనమును నగ్రహారములను గూడఁ బడయుచు వచ్చి

* Political survey of Northern circars by Grant.

ట ఇట్లుత్రయ గర్వములతో స్వతంత్రప్రభువులై మదగజేంద్రములవలె నున్న భూపరిపాలకులను వశపరచుకొనుట కాంగ్లేయులకుఁ గొంతకాలము పట్టెను.

అనేకోపాయప్రయత్నములు చేసినమీఁదట కొంతకాల మగుసరికి జమీందారు లాంగ్లేయుల కడఁగిమడఁగి వినయవిధేయతలు చూపుస్థితికి వచ్చినను "జామ్మా" యని పిలువఁబడు కప్పమును మాత్రము కంపెనీవారికి సకాలమునఁ జెల్లింపలేక పోవుచు వచ్చిరఁట

అప్పటి జమీందారులు విద్యయు వివేకమును గలిగియున్నను దమ్ము నాశ్రయించి యున్నచాలమంది దుష్టులప్రోత్సాహమున భోగములకును నింద్రియ సుఖములకును స్థితికి తగనంత వ్యయ మెక్కుడుగఁ జేయుచు క్రమక్రమముగ నాంగ్లేయులకుఁ జెల్లింపవలసిన పైకమును బాకీపడుచు వచ్చిరని చెప్పఁబడుచున్నను యథార్థమునకు మన జమీందారులకు రాఁబడికంటె ఖర్చు విశేషమగుట తప్పని సరియైన దని తోఁచుచున్నది.

విద్యకూడ సరియైన మార్గమునఁ జెప్పఁబడుట లేదఁట. అప్పటి విద్యావిధానము నవీనముగ వచ్చిన యాంగ్లేయులకు రుచింపకపోవుట యొక వింతలోనిది కాదు. మన తిమ్మజగపతిరాజుగారి విద్యాభ్యాసమును గురించి విచిత్రమైనగాథ యొకటి చెప్పఁబడుచున్నను నది విశ్వసనీయము కాదని యిట నుదహరింపలేను. అంత గొప్ప నేరము చేసిన నుపాధ్యాయుఁడు చూచియుఁ జూడ నట్లూరకుండవలసినదే కాని తన శిష్యుని మందలించుటకుఁ దగిన స్వాతంత్ర్యము లేకుండెడి దఁట!

ఆకాలమున బ్రాహ్మణులకే గాక, పనిపాటలు చేయక సోమరిపోతులుగ నున్న వారికిని సహితము మేరాజెంత గొప్పదానము చేయునో దానిని బట్టి యారాజులంత యాధిక్యత నందుచుండెడివా రని చెప్పఁబడుచున్నను "భిక్షాం దేహి" యను వానికి నుచితరీతిని సత్కరించకపోవుట వారికి గొప్పలోటుగాఁ గాన్పించుచుండెడి దని తోఁచుచున్నది.

పదునెనిమిదవ శతాబ్దమునందలి జమీందారులు తమకు వచ్చు సరియైన రాఁబడిని గమనింపక విశేష వ్యయము చేయుచు కంపెనీవారికియ్యవలసిన జామ్మా బాకీపడుచు వచ్చినటులఁ గాన్పించుచున్నది.

జమీందారుల స్థితిగతులు తెల్పునపుడు నప్పటి భూములను గురించియు, వానికి విధింపఁబడిన పన్నును గురించియు, జమీందారులు రయితులనుండి పన్నుఁ గైకొనిన రీతులను గురించియు, నొక్కింత విచారింతము.

భూమికి విధింపఁబడిన పన్ను, దాని ఫలసాయముయొక్క విలువ, వీనిని గురించిన సంగతియంతయు నొక లెక్కలపుస్తకమున వ్రాయఁబడి యుండెడిది. ఆలెక్కలపుస్తక మిప్పటి కరణముల లెక్కలపుస్తకములను బోలియుండెడి దని చెప్పవచ్చును. దానికి కామిల్ అని పేరు. ఈకామిల్‌లో నొకొక్క సంస్థానమం దెన్నిగ్రామము లుండునదియు, భూమిపరిమిత మెంతయుండునదియు, దాని ఫలసాయ మెంతయుండునదియు, నమోదుచేయఁబడి యుండెడిది. ఈకామిల్ పుస్తకముల ననుసరించియే దక్కనుసుబాదారుఁ డాయాసంస్థానముల పైనను, నాయాజిల్లాల పైనను కప్పము విధించుచుండెడి వాఁడు. హిందూదేశమున నైజాం ప్రభుత్వమునకు లోఁబడియున్న యన్నిప్రదేశములయందును నీ లెక్కలపుస్తకములు గానవచ్చుచుండెడివి కాని యీపుస్తకము లంతసరియైనవిగా నుండెడివి కావఁట. బాలకామిల్ పుస్తకములలో భూములు అసలుపండుపంటకన్న నెక్కువమొత్తము వ్రాయఁబడియుండుటకు కారణ మాయాజమీందారుల నప్పరాబడిని సూచించుటకై యుండెడి దని తోఁచుచున్నది. అదియయినను విశేషము లేదా యున్నట్టుల గాన్పింపదు. భూమిశిస్తు లెక్కలను వ్రాయుటకు ప్రతిగ్రామమునను మిరాసీదారులను పేర కరణముల నేర్పఱచుచుండెడి వారఁట ఈ మిరాసీదారి యుద్యోగము వంశపారంపర్యముగ నిచ్చుచుండెడిది.

రివిన్యూ వసూలుచేయుటకు ముజుందారులనఁబడు మరియొక తరగతి యుద్యోగియు లుండెడివారు. వీరు నైజాముచే నేర్పరుపఁబడినను సంస్థానాధీశుల కడఁగి మడఁగి యుండి వారి యాజ్ఞప్రకారము వర్తించుచుండుట విధియై యుండెడిది. వారి వినయవిధేయతల ననుసరించి జమీందారులే వారికిఁ గొన్ని గ్రామములు నిచ్చియు మాన్యముల నిచ్చియు వారి నాదరించుచుండెడివారు. అందులకు ప్రతిఫలముగ కాఁబోలును రాజునకు ధనముయొక్క యావశ్యకత కలిగినప్పుడు రయితుల వద్దనుండి, కరణముసాహాయ్యముతో, తప్పక సొమ్ము వసూలుచేసి దివాణమున కంపుచుండెడి వారు.

తమయొక్క వ్యయమునకు లేకపోయినను, కంపెనీవారు జుమ్మా నొసంగవలసిన దని గాని బాకీపడిన కప్పము నీయవలసినదని గాని నిర్బంధపఱచినను, శుభకార్యములు తటస్థించినపుడును రయితులవద్దనుండి మన జమీందారులు రాఁబోవు రెండుమూడు సంవత్సరముల సిస్తును సహితము ముందుగ వసూలుచేయుచుండెడి వారఁట !

రాజ్యభారమునంతయు తమ దివానుపై నైచి తాము హాయిగా భోగపరాయణులై యుండుట వారి కలవాటు. దివానులే మోసముచేసినను అమాయకు లగు

నపరిభువులకుఁ దెలియుచుండెడిది కాను సరిగదా దాదాపుగా దివానులు స్వతం త్రులై యుండెడివారని చెప్పవచ్చును. తమ చిత్తమువచ్చిన రీతిని సంచరించుచు రాము కోరినధనము దివాను సర్దుబాటుచేసిన నంతియే చాలు నని వీరు తలంచు చుండెడి వారఁట. ఆదివానులును నెన్నివిధముల రాజుదయ సంపాదింపవలెనో న్నివిధముల సంపాదించుకొనుచు, కొన్నియెడల రాజును మోసముచేయుచుండెడి వారని చెప్పఁబడుచున్నది. సిబ్బందికి, నవుచరులకు నీయవలసిన జీతము లధికముగఁ బాకీపడుచుండుటచేతి సైనికు లప్పుడప్పుడు తిరుగఁబడుచుండెడివారు గాని తిరుగ బ్రోవలోనే వారికుచితరీతిని సత్కారము జరుగుచుండెడిది.

ఆకాలమున రైతులకు కొన్ని భూము లేకముగ గుత్తక్రింద నొక్కచోటనే యబడుచు వచ్చెను. రాజబంధువులగు క్షత్రియులకును, యితరరాజపుత్రులకును ట్టిమాన్యము లిచ్చుటచేతను వారివద్దనుండి పన్ను వసూలు చేయుట ప్రాణోపద్రవ కరముగ నుండెడి దనుటలో వింతలేదు. రాజబంధువులకు ఆదాయముకంటె వ్యయ మధికము చేయక తప్పనిసరియయ్యెడిది. పైవిధమునఁ బరిపాలన జరుగుచుండినకాల మున నుత్తరసర్కారులు కంపెనీవారి యాధీనమాయెను. వీరుత్తరసర్కారులను స్వా ధీనము చేసికొనకపూర్వము పెద్దాపురసంస్థానమునందలి కామిల్ ననుసరించిచూడ ౫౪౪ గ్రామములు పెద్దాపుర సంస్థానమునందు గలవని తెలియుచున్నది. సర్కారు లాంగ్లేయుల వశమైనపిదప దొరకినలెక్కల పుస్తకముల యాధారమున ౪౧౪ గ్రామములున్నటులయును, తరువాత నేర్పడిన సంచారసంఘమువారి రిపోర్టువలన ౪౦౪ మాత్రమే యున్నటులయును, యీతిమ్మజగపతిమహారాజుంగారి కుమారు లగు రాయజగపతిరాజు మహారాజులుంగారి కాలమున ౪౦౯ గ్రామములున్నటుల యును తెలియవచ్చుచున్నది. ఇట్టివ్యత్యాసమునకు కారణము, సింహాసనమునకు వచ్చి న ప్రతిరాజునుఁ దనపేరునగానితనదారాపుత్రాదులపేరగాని కొన్ని నవీన గ్రామము లేర్పఱచుటయు, రెండు మూడు గ్రామము లొకటిగాఁ జేయుటయు మున్నగు మార్పులని తోఁచుచున్నది.

పెద్దాపురసంస్థానములోని గ్రామములన్నియు పదునైదు పరగణాలుగ విభ జింపఁబడి యుండెడివని కాగితాధారమువలన తెలియవచ్చుచున్నను పదునెని మిదవ శతాబ్దమునకు పూర్వము పదునెనిమిది పరగణాలుగ నున్నటులయును పరగణా కొక బురుజుచొప్పున పదునెనిమిది బురుజులుగ నేర్పఱచి కోట విస్తీర్ణము చేయఁబడి కట్టఁబడినటులయును ప్రబలమైనవాడుక పరంపరగా వచ్చుచున్నది.

ఒక్కొక్క పరగణా యొక్కొక్క తాలూకా నంటెది. అన్ని పరగణాలును సమానవైశాల్యమును కలిగియుండెడివి కావు. ఒక పరగణాయం దెక్కుడుగ్రామము లును వేరొకపరగణాయందు తక్కువగ్రామములును నుండెడివి. మనపెద్దాపురసంస్థానమునందు మిక్కిలి పెద్దపరగణాయం దరువది గ్రామములనఅనుండి, ౩౨,౪౯౫ వరహాలనఅను ననఁగా ౧,౨౯,౮౭౨ రూపాయీలనఅను శిస్తు దివాణమునకు వసూలగుచుండెడిది. మిక్కిలి చిన్న పరగణాయం దెనిమిది గ్రామములనఅను నుండి ౭,౫౭౨ వరహాలు లేక ౩౪,౧౭౭ రూపాయలు శిస్తువచ్చుచుండెడిది.

ఉత్తరసర్కారులు కంపెనీవారి యధీనములోనికి రాకపూర్వము పెద్దాపురాధీశులు హైదరాబాదు నైజామునకుఁ బ్రతిసంవత్సరమును ౧౧౪,౨౭౩ వరహాలులేక ౪౫౬,౧౩౨ రూపాయలు పన్ను చెల్లించుచుండెడివారు. కంపెనీవారి యధీనమైన తరువాత ౧౧౭,౯౭ వరహాలులేక ౪౬౪,౬౨ రూపాయలు జుమ్మానిదిఅ కిచ్చు పన్ను కంటె నధికముగ చెల్లించవలసి వచ్చెడిది. మచిలీపట్టణమున వించిదొరగారు ముఖ్యాధికారిగా నున్న కాలమున ౫,౦౩,౭౬౬ రూపాయలును, వైట్‌హిల్‌దొరగారి కాలమున ౫,౧౧,౭౬౬ రూపాయలను జుమ్మా చెల్లించుచుండెడి దన్న నాకాలమున సంస్థాన మెంతయభివృద్ధిలోనున్నదో తెలియఁగలదు.

సంస్థాన మెంతయభివృద్ధిలో నున్నను, తరుచుగ పన్నులధికము చేయబడుచుండిన టుల గాన్పించుట చేతను, సంస్థానమువారికి వచ్చునాదాయము న్యాయమునకు కొంచె మెచ్చుతగ్గుగా సమముగ నుండుటచేతను, జుమ్మాబాకీ పడుట సంస్థానము వారికి మామూలాయె ననిన నందు వింతలేదు. ఆకారణముచేతనే సంస్థానమునందలి చిన్నయస్టేట్లు తరుచుగ వేలమువేయఁబడుట తటస్థించుచువచ్చి క్రమముగ సంస్థానము క్షీణదశకు వచ్చుట తటస్థించినదని మనకు పై యంకెలే వేనోళ్ల చాటుచున్నవి. ఇట్టి స్థితిలో జుమ్మావసూలు చేయుట కంపెనీవారికి కష్టతరముగ నుండెనన్న నందు వింత యేమిగలదు?

పైకారణములవలననే పరిపాలనయందున్న లోపములనుఁ దొలఁగించుటకును రైతులకు క్షేమకరములైన యేర్పాటులుచేయుటకును, జమీందారులనుండి తగిన కప్పములను రాఁబట్టుకొనుటకు, వారినిజమైన స్థితిగతులు విచారించుటకును చెన్నపురి నున్న సెంటుజార్జికోటలోని యాలోచనసభయందలి నలుగురు సభ్యులు సంచార సంఘము (Committe of c c iit) గా నేర్పడవలసినదని ౧౭౭౬ సంవత్సరమున కోర్టు ఆఫ్ డైరక్టర్లు ఉత్తరువిచ్చిరి దేశముయొక్క సరియైన ఫలసాయమును నిశ్చయపఱచి యుత్తరసర్కార్లయొక్క స్థితి, జనసంఖ్య, వచ్చుఁబడి మొత్తము,

జమీందారులకుండు సిబ్బంది, వారికిచ్చు, రాబడి మొదలగునవి విచారించి రిపోర్టు వ్రాయుట సంచారసంఘమువారికి నిర్ణీతవిధియై యుండెను.

డైరక్టర్ల యాజ్ఞాప్రకారము సంచారసంఘమువారు తమపనిని బ్రారంభించిరి. కాని కొద్దికాలములోనే వారుచేయుపని యప్పుడు చెన్నపురి గవర్నరుగానున్న సర్ థామస్ రంబోల్డుదొరగారిచేత నాటంకపఱుపఁబడెను. ఆయనయే ౧౭౭౮ లో జమీందారులను చెన్నపట్టణమునకుఁ బిలిపించి వారితో స్వయముగఁ దానే సెటిల్ మెంటు (గవర్నమెంటువారికి చెల్లింపవలసిన స్థిరమైనసొమ్ము, యేర్పాటు) చేయ నిశ్చయించుకొనెను. ఆప్రకారమే యిదివఱలో జమీందారులు చెల్లించు మొత్తము (మామూలు జమాబందీ) కంటె పైగా నూటికి $12\frac{1}{2}$ చొప్పున నెక్కువ పన్ను కట్టవలసినదను నేర్పాటు కావింపఁబడెను.

ఈ సెటిల్ మెంటు ననుసరించి ౧౭౭౮ సంవత్సరమున తిరిగి ౧౯ ౩౯౨ వరహాల జుమ్మా పెద్దాపురసంస్థానమున కధికముగఁ గట్టఁబడెనన ౧౭౭౮ సంవత్సరమునాటి పెద్దాపురాధీశులు కంపెనీవారికి చెల్లించుచున్న పేష్కషు ౫ ౯౦౪౪౪ రూపాయలని తెలియవచ్చుచున్నది. ఇఁక సంస్థానమభివృద్ధి కావలెనన్న నెంతయో వ్యయ మెక్కువగు తగ్గించవలెను. లేదా సంస్థానము దినదినక్షీణదశకు రావలెను. మన ప్రభువులధికముగ వ్యయము చేయగలరు గాని తగ్గింపగలిగినవారు కారు. ఆకారణముచేతనే ప్రతిసంవత్సరము జుమ్మా బాకీపడు చుండెడివారు.

౧౭౮౧ వ సంవత్సరమున సర్ థామస్ రంబోల్డుదొరగారు గవర్నరుపదవి నుండి విరమించినపిదప సంచారసంఘము తిరిగి నియమింపఁబడెను. ఈ సంచారసంఘవిచారణఫలిత మేమనఁగా రంబోల్డుదొరగారు జమీందారులకు నూటికి $12\frac{1}{2}$ చొప్పున నధికముగా విధించిన కప్పము స్థిరపఱుచఁబడెను. ౧౭౮౬ లో నాదొరగారు చేసిన సెటిల్ మెంటు తిరిగి మూఁడేండ్లవఱకు నమవర్తించునట్లు పెంపుఁజేయఁబడెను. తిరిగి ౧౭౮౯ వ సంవత్సరమున ఆలోచన సభాసభ్యులును ముఖ్యాధికారులును జమీందార్లకు వారికి వచ్చు మొత్తము రాఁబడిలో రెండువంతులు పన్నువిధించిన యుక్తముగా నుండునని తెలియఁబఱచిరి. అటుపై రివిన్యూబోర్డువారును (ఈరివిన్యూబోర్డు౧౭౮౬ వ సంవత్సరమున స్థాపింపఁబడినది) గవర్నమెంటువారును నందుల కంగీకరించి యీపైని వచించినప్రకారము సెటిల్ మెంటు చేసిరి.

ఇట్లుండఁగా ౧౭౯౧ వ సంవత్సరమున గొప్పకఱవు వచ్చెను. ఈకఱవు ౧౭౯౦ వ నవంబరు మొదలు ౧౭౯౨ వ నవంబరువఱకుఁ బ్రజలను వనకాహారముగ జేసికొని దేశవినాశముఁ జేయుచుఁ బ్రబలియుండెను. ఈగొప్ప కాటకమువల

ప్రజలుపొందిన కష్టము లిన్ని యని వర్ణింప నలవికాదు. ఈరెండు సంవత్సరములలో, దినుట కన్నములేక, యాకలిబాధ కోర్వఁజాలక, మలమలమాడి ప్రాణములు విడిచినవారైన నేమి, దేశమును వదలిపెట్టి పరదేశముల కన్నమునకై వెళ్లిన వారైననేమి, మొత్తము దేశమునందున్న ప్రజలలో నాలుగవవంతు జనము కలరని చెప్పబడుచున్నది. అప్పుడాంగిలేయదొరతనమువారు క్షామపీడితులను రక్షించి పోషించుటకై రు ౧ ౪౦ ౦౦౦ లు వ్యయపఱచిరి. పౌరవ్యయముమీఁద బీదకుటుంబములందలి పిల్లల కన్నదానము చేయఁబడెను.

ఈక్షామమునకుఁ దోడుగ ౧౭౮౭ సంవత్సరమున గొప్ప యుప్పెన వచ్చెను. ఇక చెప్పవలసిన దేమున్నది? ఈకఱువు కాటకముల వలనను, యుప్పెన వలనను రైతులనుండి రావలసిన పన్ను వసూలు కాకపోవుటయే గాక జమీందారులకు విశేష నష్టము సంభవించెను. ఇట్టి తరుణముననే మన తిమ్మజగపతిరాజు మహారాజులుంగారు తమ పుత్రులగు శ్రీ రాయజగపతిమహారాజులుంగారికి వివాహముచేయవలసివచ్చెను. జుమ్మా యభివృద్ధియయినను, చాలపన్ను బాకీపడి యున్నను, రైతులును దేశమును కఱవు వలనను యుప్పెన వలనను బాధపడుచున్నను, శిస్తు వసూలుచేయుటకు వీలు లేకపోయినను మనమహారాజు ౧౭౯౩వ సంవత్సరమున ౨, ౮౦,౦౦౦ రూపాయలు వ్యయముచేసి తమ కుమారులును, యువరాజుగారును నగు శ్రీ రాజా రాయజగపతి రాజు మహారాజులుంగారి కతివైభవమున వివాహముచేసి, యెన్నో భూదానములు చేసి సాటిరాజులలో మేటు లను కీర్తి సంపాదించిరి. పైని వివరింపఁబడిన రీతినే మన మహారాజువలెనే యుత్తర సర్కారులలోని యితర జమీందారులును దేశ కాల పాత్రములను గమనింపక విశేషవ్యయముచేయుచు కంపెనీవారి కీయవలసిన జుమ్మా బాకీ పడుచు వచ్చిరి.

ఈకఱువు యుప్పెనల కారణమున దొరతనమువారు జమీందారులకచ్చటచ్చట రిమీషను లిచ్చుచు వచ్చినను, వారు తమకు రావలసిన రాఁబడిని వసూలుచేయుట యందు మిక్కిలి ఖండితముగ నుండుచు వచ్చిరి.

ఇట్లుండఁగా ముఖ్యాధికారుల యొక్కయు నాలోచన సభవారియొక్కయు బరిపాలన మంత సంతృప్తికరమైనదిగా లేదని సంచార సంఘమువారు రిపోర్టు చేసి నందున, నుత్తర సర్కార్లయందలి ముఖ్యాధికారులును, ఆలోచన సభలును దీసి వేయఁబడి వారి స్థానమున ౧౭౯౪వ సంవత్సరమున దేశపరిపాలనకు కలెక్టరులు నియమింపఁబడిరి. ఒక్కొక్క కలెక్టరు యొక్క యధికారము నందున్న దేశమునకు కలెక్టరేట్ అని పేరు. అదియే యిప్పుడు జిల్లా యని పిలువఁబడుచున్నది. ఈకలె

ర్లు నేర్పరిచిన పిదప దేశమంతయుం గలెక్టరేట్ల క్రింద విభాగింపఁబడెను. రాజ
హేంద్రవరము, కాకినాడ, మొగల్తుఱ్ఱు నను నవి హెడ్ క్వార్టర్లు. (అధికారు
ండు స్థలములు) గ మొట్టమొదట మూఁడు కలెక్టరేట్లు ఏర్పఱుచఁ బడెను.
గాని కొద్దికాలములోనే ప్రకృతపు గోదావరి జిల్లాలోఁ జాలభాగము రాజమహేం
ద్రవరమునుండు కలెక్టరు యధికారము క్రింద నుంచఁబడి రాజమహేంద్రవరము
జిల్లాయని పేరు పెట్టఁబడెను.

౧౭౯౦—౯౨ సంవత్సరములలో దేశమునఁ గఱవు వచ్చె ననియు, జమీం
దార్లు చెల్లించవలసిన కప్పము బాకీపడి యుండిరనియుఁ బై నివ్రాసి యుంటినిగదా!
కఱవుపీడితు దేశస్థులగు జమీందార్లనుండి రావలసిన రాఁబడిని వసూలుచేసికొనుట
గవర్న మెంటు వారికి మిక్కిలి కష్టముగానుండెను. అందు వలన నీనూతనముగ నేర్ప
ఱుపఁబడిన యుద్యోగులు తమ నియమిత విధులను నెరవేర్చునప్పుడు ప్రజలును,
జమీందారులును గూడ వారి నెదిరించుచు వచ్చిరి. కాని పెద్దాపురము, పిఠాపురము,
మున్నగు జమీందారులు దొరతనమువారి కంతశ్రమ కలుగఁజేయకయె తామిది
వఱలో బాకీ పడి యున్న పైకమును జాల వఱకు జెల్లించి వైచిరి. ఈసంస్థానములలో
గవర్న మెంటువారిపైఁ దిరుగఁ బా టొల్వియును లేక మొత్తముమీఁద శాంతి నిలచి
యున్నదనియే చెప్పనగును. ఒక్క మొగల్తుఱ్ఱు సంస్థానమున మాత్ర మిట్టి తిరుగు
బాటును కలహమును రేఁగెను. ఇట్టి చిన్నకలహమే ౧౭౯౨ సంవత్సరమునగూడ
సంభవించెను. గాని యీచిన్నకలహములను కొద్దిపాటి సైన్యములతోనే మిక్కిలి
సులభముగ దొరతనమువా రణఁచి వేయుచు వచ్చిరి.

ఈనూతనముగా వచ్చిన యాంగిలేయ పరిపాలనావిధానము క్రమక్రమముగ
జక్కపడుచున్న కాలమున ననఁగా క్రీ. శ. ౧౭౯౪వ సంవత్సరమున విద్వద్బృంద
మునకును, కవీంద్రసంతానమునకును కల్పవృక్షమంబై యర్థిజనపారిజాతమై స్వయ
ముగా విద్వాంసుఁడై కీర్తి విఖ్యాతులనంది విరాజిల్లిన శ్రీతిమ్మజగపతిమహారా
గారు సర్వస్థులైరి.

* శ్రీ తిమ్మజగపతిమహారాజుగారికి వేఁటయన్న నత్యంతప్రీతి. వీరొక్క
మారు క్షుధార్తులై వేఁటనుండి తిరిగి వచ్చుచుండఁగా పరివారమంతయు వెనుక
బడుటయు వీరు ముందునకు సాగి వచ్చుటయు సంభవించెను. అంతట వీ రచ్చ

* వీరి కిరువురు భార్యలు కలరు, వీరిరువురిలో నొకరు నల్లపరాజు వంశము
నుదయించిన అచ్యుతయ్యమ్మగారు. రెండవవారు పూలపల్లి దంతులూరి నూ
రాజుగారి కొమార్తె బంగారయ్యమ్మగారు.

కనతి దూరమున నున్న యొక పల్లె కరిగి పెండ్యాల వారను నింటి పేరు గల యొక భూసురాంగనను దనకే యైన భుజించ నొసంగవలసిన దని యడిగెను. ఆమెయు దామ వండుకున్న యంబలితక్క తమయింటను మఱేదియు లేదనియుఁ, గావలసిన నదియే కొంచెము పోసెదననియుఁ జెప్పెను. రాజును నంబల కంగీకరించి దానిం గ్రహించెను. తరువాత ఆయన పెద్దాపురమును జేరి యాపుణ్యాంగనకు కబురు పంపించి యామెకొక గ్రామము నగ్రహారముగ నిచ్చెను. ఈయగ్రహారమునకు "అంబటిపూడి" యని యిప్పటికిని వాడుకగలదు. ఇప్పుడు కూడ పైఁజెప్పిన పెండ్యాలవారీయగ్రహారము ననుభవించుచున్నారు.

ఈతిమ్మరాజుగారు దానధర్మనిరతులై ప్రకృతమున నమలాపురము తాలూకా యని పిలువఁబడు కోనసీమలో పంచలకొలఁది భూదానములు చేసి దాదాపుగా తాలూకా నంతయు ధారవోసి నటుల తెలియవచ్చుచున్నది.

ఈమహారాజొకనాఁడు మంత్రిదండనాథాగ్రణులతోను, ఆస్థాన కవిపండితులతోను సామంత ప్రభువులతోను కొలువుదీర్చియుండ ద్వారపాలకుఁడు వచ్చి "మహాప్రభో! ఏలినవారి దర్శనమునకు మాగాపు శరభకవిగారను నొక బ్రాహ్మణుఁడువచ్చి తాను వచ్చితినని దేవరవారితోనే మనవి చేయమన్నారు. ఏమి శెలవు" అని విన్నవించెనఁట. అంతలవు రాజును ఆస్థానకవీశ్వరులలో నొకరిని పంపి, సగౌరవముగ ఆయనను తీసుకొనిరమ్మనిరఁట. ఈకవిగారు వెళ్లి ద్వారముదగ్గరనున్న శరభకవిగారి వేషమును జూచి ఆయనయగునా కాదాయని సందేహించి, చివరకు ఆయనేయని తెలుసుకొని, రాజాజ్ఞ యయినదని విన్నవింప ఆకవిసత్తముఁడు లోనికి వచ్చెనఁట. మహారాజదర్శనమునకు వచ్చిన యీకవిగారొక అంగవస్త్రము కట్టుకొని, చేతనొక చెంబు, భుజముమీద నొక గామంచా, చంకనొక తాటియాకు పుస్తకములకట్ట మాత్రము కలిగియుండి, బీదబ్రాహ్మణవేషముతో నుండిరఁట. మహారాజీయనను చూచి "ఇతఁడా శరభకవి? యనిరఁట. ఆమాట మహారాజునోటనుండి వచ్చియు రాకముపే "ఇతఁడా" యని తనకు గౌరవమును దెలుపుటకు బదులుగ నన్ను సంబోధించెనను స్వాభిమానమునను, మహారాజునకు సంపాదింపవచ్చినని గాని యను నాశచేతను ఈక్రిందపద్యము చదివెనఁట.

మ. ఇతఁడా రంగదభంగసంగర చమూహేలాచ్ఛటాపాటన
ద్ధతకీలాశలభాయమానరిపురాడ్ధారాళధారానవీ
న తరంగిణ్యబలాసమాగమసమానందత్ప్రయోధస్తుతా
యతశౌర్యోజ్జ్వలుఁడైన తత్సవియ తిమ్మక్షోణిపుఁ డీతఁడా

ఈపద్యము చదువుసరికి సభయంతయు నాశ్చర్యమునొంద, సరసుఁడగు నా హారాజు "మీకయి పుట్లనూఁటి మీచిత్తము వచ్చినచోట ఈనాముగ నిచ్చితి" ని సెలవిచ్చిరని యొక గాథ చెప్పఁబడుచున్నది. భోజరాజంత రాజుండ కాళిదాసంత ని యుండఁబోఁడను సామెత యిట్టి మహారాజులకాలముననే సార్థకమయ్యెడి దను యతిశయోక్తికాదు.

వీరిదానధర్మాదిగుణంబుల నుపలక్షించి మరియొక కవీశ్వరుఁడు వీరిమీఁద ప్పిన యొక చాటువు నిశ్చయముగ వీరికీర్తిని చాటుచుండుటచేత దాని నీక్రిందఁ బ్రకటించి దానితో వీరి పాలనమును ముగించుచున్నాఁడను.

శా. రాజా గా సిరులుండి యేరి కిడకం దామెక్క లేనట్టియా
ఘాజీలోభుని బట్టి లోపలికి నీపాదోదకం బిచ్చినన్
రాజీమిచ్చును కర్ణుఁడాజనుల మేల్దాతృత్వముం జూచి, శ్రీ
రాజా తిమ్మజగత్పతీ నరపతీ రక్షింప నీవేగతీ.

---

## —: శ్రీ రాజా రాయజగపతిరాజుమహారాజులుంగారు :—

(క్రీ. శ. ౧౭౯౭—౧౮౦౪)

శ్రీ రాజా తిమ్మజగపతి మహారాజులుంగారి యనంతరమున ఆయన కొమారు లైన శ్రీ రాజా రాయజగపతిరాజుమహారాజులుంగారు రాజ్యమునకు వచ్చిరి. వీరు సింహాసనమునకు వచ్చునప్పటికి పదునెనిమిది రెండేండ్ల ప్రాయమువారు.

వీరి కాలముననే ఇండియా గవర్నమెంటువారును కోర్టుఆఫ్ డైరక్టర్లును, ౧౭౯౩వ సంవత్సరమున బంగాళా రాజధానిలో నవలంబింపఁబడిన పర్మనెంటుసెటిల్ మెంటు పద్ధతి చట్టకూడ ప్రవేశపెట్టఁదలసినదని మదరాసు గవర్నమెంటువారిని తొందరపెట్టుచు వచ్చిరి. ఈపర్మనెంటు సెటిల్ మెంటువలన రైతులనుండి జమీందారులు రాఁబట్టుకొన వలసిన సొమ్ము మొత్తమును గుత్తించినయు, జమీందారులు గవర్నమెంటువారికి చెల్లించ వలసిన కప్పమును గుత్తించినట్లయు చిక్కులు విడిపోఁగలవని యూహింపఁబడుచు వచ్చెను. ఆప్రకారమే యీపర్మనెంటుసెటిల్ మెంటు రాజమహేంద్రవరము జిల్లాలో ౧౮౦౨—౧౮౦౩ సంవత్సరములలో స్థిరపరుపఁబడెను.

అప్పటికి దొరకిన లెఖ్ఖలనుబట్టి కడచిన యెనిమిది మొదలు పదుమూఁడు సంవత్సరములలో భూమిమీఁద వచ్చిన మొత్తపు రాఁబడిలో సగటున రెండు వంతులు పేష్కషు చెల్లించు పద్ధతిమీఁద నప్పటికున్న జమీందారులను వారి సంస్థానములు శాశ్వతానుభవముగా స్థిరపఱుపఁబడెను.

ఈపైన వివరింపఁబడిన పర్మనెంటు సెటిల్ మెంటు పెద్దాపురసంస్థానమున కీరాయ జగపతిరాజుమహారాజులుంగారి కాలమున జరిగెను. ఈసెటిల్ మెంటు ననుసరించి గోదావరిజిల్లాలోని చాలభాగము పెద్దాపురసంస్థానమునందలిదై దాదాపుగా నేడులక్షల పేష్కషు చెల్లించుచుండెను. ఈసెటిల్ మెంటు ప్రకారము పిఠాపురము జమీందారీకి రెండున్నరలక్షలును, పోలవరము జమీందారీ కొకలక్షయును, కోటరామచంద్రపురము జమీందారీకి లక్షయిరువదిఐదువేలును పేష్కషు నిర్ణయింపఁబడెను.

ఈ రాయజగపతిరాజు మహారాజులుంగారివద్ద అనప్పిండి ఉమ్మన్నపంతులు గారు దివానుగానుండిరి. మహారాజులుంగారీయనకీదివానుపదవి క్రీ॥ శ॥ ౧౭౭౦ సంవత్సరమున దయచేసిరి. శ్రీ తిమ్మజగపతిరాజు మహారాజులుంగారి పరిపాలనయొక్క కడపటిభాగమందును, నీ ఉమ్మన్నపంతులుగారికి పూర్వమును బాగన్నపంతులుగారును, ఉమ్మన్నపంతులగారి సోదరు లగువిస్సన్నపంతులుగారును దివానులుగనుండిరి. రాజులకు ధనమవసరమయినపుడు, రైతు లొకవేళ నాధనమును సర్దుబాటు చేయలేనిచో దాని నిచ్చుటకు సమర్థతగలవారలే దివానులుగ నియమింపఁబడుచువచ్చిరని చెప్పఁబడుచున్నది.

రెండుసంవత్సరములు గడచినపిదప ననగా ౧౭౭౨ సంవత్సరము డిశంబరునెలలో మహారాజులుంగారీ ఉమ్మన్నపంతులగారిని యేకారణముననో దివానుపదవినుండి తొలగించిరని తెలియుచున్నది.

ఇట్లుండఁగా కోరుకొండ, దొడ్డిపట్ల పరగణాలు ౧౭౭౩వ సంవత్సరమున అమ్మకమునకు వచ్చెను.

అపుడు మహారాజులుంగారు మొగలతుర్రువెళ్లి వేలముపాటలో నారెండు పరగణాలనుకొనిరి. ఆకారణమున ౧౭౭౩వ సంవత్సరము జూలయినుండి యీ రెండు పరగణాలు పెద్దాపురసంస్థానము క్రిందకువచ్చెను.

మొగలతూరు వెళ్లినపుడు కంపెనీవారు వీరిని తమకిదివఱకు బాకీపడియున్న జుమ్మాను చెల్లించవలసినదని నొక్కియడిగిరి. అపుడు రైతులనుండి ధనమువసూలగునట్లు గన్పింపదయ్యెను. ఉమన్నపంతులగారి తరువాతనియమింపఁబడిన క్రొత్త దివానయినను కావలసిన ధనమునొసంగుట కంత ధనికుడు కాడయ్యెను ఈ సందిగ్ధ స్థితిలోనేమి చేయుటకును దోచక శ్రీ మహారాజులుంగారు ఉమ్మన్నపంతులగారికి తిరిగి దివాను పదవినొసంగి ఆయిననుండి కావలసిన ధనమునుఁ దీసుకొనిరి.

సెటిల్మెంటు జరిగిన కొంతకాలమునకుఁ దమ సంస్థానమును బరిపాలించి శ్రీరాజా రాయజగపతిరాజామహారాజులుగారు ౧౨౧౩ ఫసలీ గడవక పూర్వమే క్రోధి సంవత్సరమునకు సరియయిన క్రీ. శ. ౧౮౦౪వ సంవత్సరము ఏప్రియలు ౨౭ దీని పరమపదమునొందిరి. వీరు తమ మరణ సమయమున ఉమ్మన్నపంతులుగారే తమ సనంతరమునఁగూడఁ బనిచేయుటకు కొరకవీలు వ్రాసిరి. వీరు చనిపోయిన పిదప ౧౨౧౪ సలీ నాటికి పెద్దాపురసంస్థానపు డౌలు ౨, ౩౧, ౯౦౬ వరహాలు. కోరుకొండ, డ్డిపట్ల పరగణాలవలన కంపెనీ వారికిఁ జెల్లించుచుండిన జుమ్మా ౨౫ వేల వరహాలు.

కాని యీపైనఁ జెప్పిన కోరుకొండ పరగణావలన రాఁబడి యంతగా రాక వుటయేగాక వచ్చునదియయిన సకాలమున రాకుండెను. ఎందువల్ల ననఁగా పన్ను వసూ చేయు ముజుందార్లుగాని దేశపాండ్యాలుగాని ముతాదారులుగాని యాస్తి పరులుగ ండెడి వారు కారు. ఒకవేళ రైతులవలన రాఁబడి సరిగా రాకపోయినను ముజుందార్లు న్నగు రివిన్యూ యుద్యోగియులు తామాసచ్చుబడికి పూచీపడి దానిని ముందు తాము ల్లించుటకుఁ గూడ నసమర్థులుగ నుండుచు వచ్చిరి. ఇంతియగాక వారి నొక్కొక్క ప్పుడు నమ్ముటకుఁ గూడ వీలులేకుండ వచ్చెడిది. వారి కపటప్రవర్తనమువలన వారి యందలి విశ్వాసము క్రమక్రమముగ క్షయ మగుచు వచ్చెను.

వీరి ప్రవర్తన మిట్లుండ పర్వతప్రాంతముల మన్యములలో నివసించు కోయదొర ం కూడ తరుచుగ కోరుకొండ పరగణాకువచ్చి దోఁచుకొని పోవఁజొచ్చిరి. ఇట్టి వారిలో గాకాలమున పండాదొర ప్రముఖుఁడుగా నుండెను. అతఁడును, మరికొంత ఇతరదొరలును ంపమన్యమునుండివచ్చి, పరగణాను గొల్లగొని మరలి పోవుచుండెడివారు. తగిన సమ ్థులగు నుద్యోగియులు లేక పోవుట చేతను, కోరుకొండపరగణా పెద్దాపురమునకుఁ దూరముగ నుండుటచేతను నాపరగణా విశేషలాభకారి కాదయ్యెను. మేనేజరును, దివా ను నగు ఉమ్మన్నపంతులుగారి లెక్కల వలన ౧౨౧౪ ఫసలీకి, అనగా ౧౮౦౪ సంవ త్సరము జూలై ౧౨ తేదీ మొదలు ౧౮౦౫ సం॥ జూలై ౧౩ తేదికి నీక్రింది వివ రములు తెలియ వచ్చుచున్నవి.

౧౨౧౩ ఫసలీ ఆఖరువరు రొక్కము నిలవ ౪,౭౮౭ వరహాలు. ౧౨౧౪ ఫసలీలో జమీందారీలో వసూలైన మొత్తము ౧,౯౫,౯౨౮ వరహాలు.

ఈఫసలీలోనే బదులు చేసినది. ౫౯, ౯౧౬ వరహాలు. అనగా ఏబాపతు వల్ల వచ్చిన సొమ్మయిన నేమి ౧౨౧౪ ఫసలీలో ౨౬౦౧౪౨ వరహాలు. అయిన ఖర్చులు ౬౨, ౧౧౩ వరహాలు. తీర్చి వేసిన బాకీలు ౧౦౩, ౬౪౫ వరహాలు. కంపెనీ వారికి ౧౨౧౩

ఫసలీకి చెల్లించిన జుమ్మా ౨౩,౦౫౦ వరహాలు. ౧౨౧౨ ఫసలీకి చెల్లించినది ౭౩, ౫౬౦ వరహాలు. ౧౨౧౪ ఫసలీ ఆఖరికి రొఖ్ఖము నిలవ ౧౦౮౨ వరహాలు.

కంపెనీవారి యనుమతి లేనిదే రాజు లిచ్చెడి భూదానములు ౧౭౮౯ సంవత్సరము నుండియు చెల్లవని తెలుపఁబడెను.

తోటపల్లియెస్టేటు, రంప, చోడవరము మొదలగు పదునెనిమిది సర్దారీలును, ఇప్పటి గోదావరిజిల్లాలోని పిఠాపురంయెస్టేటు, రామచంద్రపురం జమీందారీయును దక్క కడమ ప్రదేశమంతయును, కొవ్వూరు తాలూకాయును ఏలూరుతాలూకాలోఁ గొంతభాగమును, ఎర్నగూడెముతాలూకాలోఁ గొంతభాగమును, భీమవరముతాలూకాయును, తణుకుతాలూకాలోఁ జాలభాగమును, నర్సాపురము తాలూకాలో మొగల్తుఱ్ఱు యెస్టేటు మినహాగా మిగిలిన భాగమును గలుపఁగా శ్రీరాయ జగపతిరాజు మహారాజులుం గారు పరిపాలించిన పెద్దాపురసంస్థానముగా నేర్పడఁగలదని చెప్పఁబడుచున్నది.

---

## రా ణు ల ప రి పా ల న ము.

(౧౮౦౪-౧౮౩౭)

### శ్రీలక్ష్మీనరసయ్యమ్మాదేవిగారు.

చని పోయిన శ్రీరాయ జగపతిరాజు మహారాజులుంగారికి లక్ష్మీనరసయ్యమ్మ గారనియు, బుచ్చిసీతయ్యమ్మగారనియు, బుచ్చి బంగారయ్యమ్మగారనియు ముగ్గురు భార్యలు కలరు. వారిలోఁ బ్రథమ భార్యయగు లక్ష్మీనరసయ్యమ్మగారికి ౧౭౯౫ సంవత్సరములో నొక కుమారుఁడు కలిగెను. వారికి శ్రీరాజా బుచ్చిచిన్నజగపతిరాజుగారని నామధేయ మిడిరి. కాని ఆయన తలిదండ్రుల దురదృష్టవశమున నాలుగు సంవత్సరములు మాత్రమే జీవించి, జననీజనకులు బ్రతుకుండఁగనే లోకాంతరగతులైరి. ఆకారణమున శ్రీ రాయజగపతిరాజు మహారాజులుంగారొక వీలు వ్రాసిరి. అవీలు ననుసరించి శ్రీలక్ష్మీనరసయ్యమ్మగారు, గోపాలపురమునన్ను తమ జ్ఞాతులు చిన్నవానిని దత్తత చేసుకొని యాదత్తునిపేరు తిమ్మజగపతిరాజుగారని మార్చి వ్యవహరించుచు నుండిరి. ఆదత్తుఁడు మైనరయినందున సంస్థానమును కంపెనీవారు తమ సంరక్షణక్రిందకు తీసుకొని మహా

ాజులుంగారును లక్ష్మీనరసయ్యమ్మగారును దివానుగ నేర్పఱచిన ఊమ్మన్నపంతులు ారినే మేనేజరుగ నేర్పఱచి సంస్థాన వ్యవహారములను చక్కఁబెట్టుచు వచ్చిరి.

ఆయనయు విశ్వాసముంచి మిగుల చతురతతో రాజ్యమును పాలించుచు నితరుల రిని లక్ష్యపెట్టక సంచరించు చుండెడివారు. ఆకారణమున రాజబంధువులకును యీ వానుగారికినిఁ గిట్టకుండ నుండెడిది.

*భీమవరపుకోటనివాసు లగుశ్రీరాజా వత్సవాయ జగన్నాథజగపతిరాజుగారికిని, మంత్రిగారికిని చాల విరోధముగ నుండెడిదనియు నాకారణమున నీయన తొలఁగింపఁ డుటకు యత్నించుచు వచ్చిరనియు తెలియుచున్నది.

ఈకాలమున నచ్చటచ్చట కలహములు రేగుచు వచ్చుటచేత వీని నణచుటకుఁ ్రొత్తగా కొంతసిబ్బంది యేర్పరుపఁబడుటయు, విశేష వ్యయమగుటయు తటస్థించినది.

ఈసంస్థానమున కయిన వ్యయములు ౧౨౧౩ ఫసలీకి ౪౯,౯౪౬ వరహాలై యుండఁగా ౧౨౧౪ ఫసలీకి ౫౨,౨౧౩ వరహాలయ్యెనని తెలియుచున్నది. ఇందుకు పైనఁజెప్పినవే కారణములని తలంపఁబడుచున్నవి.

శ్రీరాయజగపతిరాజుమహారాజులుంగారాయన తమతల్లిగారగు పెదబంగారయ్యమ్మ గారికి నెలకు ౩౦౦ వరహాలును, పెదభార్యగారికి నెలకు ౨౫౦ వరహాలును రాబడివచ్చు గ్రామముల శిస్తు ఖర్చులనిమిత్తం మీయఁగా కంపెనీవారంగీకరించిరి. కాని యేకారణ ముననో పెదబంగారయ్యమ్మగారి కీయవలసిన సొమ్ము యీలక్ష్మీనరసయ్యమ్మగారి కాలము నాఁటికి ౯౫౦౦ వరహాలు బాకీపడియుండెను. వీరును వీరిసవతిగారగు బుచ్చిసీతయ్య మ్మగారును స్నేహముగ నుండినటులయును వీరి రెండవసవతిగారగుబంగారయ్యమ్మ గారికిని వీరికిని విరోధముగ నుండుచు వచ్చినటులయును తెలియుచున్నది.

వీరికాలమునఁగూడ రయితులనుండి సొమ్ము సరిగ వసూలుకాకపోవుటచేత ౧౮౦౫ సం॥ జూలై ౧౨ తేదినాఁటికి కంపెనీవారికి చెల్లించవలసిన ౫౬,౯౪౭ వరహాలు జుమ్మా బాకీపడి యుండవలసివచ్చెను. తరువాత నయినను యీబాకీగాని పెదబంగారయ్యమ్మ గారి కీయవలసిన బాకీగాని చెల్లింపఁబడినట్లు నాకు దొరకిన యాధారములనుబట్టి తెలి యుటలేదు.

---

* వీరు కోటసంపాదించిన శ్రీముసలితిమ్మరాజుగారి ద్వితీయపుత్రు లగు శ్రీ గోపాలరాజుగారి కైదవపురుషులై యున్నారు.

* క్రీ. శ. ౧౮౦౬ సంవత్సరమున తమస్వంత సెలవు నిమిత్తము నెలకు పెదబంగారయ్యామ్మగారికి ౩౦౦ వరహాలును, లక్ష్మీనరసయ్యామ్మగారికి ౨౫౦ వరహాలును, బుచ్చిసీతయ్యామ్మగారికి ౧౦౦ వరహాలును, బుచ్చిబంగారయ్యామ్మగారికి ౫౦ వరహాలును సంస్థానాదాయమునుండి యిచ్చుచుండుటకు కంపెనీవారు స్థిరపఱచిరి.

వీరికాలమునఁగూడ కొన్నిసంవత్సరములవఱకు వీరియత్తగారగు పెదబంగారయ్యామ్మగారు జీవించియున్నటుల తెలియవచ్చుచున్నది. ఈసంస్థానమున నచ్చటచ్చట రేగినకలహముల నణచివేయుట కుపయోగింపఁబడిన సైన్యమువిషయమున నెక్కువ వ్యయమయినదని గవర్నమెంటువారు ౧౮౦౬ సం॥ న సంస్థానమునకు ౧౦౫౧౬ వరహాలు రిమీషను నిచ్చిరి.

సంస్థానముయొక్క రాజకీయస్థితి పైవిధముగ నున్నకారణమున శ్రీరాజా తిమ్మజగపతిరాయనామాంకితు లగునాదత్తపుత్రులు తన్ను పెంచుకున్న తల్లిని విచారసాగరమున ముంచి విధివశులైరి.

ఈదత్తుని మరణానంతరమున శ్రీలక్ష్మీనరసయ్యామ్మగారు రెండవమారు దత్తుచేసికొనుటకుఁ బ్రయత్నించఁగా నప్పుడున్న వత్సవాయవారంపతిలో దగ్గిరవారును నైన భీమవరపుకోట శ్రీరాజా వత్సవాయ జగన్నాథజగపతిరాజుగారు దత్తుతీసుకొనుట యొక్కపర్యాయమే గాని రెండవమారు కూడదని వాదముచేసి దావా తెచ్చిరి. అప్పుడు రాజమహేంద్రవరము జిల్లాకోర్టునకుఁ బైనిదగు బందరులో నున్నప్రొవిన్షియల్ కోర్టువారు వ్యాజ్యమును విచారించి రెండవపర్యాయము దత్తుతీసికొనుట శాస్త్రసమ్మతము కాదని నిర్ణయించిరి. అటుతరువాత పెద్దాపురసంస్థానమును పురుషులే కాని స్త్రీలు పరిపాలించకూడదనియు, మేము ముఖ్యవారసులము గనుక జమీందారీని మావశము చేయవలసినదనియుఁ బైనఁజెప్పిన శ్రీరాజా జగన్నాథజగపతిరాజుగారే తిరిగి వ్యాజ్యము తెచ్చిరి. ఆ వ్యాజ్యము నప్పటి రాజమహేంద్రవరము జిల్లాకలెక్టరుగారు విచారించి యుభయులకు రాజీనామా కుదిర్చిరి. ఆ రాజీప్రకారము శ్రీలక్ష్మీనరసయ్యామ్మాదేవిగారే తామున్నంతకాలమును సంస్థానమును బరిపాలించుటకును, ఆమె యనంతరమున జమీందారీ యంతయు దావా తెచ్చిన శ్రీరాజా జగన్నాథజగపతిరాజుగారికి చెందుటకును, అంతవఱకు పెద్దాపురపు జమీందారీలోనిదగు కొత్తాము యెస్టేటును వారికిచ్చుటకు నిర్ణయింపఁబడినదని చెప్పుదురు.

---

* Report of W. Wayte, acting Secretary to the Govt. in 1806 A. D.

ఆపరికారమే క్రీ. శ. ౧౮౧౦ వ సంవత్సరమున కోర్టాఫు యస్టేట్సు పెద్దాపురపు జమీందారీనుండి చీలిపోయి శ్రీరాజా వత్సవాయ జగన్నాథజగపతిరాజుగారి కీయఁ బడెను.

ఈ లక్ష్మీనరసయ్యమ్మా దేవిగారు పదిసంవత్సరములు పరిపాలించి క్రీ. శ. ౧౮౧౪ సంవత్సరమునఁ జనిపోయిరి.

---

## —• శ్రీబుచ్చిసీతయ్యమ్మా దేవిగారు •—

అటుతరువాత చనిపోయిన శ్రీ రాయజగపతిరాజుగారి ద్వితీయభార్యయయిన శ్రీ బుచ్చిసీతయ్యమ్మా దేవిగారు పరిపాలనాభారమును వహించిరి. కాని భీమవరపుకోట శ్రీరాజా వత్సవాయ జగన్నాథజగపతిరాజుగారిదివఱలో రాజమహేంద్రవరము జిల్లాకలెక్టరుగారుచేసిన రాజీ ప్రకారము తమకే యధికారము రావలెనని దావాచేసిరి. ఆ దావాపర్యవసానము తేలునఱకు జమీందారీ గవర్నమెంటువారి స్వాధీనమున నుంచఁ బడెను. ఈదావా పదునాల్గుసంవత్సరములు జరిగినపిదప కట్టకడపట శ్రీ బుచ్చిసీతయ్యమ్మా దేవిగారి పక్షమునఁ దీర్పుచేయఁబడినది. ఆతీర్పుప్రకార మప్పటికున్న రాణు లందఱియనంతరమునఁ గాని వారసు లగు శ్రీరాజా జగన్నాథజగపతిరాజుగారికి జమీందారీ వశముకాఁగూడ దనియుఁ జమీందారీ యమానీలో నున్నకాలమున నిలువయున్న సొమ్ము శ్రీ బుచ్చిసీతయ్యమ్మా దేవిగారి కొప్పగింపఁబడవలయు ననియు నేర్పాటు జరిగెను.

తీర్పు తమపక్షమైన సంవత్సరముననే యనఁగా ౧౮౨౮ లో శ్రీ బుచ్చిసీతయ్యమ్మాదేవిగారు సింహాసన మెక్కిరి. సింహాసనమెక్కిన యొకటి రెండు సంవత్సరములలో నామె పెద్దాపురమున నొక సత్రమును, ఒంటిమామిడిగ్రామమున నొకసత్రమును స్థాపించి యందు నిర్విఘ్నముగ నన్నదానము జరుగుటకై సుమారు ౮ వేల రూపాయల సాలీనా యాదాయముగల భూముల నొసంగెను. ఈ రెండు సత్రములలోను పఙ్త్కిభేదము లేక రెండుపూటల నన్నదానము చేయఁబడును. పెద్దాపురమున నున్నసత్రమును, ఒంటిమామిడినుండి కత్తిపూడి (పెద్దాపురమున కీశాన్యదిక్కుగా పదునేడుసగమైళ్ళదూరమున నున్నది) కి మార్చఁబడిన రెండవసత్రమును ప్రస్తుతమున గవర్నమెంటువారి స్వాధీనముననుండి పూజ్యురాలును, నౌదార్యగుణసంశోభితయు నగు మానవతీశిరోమణి శ్రీ బుచ్చిసీతయ్యమ్మా దేవిగారి శుభ్రకీర్తిని జాటుచున్నవి.

తరువాత శ్రీబుచ్చిసీతయ్యమ్మాదేవిగారు తమ భర్తగారి రండవ భార్యలకు దత్తుతీసికొన నధికార మిచ్చిరను కారణమునఁ దమ సవతిగారైన శ్రీలక్ష్మీనరసయ్యమ్మగారు చేసి

కొన్ని స్వీకారము చెడిపోయినది గనుక తాము మఱి యెవరినైనఁ బెంచుకొనుట కభ్యంతర ముండకూడదని నిశ్చయించి పెంపకపు ప్రయత్నము చేయుచువచ్చి తుదకు కోటగండ్రేడు గ్రామముననున్న తమ మేనత్తమనుమలును శ్రీరాజా వత్సవాయ నరసరాజుగారి పౌత్రులునైన శ్రీ రాజా వేంకటజగపతిరాజుగారినిఁ దీసికొనివచ్చి తమసంరక్షణలో నుంచుకొని పెంచుచు వచ్చిరి.

ఈపైనిఁ జెప్పిన శ్రీరాజా వత్సవాయ నరసరాజుగారు, పెద్దాపురసంస్థానము సంపాదించిన వత్సవాయ ముసలి తిమ్మరాజుగారి పెదతాతగారి సోదరుల కారవపురుషులును, దొంతమూరు నివాసస్థులునై యుండిరి. విజయనగరసంస్థానమున బహాద్దూరు శ్రీసరులని పేరువడిన శ్రీ దాట్ల వేంకటరాజు సమందానుగారికి పిల్లనిచ్చుటచేత నాసంబంధము ననుసరించి విశాఖపట్టణమండలమున కరిగి విజయనగరసంస్థానములోనిదగు కోటగండ్రేడు గ్రామమును నివాసముగా నేర్పఱచుకొని విజయనగరసంస్థానాధీశుల కనేక యుద్ధముల సహాయులై యుండి వారివలన విశేషగౌరవమును బిరుదములనుపొంది కొన్ని యేస్టేట్లనుగూడ వారినుండి గుత్తకుఁ బుచ్చుకొని విశేషధనము నేకాకి యశోధనమును గూడ సముపార్జించిరి. వారు తుదకు శ్రీ విజయనగర పరిపాలకులైన చినవిజయరామగజపతిరాజుమహారాజులుంగారికి సైన్యసమేతముగ సహాయులై వెళ్లి పద్మనాభయుద్ధమున వారితోఁబాటు వీరశయనము నొందిరి.

శ్రీ బుచ్చిసీతయ్యమ్మాదేవిగారు తమసంరక్షణమునఁ బెరుగుచున్న క్షత్రియవంశసంజాతులగు శ్రీరాజా వేంకటజగపతిరాజుగారిని యథాశాస్త్రీయముగాఁ బెంపకముచేసికొని, మహావైభవమున వివాహమాచరించి ఆయనయే సంస్థానమునకుఁ బ్రభువు అని ప్రకటించిరి.

ఈసమాచారమును వీరిసవతిగారగు శ్రీబుచ్చిబంగారయ్యమ్మాదేవిగారు తెలిసికొని పెద్దరాణిగారు దత్తుతీసికొనఁగా దానికి విఘాతము వచ్చినది గనుక యిటులఁ బెంపకముచేసికొనఁ గూడదనియు, పెంపకము రద్దుచేయవలసిన దనియు ౧౮౩౬ సం॥ జిల్లాకోర్టులో ౮ నెంబరు దావా తెచ్చిరి. వెనుకటివలెనే బందరు ప్రొవిన్షియల్ కోర్టువారు సదరు దావాను విచారించి మాజీల దత్తముచేసికొనుట కధికారము లేదని తీర్మానించిరి.

అటు పిమ్మట శ్రీబుచ్చిసీతయ్యమ్మగారు కొన్ని యీనాంభూములు ముఖ్యముగా దత్తపుత్రునికిచ్చి యింకను విశేషోపకారము చేయు తలంపుననుండఁగా నామె యాకస్మికముగా విషూచిజాడ్యమువలన క్రీ. శ. ౧౮౩౯వ సంవత్సరమునఁ గాలధర్మము నొందిరి.

దత్తులగు శ్రీరాజా వేంకటజగపతిరాజుగారును దమకొసంగఁబడిన యీనాం భూములవలనఁ గాలక్షేపము చేయుచుఁ దమ పెంపుడు తల్లిగారి వద్దనే యుండెడివారు

ట్లుండఁగా కళత్రవియోగము సంభవించినందున ఆయన మరల కాకినాడ తాలూకా లంక నివాసులును, శ్రీవైష్ణవభక్తాగ్రేసరులును, విద్వాంసులును నగు శ్రీ దంతులూరి గన్నాథరాజుగారి జ్యేష్ఠపుత్రిక యయిన శ్రీవేంకటరమణయ్యమ్మగారినిఁ బరిణయమైరి. వ్యులగు నీ యిరువురుదంపతులకు శ్రీరాజా సీతారామజగపతిరాజుగారు శ్రీరాజా రాయజగపతిరాజుగారు ననునిరువురు పుత్రులు కలిగిరి. పుత్రలాభమును బొందిన గొంత కాలమునకు శ్రీరాజా వేంకటజగపతిరాజుగారు స్వర్గస్థులైరి.

శ్రీరాజా వేంకటజగపతిరాజుగారి ప్రథమపుత్రులైన శ్రీరాజా సీతారామజగపతిరాజుగారికి వేంకటజగపతిరాజుగారు, అప్పలనరసింహజగపతిరాజుగారు, వేంకటసూర్యనారాయణజగపతిరాజుగారు నను ముగ్గురు కొమారులు కలరు. వారిలో ప్రథములైన వేంకటజగపతిరాజుగారికి సంతానము లేదయ్యెను. ఇట్లుండఁగనే వారు లోకాంతరగతులైరి. ద్వితీయులైన అప్పలనరసింహజగపతిరాజుగారికి చినసీతారామజగపతిరాజను నొక కుమారుఁడు కలఁడు. తృతీయులగు వేంకటసూర్యనారాయణజగపతిరాజుగారికి పెదసీతారామజగపతిరాజను తనయుఁడు కలఁడు. ఇటీవల శ్రీరాజా సీతారామజగపతిరాజుగారి ద్వితీయపుత్రులగు అప్పలనరసింహజగపతిరాజుగారు దేహవియోగమునొందిరి,

శ్రీరాజా వేంకటజగపతిరాజుగారి ద్వితీయపుత్రులును ధర్మశాస్త్ర, వైద్యశాస్త్ర, జ్యోతిశ్శాస్త్ర, పారంగతులని ప్రసిద్ధిగాంచిన వారును గీర్వాణపండితులును నగు శ్రీరాజా రాయజగపతిరాజుగారు నా పితామహులు. వీరు చిరకాలము జిల్లాబోర్డు మెంబరుగానుండి దేశక్షేమమునకై పాటుపడి గవర్నమెంటువారికి శ్లాఘాపాత్రులైరి. శ్రీ విక్టోరియా మహారాజ్ఞిగారి షష్టిసంవత్సర పట్టాభిషేక మహోత్సవము సందర్భమున ౧౮౯౭వ సంవత్సరము ఫిబ్రవరి ౧౬వ తేదీని శ్రీ కలకత్తా గవర్నరుజనరలుగారు వీరికొక పట్టా నొసంగిరి. శ్రీరాము భక్తులగు వీరికి వైష్ణవభక్తియు, పురాణశ్రవణాసక్తియు విశేషముగఁగలదు. వీరు సుమారు డెబ్బదేండ్ల ప్రాయముగలవారై, వైష్ణవారాధన పరులై యున్నారు.

శ్రీరాజా రాయజగపతిరాజుగారికి వేంకటజగన్నాథజగపతిరాజుగారు, నారాయణజగపతిరాజుగారు, వరాహనరసింహజగపతిరాజుగారు, లక్ష్మీనరసింహజగపతిరాజుగారు, నను నలుగురు తనయులు కలిగిరి. వీరిలో మొదటివారును నాలవవారును సంతానవిహీనులుగనే స్వర్గమునొందిరి. రెండవవారైన శ్రీరాజా నారాయణజగపతిరాజుగారు నా జనకులు. ఆధునిక ఆంగ్ల క్షత్రియ లోకము వీరి పరోపకార పారీణతను వెల్లడించుచున్నది. వీరికి రాయజగపతివర్మ, వేంకటజగన్నాథజగపతిరాజు, వేంకటసూర్యనారాయణజగపతిరాజు, నను ముగ్గురు తనయులున్నారు. వారిలో

నేను పరిధమకళత్రపుత్రుడను. మిగిలిన యిరువురును ద్వితీయకళత్రసంజాతులు. తృతీయులును నాపినతండ్రులును నగు వరాహనరసింహజగపతిరాజుగారికి చినరాయజగపతిరాజు, వేంకటరామజగపతిరాజు, నారాయణజగపతిరాజు ననుముగ్గురుకొమారులున్నారు.

---

## శ్రీబుచ్చిబంగారయ్యమ్మదేవిగారు.

శ్రీ బుచ్చిసీతయ్యమ్మదేవిగారి యనంతరము శ్రీరాజా రాయజగపతిరాజుగారి తృతీయ భార్యయగు శ్రీబుచ్చిబంగారయ్యమ్మదేవిగారు రాజ్యభారమువహించిరి. వీరు సిద్ధాంతంనివాసులునగు నల్లపరాజు శ్రీహరిరాజుగారి తోఁబుట్టువులును శ్రీముగలతూరు సంస్థానప్రభువులగు కలిదిండి వారికి సమీప బంధువులునునై యున్నారు. వీరికిని, వీరి సవతిగారగు లక్ష్మీనరసయ్యమ్మదేవిగారికిని తఱచు వివాదములు గలుగుచుండెననియు, కంపెనీవారట్టి వివాదములను పరిష్కరించుచుండెడు వారనియు తెలియుచున్నది. వీరు రెండేండ్లు మాత్రము రాజ్యముచేసి స్వర్గస్థులైరి. వీరి కాలమున తెలిసికొనఁదగిన విశేషము లేమియుఁ గానరావు.

---

## సంస్థానచరమదశ.

శ్రీ బుచ్చిబంగారయ్యమ్మదేవిగారు పరమపదించిన పిదప ౧౮౦౩వ సంవత్సరమున శ్రీరాజావత్సవాయ జగన్నాధజగపతిరాజుగారి జ్యేష్ఠపుత్రులైన శ్రీరాజా సూర్యనారాయణజగపతిరాజుగారు తమపత్తునైన కడపటిదావాలేన్పు ప్రకారము సాధికారముగను వచ్చి కొద్దిసంవత్సరములు మాత్రమే రాజ్యమేలిరి. వీరు పిఠాపురపుకోట నివాసులును, వారి పినతండ్రిగారును నగు శ్రీరాజా వేంకటనరసింహరాజుగారి కుమాళ్ళు శ్రీరాజా సూర్యనారాయణరాజుగారు, శ్రీరాజా జోగిజగన్నాథరాజుగారు, శ్రీరాజా వెంకటకృష్ణంరాజుగార్లకు విశేష భూవసతులు నేర్పఱచి యున్నారు. వీరికి శ్రీరాజా వెంకట జగన్నాధజగపతిరాజుగారనియు, శ్రీరాజా వెంకట సింహాద్రిజగపతిరాజుగారనియు, నిద్దరుకుమారులు గలిగిరి. సంతానముగలిగిన కొంతకాలమునకు వీరు స్వర్గస్థులైరి. తరువాత పెద్దకుమారులగు శ్రీరాజా వెంకటజగన్నాధజగపతిరాజుగారు కొత్తాం జమీందారులైరి. వీరికి పుత్రసంతతి కలిగినది గాని బాల్యముననే తల్లిదండ్రులను దుఃఖసాగరమునముంచి, యాబాలుఁడు చనిపోయెను. తరువాత వీరు స్వల్పకాలము మాత్రము పరిపాలించి చనిపోయిరి.

వీరి సోదరులగు శ్రీరాజా వెంకటసింహాద్రిజగపతిరాజుగారు మజిల కొత్తాం
స్టేటు జమీందారులైరి. వీరధికారమునకు వచ్చిన కొద్దికాలమునకు పుత్రసంతానము
వదిగాని యాబాలుఁడయిదు సంవత్సరములు మాత్రము జీవించి, తలిదండ్రులను
నువులను దుఃఖసాగరమున ముంచి స్వర్గస్థుఁడాయెను.

శ్రీరాజా వెంకటసింహాద్రిజగపతిరాజుగారు బహు ధర్మాత్ములై దేశాభిమానము
ై తమ రైతుల ననేక విధముల సంరక్షించుచువచ్చిరి. వీరు తమ రాజధాని యగు తుని
ామమున నొక హైస్కూలుపాఠశాలయును, (High School) అన్ని వర్ణములవారికి
ద్దానము చేయుట కొక మహాసత్రమును, నేర్పఱచుటయే గాక, రాజధాని గ్రామ
మందును, వేరు కొన్ని యితర గ్రామములయందును, పెద్ద పెద్ద మామిడితోటలు
న్నగునవి యేర్పఱచిరి. అరణ్యములయందు పశ్వులనివాసము నిమిత్తము పెద్దస్తంభ
ములను కట్టించియు, వాటికి నీటివసతు లేర్పరచియు, తునిగ్రామమందు కర్మాగారము
స్థాపించి, దేశీయుల స్వతంత్ర జీవనాభివృద్ధికి పురికొల్పియు విశేషకీర్తిని సంపా
దించిరి. వీరొకముద్రాక్షరశాల నేర్పఱచి యనేక గ్రంథములను ముద్రింపించియు,
స్వయముగా గ్రంథములను రచించియు భాషాభివృద్ధికి తోడ్పడిరి. ఆయుర్వేదౌషధ
ములను విరివిగా చేయించి ప్రతివారికిని నుచితముగ నిచ్చుచు, ప్రజల యారోగ్యాభి
వృద్ధికి తోడ్పడినవారైరి. వీరు నాలుగు సంవత్సరములక్రితమే కీర్తిశేషులైరి.

వీరి తండ్రిగారు పెద్దాపురసంస్థానమును పరిపాలించుచున్నకాలమున ననఁగా
క్రీ. శ. ౧౭౩౯ వ సంవత్సరమున, దేశమున క్షామ మతిశయించియుండుటచేత దొర
తనమువారికి చెల్లించవలసిన పేష్కషువిస్తారము బాకీపడియుండెను. ఆకారణమున
ర్లంపూడి, దొంతమూరు, వీరవరము, కోలంక, గొల్లప్రోలు, జగ్గంపేట, పలివెల,
గోపాలపురం, కపిలేశ్వరపురం, తోటపల్లి, మొదలగు పెద్దాపురంజమీందారీలోని
చాలగ్రామములు ముఠాలు వేలమువేయబడి యన్యాధీనములయ్యెను.

దొరతనమువారి కీయవలసిన పేష్కషు విశేషముగనుండుట తఱుచు బాకీప
డుట, చిన్న చిన్న యస్టేట్లు తఱుచు వేలము వేయబడుట యీమొదలగు చిక్కు
లీసంస్థానమున కనేకమారులు తటస్థించుటచేత నీబాధలు పడుటకంటె దొరతనమ
వారికే యీశేషించిన సంస్థానము నిచ్చివేయునెడల నుత్తమముగా నుండుననియు,
నందువలనఁ దమకు తౌజీకూడ విశేషముగ రాఁగలదనియు నెంచి శ్రీరాజా సూర
నారాయణజగపతిరాజుగారు తమకు పూర్వమునుంచి జరుగుచున్న కొత్తాం యస్టేటు
మాత్ర ముంచుకొని, మిగిలిన సంస్థానమును గవర్నమెంటువారి యధీనము చేసి

పిమ్మట కొంతకాలమునకు కనఁగా ౧౮౭౩ వ సంవత్సరమున జ్ఞాతులలో వచ్చిన కలహములవలనను, వేరు కొన్ని యితర కారణముల వలనను, కోట భూమి లోగిళ్లు వార్తనమువారి వశము చేయఁబడినట్లు చెప్పఁబడుచున్నది.

శ్రీరాజా సూర్యనారాయణ జగపతిరాజుగారు సంస్థానమును విచ్చివేసినంతనె లక్షైక గవర్నమెంటువారు వీరికి నెలకాఱువందల రూప్యముల చొప్పున తౌజీ నిచ్చుచు వచ్చిరి. ఆతౌజీలో అయిదువందల రూపాయిలు వారు పుచ్చుకొని, నూరు రూపాయిలు వీరి సోదరులును, పెద్దాపుర గ్రామములో నివాసముగా నున్నవారును నగు శ్రీరాజా తిమ్మజగపతిరాజుగారి కిచ్చుచువచ్చిరి.

ఈతిమ్మజగపతిరాజుగారికి శ్రీరాజా వెంకటజోగిజగన్నాథజగపతిరాజుగారు, శ్రీరాజా వెంకటనారాయణజగపతిరాజుగారు, శ్రీరాజా వెంకటసూర్యనారాయణ జగపతిరాజుగారు నను మువ్వురు కుమారులు గలిగిరి. వీరిలో జ్యేష్ఠులగు శ్రీరాజా వెంకటజోగిజగన్నాథజగపతిరాజుగారికి శ్రీరాజా వెంకటసుదర్శనతిమ్మజగపతిరాజుగారను పుత్రులును, శ్రీరాజా వెంకటజోగిజగన్నాథజగపతిరాజుగారను పౌత్రులును గలరు. రెండవవారగు శ్రీరాజా వెంకటనారాయణజగపతిరాజుగారికి శ్రీరాజా వెంకటసూర్యనారాయణజగపతిరాజుగారను పుత్రులును, శ్రీరాజా సరాహ వెంకటనారాయణజగపతిరాజుగారు, శ్రీరాజా వెంకటసూర్యనారాయణజగపతిరాజుగారు నను పౌత్రులును గలరు.

పైవారిలో శ్రీరాజా తిమ్మజగపతిరాజుగారు, వారి జ్యేష్ఠపుత్రు లగు శ్రీరాజా వెంకటజోగిజగన్నాథజగపతిరాజుగారును చనిపోయినపిమ్మట శ్రీరాజా వెంకటనారాయణజగపతిరాజుగారును, వారి సోదరులును, తమకు తౌజీ నాపుచేయుట న్యాయము కాదని సకారణముగ దొరతనమువారికి తెలియఁజేసినందున, వీరుభయుల జీవితకాలమువరకును చెరి యేబది రూప్యములను నిచ్చుచువచ్చి, పిమ్మట తౌజీ నిచ్చుట మానివేసిరి. ఇటీవల గోదావరిజిల్లా కలెక్టరు బి. ఏ. బ్రాండీదొరగారు శ్రీరాజా బుచ్చిసీతయ్యమ్మాదేవిగారి పౌత్రులైన శ్రీరాజా రాయజగపతిరాజుగారికి జిరాయితీ రేటుకట్టి కోటభూమి నంతయును స్వాధీనము చేసియున్నారు. ప్రస్తుత మాభూమి వీరిస్వాధీనములోనే యున్నది.

## వి శే షాం శ ము లు.

---

౧. పెద్దాపురముకోటయొక్క పదునెనిమిది బురుజులలోను, తాళ్ళబురుజు, హనుమంతబురుజు, తోకబురుజు, మున్నగునవి సుప్రసిద్ధములు.

౨. కోటలో నిప్పటికిని మదీనాపాచ్ఛాగారి గోరీ యని యొక గోరీ కలదు. ది పది యడుగుల పొడవు కలదు. ఈగోరీ కోటకట్టుటకుఁ బూర్వము నుండియు నుండెనని పెద్ద లందురు. ఈపెద్దాపుర సంస్థాన ప్రభువు లందఱు మహమ్మదీయుల పండుగ దినములలో విశేషోత్సవములు చేయుచుండెడివారు. ఈగోరీ విషయమై యందఱుమహమ్మదీయ పండితులను కనుఁగొన, నీస్థల మొక పుణ్యక్షేత్రముగాఁ దమ గ్రంథములఁ జెప్పఁబడినట్లు చెప్పుదురు. అందులకుఁ దారాళముగా నేఁటేఁ బరప్రదేశములనుండి కొంతమంది యాత్రికులువచ్చి మొక్కుబడులు చెల్లించుచుందురు.

౩. కొత్తాం యస్టేటు కీర్తిశేషులైన శ్రీరాజా వెంకటసింహాద్రిజగపతిరాజా గారి పెద్ద భార్యగారగు శ్రీరాజా వత్సవాయ వెంకటసుభద్రయ్యమ్మాజగపతిదేవి గారిచేతఁ బరిపాలింపఁబడుచున్నది. వీరు పరిపాలనమునకు వచ్చిన సంవత్సరమునందే వీరి రాజధానియగు తుని గ్రామమునం దొక వేదశాస్త్రపాఠశాలను స్థాపించి, విద్యార్థులకు భోజన వసతు లేర్పఱచి ప్రసిద్ధిగాంచిరి. తమ భర్తగారేర్పఱచిన హూణపాఠశాలాభివృద్ధికి పాటుఁబడుచు, బీదలగు విద్యార్థులకు భోజనవసతులేర్పఱచి కొందఱికి నుచిత విద్య నిప్పించుచు, దేశాభివృద్ధికి పాటుఁబడుచున్న సంగతి యాంధ్రలోక మెఱిఁగియున్నది. వీరధికారమునకు వచ్చిన పిమ్మట బంధుకోటి కనేక భూవసతులను నగదు వసతులను, నేర్పాటు చేయుచు ఆధునికాంధ్రక్షత్రియలోకమున మిగుల ప్రఖ్యాతి నందుచున్నారు. వీరి పురాణ శ్రవణాసక్తియు, దైవారాధన తత్పరతయు, నెల్లరకు విదితమే. వైష్ణవభక్తాగ్రేసరియగు నీసాధ్వి. కోలంక నివాసస్థులును, భాగవతాగ్రేసరులును, బంధుజనాభిమానులును, నాపితామహులకు మేనమామగారును, నగు శ్రీదంతులూరి అచ్యుతరామరాజుగారికి ప్రథమపుత్రిక. వీరి సంస్థానమున సుమారు నలుబది గ్రామములు కలవు. కొంచెము హెచ్చుతగ్గుగా ముప్పదివేల రూప్యముల పేష్కషు గవర్నమెంటువారికి చెల్లింపఁబడుచున్నది.

ఒకప్పుడు మహదైశ్వర్యభోగముల ననుభవించి, నిస్తుల శౌర్యపరాక్రమా[illegible]సును, అపార పాండిత్యసంపదను ఆంధ్రకవీంద్రపోషణమునను, ప్ర

ఖ్యాతికెక్కిన రాజచంద్రులచేతఁ బరిపాలింపఁబడి విరాజిల్లిన శ్రీ పెద్దాపు[illegible] చరిత్ర మిప్పటికి ముగింపునకు వచ్చినది. కన్నులారఁ జూచు మన్న[illegible] చారిత్రము మాత్రము గాన్పించుచున్నది గాని సంస్థాన మానాఁడే [illegible] గర్భమున మటుమాయ మైనది. ఆహా! ఎప్పు డెటుపోయి యెటువచ్చునో కుత్తర క్షణమున నేమి సంభవించునది యుఁ గూడ నో [illegible] యైనను [illegible] కదా! భగద్విలాస మెంతటి కవిపుంగవులకైన వర్ణనాఽసాధ్యము [illegible] ములు దుర్గ్రాహ్యములు!

పూర్వమొకప్పు డీపెద్దాపురసంస్థానమునకే యని [illegible] ప్పటికిని కొత్తాం, వీరవరము, కిర్లంపూడి, జగ్గంపేట, గొల్లప్రోలు గోపాలపురము. కపిలేశ్వరపురము, మున్నగు [illegible] నిలిచి ఎన్ని స[illegible]లు పోయినను, యెన్ని రాజ్యములు గతించినను, వాని మాత్రము చిరస్థాయిగా నుండఁగలవు.

శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్ర భాషానిలయ
విభాగము ....
విభాగ సంఖ్య ....